SAPTHAGIRI
(TELUGU)
SPIRITUAL ILLUSTRATED
MONTHLY
Volume: 54, Issue:01
JUNE - 2023
Price Rs. 20/-

తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక

జూన్ 2023
వెల రూ. 20/-
పుటలు-56



వజ్రకవచ సమర్పణ
(02-06-2023)

ముత్యపుకవచ సమర్పణ
(03-06-2023)

స్వర్ణకవచ సమర్పణ
(04-06-2023)

తిరుమల
## శ్రీవారి జ్యేష్ఠాభిషేకం
02-06-2023 నుండి 04-06-2023 వరకు

# తిరుమల తిరుపతి దేవస్థానములు

## పంచగవ్య ఉత్పత్తులు

**ఉర్వి నాసల్ డ్రాప్స్**
జలుబు, తలనొప్పులను నివారిస్తుంది. (కన్ను, ముక్కు, చెవి).

**భూమి హెర్బల్ ఫ్లోర్ క్లీనర్**
నేలపై ఉన్న బ్యాక్టీరియాను నిర్మూలిస్తుంది.

**నందిని గౌ-ఆర్క్**
క్రమం తప్పక వాడిన దీర్ఘాయుర్దాయం, జీవనప్రమాణకాలం మెరుగుపడతాయి.

**క్షమా కౌ డంగ్ కేక్స్**
యజ్ఞాలు, యాగాల్లో... మంచి వాతావరణం కల్గిస్తుంది.

**భువతి డంగ్ లాగ్స్**
యజ్ఞాలు, హోమాల్లో... మంచి వాతావరణం కల్గిస్తుంది.

**అవని ధూప్ చూర్ణం**
సువాసనను కల్గిస్తుంది.

**ధరణి అగరుబత్తి**
ఆహ్లాదకర వాతావరణం కల్గిస్తుంది.

**ధాత్రి సాంబ్రాణి కప్స్**
మంచి ఆరోగ్యానికి ఆలంబననిస్తుంది.

**వైష్ణవి ధూప్ స్టిక్స్**
వాతావరణాన్ని శుభ్రపరుస్తుంది.

**వారాహి ధూప్ కోన్స్**
చుట్టుప్రక్కల వాతావరణాన్ని పవిత్రపరుస్తుంది.

**పృథ్వి విభూతి**
ఈశ్వరానుగ్రహప్రాప్తి కల్గిస్తుంది.

**ధన్శిక హెర్బల్ టూత్ పౌడర్**
దంతములు, దంతచిగుర్లకు రక్షణనిస్తుంది.

**హిరణ్మయి హెర్బల్ ఫేస్‌ప్యాక్**
రంగు, ముఖవర్చస్సులను మెరుగుపరుస్తుంది.

**మహి హెర్బల్ సోప్**
చర్మాన్ని సంరక్షిస్తుంది.

**కశ్యపి హెర్బల్ షాంపు**
శిరోజాలను సంరక్షిస్తుంది.






వివరాలకు - 0877-2277777, 2233333



# గీతాశ్లోకార్థసారం

**శ్లో : గురూనహత్వా హి మహానుభావాన్ శ్రేయో భోక్తుం భైక్ష్యమపీహ లోకే।**
**హత్వార్థకామాంస్తు గురూనిహైవ భుంజీయ భోగాన్ రుధిరప్రదిగ్ధాన్ ॥**

(శ్రీమద్భగవద్గీత 02వ అధ్యాయం-05వ శ్లోకం)

**ప్రతిపదార్థం:** మహానుభావాన్= మహానుభావులైన; గురూన్= గురువులను; అహత్వా= చంపక; ఇహ లోకే= (నేను) ఈ లోకమున; భైక్ష్యమ్ అపి= భిక్షాన్నమునైనా; భోక్తుమ్= తినుట; శ్రేయః= శ్రేయస్కరము (అని భావింతును); హి= ఎందులకనగా; గురూన్= గురుజనులను; హత్వా(అపి)= చంపి అయినా; ఇహ= ఈ లోకమున; రుధిరప్రదిగ్ధాన్= రక్తసిక్తమైన; అర్థకామాన్= అర్థకామ రూపములైన; భోగాన్ ఏవ తు= భోగములనే; భుంజీయ= అనుభవింపవలసి ఉంటుంది గదా!

**భావం:** మహానుభావులైన ఈ గురుజనులను చంపకుండా భిక్షాటనతో అయినా ఈ లోకమున జీవించుట నాకు శ్రేయస్కరమే. ఎందుకంటే ఈ గురుజనులను చంపి, రక్తసిక్తములైన రాజ్యసంపదలను, భోగాలను మాత్రమే నేను అనుభవింపవలసి ఉంటుంది గదా!

## కలిదోషహరణ జగన్నాథా!

త్వమేవ శరణం త్వమేవ శరణం
కమలోదర శ్రీజగన్నాథా

వాసుదేవ కృష్ణ వామన నరసింహ
శ్రీసతీశ సరసిజనేత్రా
భూసురవల్లభ పురుషోత్తమ పీత-
కౌశేయవసన జగన్నాథా

బలభద్రానుజ పరమపురుష దుగ్ధ-
జలధివిహార కుంజరవరద
సులభ సుభద్రాసుముఖ సురేశ్వర
కలిదోషహరణ జగన్నాథా

వటపత్రశయన భువనపాలన జంతు
ఘటకారకరణ శృంగారాధిపా
పటుతర నిత్యవైభవరాయ తిరువేం-
కటగిరినిలయ జగన్నాథా

(సంపుటం- 01, సంకీర్తన-323)





*సంస్కృతంలో రాసిన మధురమైన 'శరణు' కీర్తనను వినిపిస్తున్నారు మన అన్నమాచార్యులవారు. "ఓ కమలనాభ! జగన్నాథా! నీవే దిక్కు, నీకే శరణు. ఓ వాసుదేవ! శ్రీకృష్ణా! వామనమూర్తీ! ఓ నరసింహా! శ్రీవనితా వల్లభా! పద్మనయనా! ధరణీనాథా! దేవనాథా! ఓ పురుషోత్తమా! పీతాంబరధారీ! జగన్నాథా! నిన్నే శరణు జొచ్చితిని. ఓ బలరాముని తమ్ముడా! పరమపురుషా! క్షీరసాగరనివాసా! ఓ గజేంద్రసంరక్షకా! సులభముగా అనుగ్రహించువాడా! శుభకరా! సుముఖా! దేవవల్లభా! నీవు కలిపురుషునిచే ప్రాప్తించు దోషములను నివారించువాడవు. ఓ జగన్నాథా నేను నిన్నే శరణు జొచ్చియున్నాను. ఓ వటపత్రశాయీ! జగదీశ్వరా! సృష్టిలోని జంతువుల యొక్క ఉనికికీ, మనికికీ కారణభూతమైన వాడా! శృంగారనాయకా! నిత్యమూ దివ్యమైన వైభవములతో ప్రకాశించే ప్రభూ! పవిత్ర శ్రీ వేంకటగిరి నివాసా! ఓ జగన్నాథా! నేను నిన్నే శరణుజొచ్చియున్నాను తండ్రీ!" అని భక్తితో ఆర్తితో ఈ కీర్తన పాడితే మనపాపాలు పటాపంచలవు తాయనే అన్నమయ్య మాట అక్షరసత్యం.*

తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

## ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక

(తెలుగు, తమిళం, కన్నడం, హిందీ, ఆంగ్లం, సంస్కృతభాషలు)

'సప్తగిరి' పట్ల మీరు చూపిస్తున్న అభిమానం అనన్యసామాన్యం.
తి.తి.దే.కి, పాఠకులకు మధ్య వారధిలా ఉన్న సప్తవర్ణ 'సప్తగిరి' ఆధ్యాత్మిక సచిత్ర మాసపత్రిక.



సెప్టెంబరు, 2022 నుండి
'సప్తగిరి' ఆధ్యాత్మిక సచిత్ర మాసపత్రిక
వెలలో మార్పు అమలులోకి వచ్చింది.

### చందా వివరాలు

విడిప్రతి- రూ.20/-
సంవత్సర చందా- రూ.240/-
జీవిత చందా(12 సం॥లకు మాత్రమే)- రూ.2400/-
విదేశాలకు సంవత్సర చందా- రూ.1030/-



శ్రీవారి అక్షరప్రసాదాన్ని
నెలనెలా అందుకోండి!

మీ ఇంటికే శ్రీవారు వచ్చిన
అనుభూతిని పొందండి!!

'సప్తగిరి' ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రికకు
చందాకట్టండి! చందాకట్టించండి!!
వివరాలకు: ప్రధాన సంపాదకుడు,
తి.తి.దే.ప్రెస్ ప్రాంగణం, కే.టి.రోడ్డు, తిరుపతి-517 507.
ఫోన్: 0877-2264359, 2264560

తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్యాత్మిక సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 54    జూన్, 2023    సంచిక : 01



వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి ॥

**గౌరవ సంపాదకులు**
శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఇ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి(ఎఫ్.ఏ.సి.), తి.తి.దేవస్థానములు.

**ప్రచురణకర్త-ప్రధాన సంపాదకులు**
డా॥ కె.రాధారమణ, ఎం.ఏ.,ఎం.ఫిల్.,పిహెచ్.డి.,

**సంపాదకులు**
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

**ఉపసంపాదకురాలు**
డా॥ అల్లాడి సంధ్య
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి., పి.జి.డిప్లొమా ఇన్ జర్నలిజం

**ముద్రాపకులు**
శ్రీ పి.రామరాజు, ఎం.ఏ.,
ప్రత్యేకాధికారి (పుస్తకవిక్రయకేంద్రం & ముద్రణాలయం), తి.తి.దే., తిరుపతి.

**ఫోటోలు**
శ్రీ పి.ఎన్.శేఖర్, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.,

ఇతర వివరాలకు ఫోన్ నెంబర్లు

సప్తగిరి మాస పత్రిక

0877-2264543
0877-2264359
0877-2264360

విడి ప్రతి : రూ. 20/-
సంవత్సర చందా : రూ. 240/-
జీవితచందా (12 సం॥లకు) : రూ. 2400/-
విదేశాలకు సం॥చందా : రూ. 1030/-

వెబ్‌సైట్- www.tirumala.org;
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు- sapthagiri.helpdesk@tirumala.org; ద్వారా తెలియజేయవచ్చు.

24 గంటలూ పనిచేసే ఈ క్రింది తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్‌నెంబర్లకి ఫోన్ చేసి తి.తి.దే.కి సంబంధించిన సమస్తసమాచారాన్ని మీరు తెలుసుకోవచ్చు.

0877 2277777 / 2233333

## ఈ నెలలో....


**ప్రత్యేకవ్యాసాలు**

| | | |
|---|---|---|
| సప్తాద్రీశుని 'జ్యేష్ఠాభిషేకం' | శ్రీ అర్చకం రామకృష్ణదీక్షితులు | 07 |
| ఎవరి ప్రేమ గొప్పది? | శ్రీమతి ఈ. విజయలక్ష్మి | 10 |
| పేరులోని 'పెన్నిధి' | శ్రీ ఎం.వేంకటాచార్యులు | 12 |
| నమో జగన్నాథా! | శ్రీ జంధ్యాల శరత్‌బాబు | 14 |
| పతంజలి యోగసూత్రములు | యోగాచార్య డా॥ ఆర్.లక్ష్మీనారాయణ | 16 |
| ముక్తిదాయకం... తొలి ఏకాదశి | శ్రీ కె.లక్ష్మీనారాయణ | 22 |

**ధారావాహికలు**

| | | |
|---|---|---|
| శ్రీవేంకటాచల మాహాత్మ్యం | వచనం- ఆచార్య కె.సర్వోత్తమరావు | 11 |
| తిరుమల సమయాచారములు | కీ.శే.డా॥ఎన్.సి.వి.నరసింహాచార్యులు<br>కీ.శే.శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు | 21 |
| తిరువిణ్ణగర్ (ఉప్పిలియప్పన్ కోయిల్) | ఆచార్య చక్రవర్తి రంగనాథన్ | 25 |
| శ్రీవేంకటేశ్వరస్వామి సేవలో.. మహిళా భక్త శిరోమణులు | డా॥ నాగోలు కృష్ణారెడ్డి | 38 |
| శ్రీకృష్ణామృతం | "అనంత" (కృష్ణసుందరి సత్తిరాజు) | 47 |
| రాశిఫలాలు | బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి | 53 |

**మన మహర్షులు**

| | | |
|---|---|---|
| భగవాన్ మరీచిమహర్షి | శ్రీ ఎ.ఎస్.కృష్ణచంద్ర దీక్షితులు | 18 |

**ఉపనిషత్తులు**

| | | |
|---|---|---|
| మా విద్విషా వహై | బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ | 20 |

**వేదవాఙ్మయమ్**

| | | |
|---|---|---|
| భారతీయ గణితము | ఆచార్య వి.రమేష్‌బాబు | 31 |
| వేదసౌధం | డా॥ ఈ.ఏ.శింగరాచార్యులు | 33 |

**గృహలక్ష్మి**

| | | |
|---|---|---|
| సనాతన ధర్మంలో స్త్రీ | డా॥ కప్పగంతు రామకృష్ణ | 35 |

**మనదేవాలయాలు**

| | | |
|---|---|---|
| కరనేశ్వర స్వామి ఆలయం | శ్రీ పి.కృష్ణమూర్తి | 40 |

**శ్రీవేంకటేశ్వరలీలలు**

| | | |
|---|---|---|
| ఆశ్రితవత్సలుడు | శ్రీ మిరియపల్లి సత్యం | 42 |

**ఆయుర్వేదము**

| | | |
|---|---|---|
| బాదం | డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ | 44 |

**యువత**

| | | |
|---|---|---|
| యువతకు స్ఫూర్తి 'భగవద్గీత' | డా॥ ఎ.సచ్చిదానందమూర్తి | 36 |

**బాలవికాసం**

| | | |
|---|---|---|
| సంస్కృతం నేర్చుకుందాం..!! | రచన- కీ.శే.మహామహోపాధ్యాయ కె.కృష్ణాచార్య<br>- కీ.శే.మహామహోపాధ్యాయ ఎస్.లక్ష్మణయ్య | 45 |
| దాతలలో మేటి 'శిబిచక్రవర్తి' (బాలనీతి) | కీ.శే.ఉషశ్రీ | 46 |
| ఏకాదశి (చిత్రకథ) | కథ: శ్రీ డి.శ్రీనివాస దీక్షితులు<br>చిత్రాలు: శ్రీ కె.ద్వారకానాథ్ | 48 |
| దుష్టుడివల్ల వంశనాశం (విశ్వదాభిరామం) | కీ.శే.విద్వాన్ కట్టానరసింహులు | 50 |
| బంగారానికి 'వన్నె' శాశ్వతం (భాస్కరశతకం) | డా॥ తిరుమల శ్రీనివాసాచార్య | 50 |
| బాలవినోదం | | 51 |
| క్విజ్ (11) | | 52 |
| వైకుంఠపాళి | శ్రీ కోగంటి వేంకటఅప్పలాచార్యులు | 54 |


ముఖచిత్రం : శ్రీవారి జ్యేష్ఠాభిషేకం, తిరుమల
వెనుకచిత్రం : శ్రీనమ్మాళ్వారు (చిత్రం: శ్రీ పి.శివప్రసాద్)



ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.

సంపాదకీయం

# ఆధ్యాత్మిక సాధనామార్గం 'యోగ'

'యోగ' అనే పదం 'యుజ్' అనే సంస్కృతధాతువు నుండి పుట్టింది. 'యుజ్' అంటే 'కలయిక' అని అర్థం. 'యుజ్యతే ఏతదితియోగః'; 'యుజ్యతే అనేన ఇతియోగః' అనే వ్యుత్పత్తుల ద్వారా చూస్తే- ఇంద్రియాల్ని వశం చేసుకొని, మనస్సును పరమాత్మపై కేంద్రీకరించడమే!

ఈ యోగవిధానాన్ని **పతంజలిమహర్షి** తన **'యోగసూత్రాల'** ద్వారా తెలియజేశాడు. ఆ యోగశాస్త్రం- **సమాధి, సాధన, విభూతి, కైవల్య పాదాలని** నాలుగుభాగాలుగా వ్రాయబడి ఉంది.

యోగమంటే **'చిత్తవృత్తి'** నిరోధమని చెప్పి, ఆ చిత్తవృత్తి నిరోధం అభ్యాస-వైరాగ్యాల వల్ల ఏర్పడుతుందని పతంజలి మహర్షి **'అభ్యాసవైరాగ్యాభ్యాం చిత్తవృత్తి నిరోధః'** అనే సూత్రం ద్వారా తెలిపారు. కాబట్టి యోగాభ్యాసం కర్తవ్యంగా చెప్పబడింది.

**'యోగా'** కేవలం రెండక్షరాల పదం. ఆధునిక మానవజీవితానికి దివ్యౌషధం. యోగ ఒక సమగ్రజీవన విధానం. ఇందులో అనేక ప్రక్రియలుంటాయి. ప్రాణాయామంతో పాటుగా ఇతర భౌతిక పద్ధతుల ద్వారా శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచటానికి ఇవి తోడ్పడుతాయి. కనుక **'యోగ'** అంటే కేవలం ఆసనాలతో సరిపెట్టుకోవడం కాదు. ఇది వ్యక్తి జీవితంలో సంభవించే విప్లవంగా పేర్కొనవచ్చు. అంటే అంతవరకూ స్తబ్దతగా, నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారు క్రమశిక్షణతో, అస్తవ్యస్తంగా ఉన్న జీవనశైలిని సరిచేసుకోవడం- ఎట్లంటే నిద్రలేచే సమయం నుండి రాత్రి నిద్రపోయే వరకూ ఆహారపు అలవాట్లతో పాటు అన్ని విషయాల్లోనూ సమతౌల్యం సాధించడం, ఇవన్నీ యోగ సాధనవల్లే సాధ్యమౌతుంది. ఆ దిశలో పయనించినవారే మన **మహర్షులు**, యోగులైన-**వశిష్ఠుడు, విశ్వామిత్రుడు, రామకృష్ణ పరమహంస, భగవాన్ రమణులు** ఇత్యాదులు.

యోగాభ్యాసాన్ని ఆధునికులు ఒకప్పుడు చాదస్తంగా భావించారు. కానీ, నేడు ప్రపంచమంతా దాని మీద శ్రద్ధ చూపుతోంది. అందుకే ఏటా జూన్ 21వ తేదీని ఐక్యరాజ్యసమితి **'అంతర్జాతీయ యోగా దినోత్సవం'**గా ప్రకటించి ఆచరిస్తోంది.

ఇక కలియుగవైకుంఠమైన మన తిరుమలలో సప్తగిరీశునికి ప్రతి సంవత్సరం వైఖానస భగవాచ్ఛాస్త్ర విధిగా జరిగే **'అభిదేయక అభిషేకం - జ్యేష్ఠాభిషేకం'**, ఈ మాసం జ్యేష్ఠశుక్ల త్రయోదశి నాడు ఆరంభించి, పూర్ణిమనాడు సమాప్తయ్యే విధంగా జరుపబడుతుంది. ఈ అభిషేకం వల్ల శ్రీవేంకటేశ్వరుని అర్చావతారమైన ఉత్సవమూర్తి **'శ్రీమలయప్పస్వామి'** అమితమైన తేజస్సుతో ప్రకాశిస్తుందని వైఖానస గ్రంథరాజమైన **'క్రియాధికారం'** తెలుపుతోంది. ఈ అభిషేకాన్ని తిలకించే భక్తులకు శ్రీనివాసుని దివ్యాశీస్సులు పరిపూర్ణంగా ఉంటుంది.

ఈమాసంలోనే భక్తాగ్రేసరులు, పన్నిద్దరాళ్వారులలో పేరుగాంచిన 'నమ్మాళ్వార్', 'పెరియాళ్వార్ల' శాత్తుమొఱ రావడం విశేషం. వారిని సంభావించడం మన కర్తవ్యం.

ఇకపోతే, ఇదేమాసంలో పూరీజగన్నాథుని రథయాత్ర అంగరంగవైభవంగా జరుగుతాయి. 'సకలసమైక్యత- సంపూర్ణ సమగ్రత'లకు మారుపేరు పూరీక్షేత్రం. 'సర్వ జగన్నాథం' అన్న విషయాన్ని జ్ఞప్తిలో ఉంచుకుని జగన్నాథస్వామిని స్మరించడం సదా ముక్తిదాయకం.

**'ఓమ్ నమో వేంకటేశాయ'**

జూన్ 2 నుండి 4 వరకు
శ్రీవారి జ్యేష్ఠాభిషేకం
సందర్భంగా...

# సప్తాద్రీశుని 'జ్యేష్ఠాభిషేకం'

- శ్రీ అర్చకం రామకృష్ణదీక్షితులు,
శ్రీవారి ఆలయఅర్చకులు &
వైఖానస ఆగమసలహాదారు,
94944 04343

సప్తాద్రీశుడు, అఖిలహేయ ప్రత్యనీక కల్యాణగుణాకరుడు, అనంతకల్యాణ గుణ గణ గాంభీర్యుడుయైన శ్రీశ్రీనివాసభగవానుడు-

నాహం వసామి వైకుంఠే న యోగి హృదయే రవౌ।
మద్భక్తా యత్ర గాయంతి తత్ర తిష్ఠామి నారదా॥
(పాద్మ పురాణం)

"నేను శ్రీవైకుంఠంలో లేను, నిరంతరం కఠినమైన ఆధ్యాత్మికసాధనతో తపస్సు చేసే యోగుల హృదయాల్లోనో, సూర్యమండలంలోనో కనిపించను. నా భక్తులు తలచేచోట, నన్ను కీర్తించే చోట ఉంటాను" అని సంకల్పించుకొని, కలియుగ ప్రత్యక్షదైవంగా, భక్తులపాలిట ఆపద్బాంధవుడిగా, తిరుమల గిరుల్లో వెలసి, సమస్తలోకాలను కటాక్షిస్తున్నాడు. ఈ కలి యుగంలో, భక్తులు నోరారా "గోవిందా గోవిందా" అని తన నామసంకీర్తనం చేసినవాడిని, తప్పక రక్షిస్తాను అని వాగ్దానం చేసి ఆ శ్రియఃపతి వేంకటేశ్వరస్వామివారు, భక్తుల పూజ లందుకుంటున్నారు. శ్రీవారు 'అనంతుడు' అని పిలవబడుతాడు.

*'న విద్యతే అంతః యస్య సః అనంతః'*- అని 'అనంత' శబ్దం వ్యుత్పత్తి. ఎవనికి అంతము లేదో అతడు అనంతుడైన శ్రీవేంకటేశుడు. భగవద్గీతలో 'నాస్త్యంతో విస్తరస్యమే'(10-19) అను వాక్యము కూడా భగవంతుని యొక్క సర్వవ్యాప్తికి- అంతము, అవధి లేదని తెల్పుచున్నది.

*'నాంతం గుణానాం గచ్ఛంతి తేనానంతో'*- అని విష్ణు పురాణం (2-5-24), దేవతలందరూ ఆ పరమాత్ముని గుణములను తెలుసుకోలేకపోయారు అని, భగవంతుడు 'అనంతుడు, అవ్యయుడు, నిత్యుడు, సర్వగతుడు' అని పేర్కొంటోంది. 'అనంత' విశిష్టుడైన శ్రీమహావిష్ణువు, తన భక్తునిలో అనంతమైన దోషాలున్నప్పటికీ, వారికి ఎందుకు అభయమిస్తాడు? అనే విషయమును, భగవద్రామానుజుల వారు తన శరణాగతి గద్యంలో అద్భుతంగా వర్ణిస్తూ,

*'ఏవం భూత మత్ కైంకర్య ప్రాప్త్యుపాయ తమా, ....., అనంత తద్విరోధి పాపాక్రాంతోఽపి, అనంత మదపచార యుక్తోఽపి, ......., నిత్య కింకరోభవ॥ (శరణాగతి గద్యం)*

భగవంతుడు, తనమీద ఆసక్తి కలిగి, తన నామాన్ని స్మరిస్తూ, తన కైంకర్యమును చేయదలచిన భక్తుడు, అనంతమైన అపచారములను, దోషములను చేసినప్పటికినీ, వాటన్నింటినీ క్షమించి, భక్తులను అనుగ్రహిస్తాను అని తెలిపాడు.

శ్రీవారికి ఇటువంటి కైంకర్యములు చేయాలన్న ఆపేక్షే, తిరుమల ఆలయంలో 'నిత్యకల్యాణం-పచ్చతోరణం' అన్న చందంగా, ఏటా 365 రోజులకు గానూ, సుమారు 470 ఉత్సవాలను అత్యంత వైభవోపేతంగా, నేత్రపర్వంగా నిర్వహింపబడటానికి కారణమని చెప్పవచ్చు.



శ్రీవైఖానస భగవచ్ఛాస్త్రవిధిగా, శ్రీవారిఆలయంలో జరుపబడే ఈ ఉత్సవాలలో భాగంగా, శ్రీవారి పంచబేరాలలో ఒకరైన ఉత్సవబేరం– **శ్రీమలయప్పస్వామివారికి** అభిషేకాలు, స్నపనతిరుమంజనాలు చేయబడుతాయి. కైంకర్యాలలో భాగంగా జరుపబడే అభిషేకాల వలన అర్చామూర్తుల మూలస్వరూపంలో మార్పులు, అరుగుదల సంభవించే అవకాశం ఉన్నది. ఇటువంటి దోషములను నివారించటానికి, ఆగమశాస్త్రం **'ప్రకీర్ణకమ్'** అనే అధ్యాయంలో తరుణోపాయాన్ని తెలియజేస్తున్నది. శ్రీవైఖానస భృగుప్రోక్త ప్రకీర్ణాధికారం–

**జ్యేష్ఠేమాసి తు సంప్రాప్తే జ్యేష్ఠా నక్షత్ర సంయుతే ।**
**విష్ణోరేవ విశేషస్స్యాత్సుగంధం తైలమాహరేత్ ॥**

జ్యేష్ఠమాసంలో, చంద్రుడు జ్యేష్ఠానక్షత్రంతో కలిసియున్న పూర్ణిమనాడు, దేవదేవుడైన విష్ణువుయొక్క విగ్రహమునకు విశేష సుగంధతైలమును సమర్పించాలని భగవాన్ భృగువు పేర్కొన్నాడు. ఈ ఉత్సవాన్నే **'సుగంధ తైలసమర్పణ'** ఉత్సవంగా క్రియాధికారం అనే గ్రంథం పేర్కొంటోంది. పై ఆగమశాస్త్ర ప్రమాణాలను అనుసరించి 90వ దశకంలో, శ్రీవారి ఆలయంలో సంవత్సర ఉత్సవంగా **'అభిదేయక అభిషేకం– జ్యేష్ఠాభిషేకం'** ప్రవేశపెట్టబడి, ప్రతిసంవత్సరం శాస్త్రోక్తంగా జరుపబడుతున్నది. ఈ ఉత్సవాన్ని వైఖానస భగవచ్ఛాస్త్ర విధిగా నిర్వహించటం వల్ల విష్ణువు యొక్క దివ్య అర్చావతారం అమితమైన తేజస్సుతో ప్రకాశిస్తుందని క్రియాధికారం అనే గ్రంథం తెలియజేస్తున్నది. తిరుమలలో జ్యేష్ఠాభిషేకాన్ని, జ్యేష్ఠశుక్ల త్రయోదశినాడు ఆరంభించి, జ్యేష్ఠశుక్ల చతుర్దశి మరియు జ్యేష్ఠపూర్ణిమనాడు అంతమయ్యే విధంగా, మూడురోజులపాటు వైభవంగా నిర్వహింపబడుతున్నది. జ్యేష్ఠాభిషేకమహోత్సవానికి 10 రోజులు ముందుగా శ్రీవారి ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామి వారికి గత సంవత్సరం సమర్పించబడిన స్వర్ణకవచములను సడలింపు చేస్తారు.

**పరిలిఖితమితి మంత్రేణ కవచం పరిశోధయేత్।**
**జీర్ణే భిన్నే చ కవచే శిల్పినైవ సుసన్నయేత్॥**
**(ప్రకీర్ణాధికారం– భగవాన్ భృగువు)**

ఈ ఉత్సవ నిర్వహణకు ప్రత్యేకంగా 'కంకణభట్టర్' అని పిలువబడే వైఖానస అర్చకునికి బాధ్యతలు ఇవ్వబడుతాయి.



ప్రకీర్ణాధికారంలో చెప్పబడిన విధంగా, ఆచార్య స్వామి ఉత్సవ మూర్తుల మీదున్న స్వర్ణకవచమును 'పరిలిఖిత...' అను మంత్రముతో చక్కగా పరిశోధించవలెను. అటుపై, ఆ స్వర్ణకవచములలో ఏవైనా లోపముంటే, వాటిని జాగ్రత్తగా తొలగించి, సుశిక్షితుడైన శిల్పిచే వాటిని సరిచేసి సిద్ధంగా ఉంచుకోవాలని శాస్త్రవచనం.

జ్యేష్ఠాభిషేకం మొదటిరోజు, శ్రీవారి మాధ్యాహ్నిక ఆరాధనాదులు పూర్తి అయిన తర్వాత, శ్రీమలయప్పస్వామి వారిని, ఉభయదేవేరిసమేతంగా, విమానప్రదక్షిణంగా, ఆలయంలోని సంపంగిప్రాకారంలోకి ప్రధానవేదిక మీద స్నానపీఠంపై వేంచేపు చేస్తారు. యాగశాలలో **'అష్టోత్తర శత కలశస్నపన'** అనే వైదికక్రియను, 108 కలశాలతో నిర్వహిస్తారు. వైఖానస భగవచ్ఛాస్త్ర విధిగా దేవతాప్రార్థన, విష్వక్సేన ఆరాధన, స్వస్తి పుణ్యాహవాచనం, సద్యోంకురార్పణ, రక్షాబంధనం, అగ్నిప్రణయనం వంటి క్రియలను వేదమంత్ర పురస్సరంగా నిర్వహిస్తారు. తదుపరి ఈ ఉత్సవానికి సర్కార్ (తి.తి.దేవస్థానం) వారి తరపున శ్రీకార్యనిర్వహణాధికారి దంపతులకు సంకల్పం చెప్పబడుతుంది.

108 కలశాల మధ్యన ఉన్న ప్రధాన కలశంలో వరుణుని ఆవాహన చేసి పూజలు జరుపుతారు. అనంతరం ప్రధానహోమం, ప్రాయశ్చిత్తహోమం, అంత్యహోమాలను నిర్వహించి అగ్న్యుపస్థాపనం చేయడంతో హోమకైంకర్యాల సమాప్తి అవుతుంది. తర్వాత శ్రీవారి ఉత్సవమూర్తులకు 12 రకాల ద్రవ్యాలతో మరియు పాలు, పెరుగు, తేనే, కొబ్బరినీళ్ళు, పసుపు, చందనాదులతో విశేషస్నపనతిరుమంజనం జరుగు



తుంది. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామివారికి, ముగ్ధమనోహరమైన, అపురూప వజ్రవైఢూర్య మణిమరకతాది శోభితమైన **వజ్రకవచం**తో అలంకరణ జరిపి, నాలుగు తిరుమాడవీథులలో ఉత్సవాన్ని నిర్వహిస్తారు. ఇలాగే మిగతా రెండురోజులు ఉదయం పూట అష్టోత్తరశతకలశ స్నపనం మరియు 2వ రోజు సాయంత్రం **ముత్యపుకవచం**, 3వరోజు సాయంత్రం **స్వర్ణకవచం**తో తిరువీథిఉత్సవం జరుగుతుంది. మూడవరోజు, సరి చేసిన స్వర్ణకవచమునకు పంచగవ్య ప్రోక్షణ, వాస్తుపర్యాగ్నీకరణ జరిపి, ఆ కవచమును శ్రీవారి ఉత్సవమూర్తులకు, సమర్పిస్తారు.

ఆయా మూర్తుల రూపమునకు తగినట్లుగా, చక్కగా సరిపోవునట్లుగా కవచములను సర్వప్రయత్నంతో సమకూర్చుకుని, బింబములను రక్షించుకోవలెనని, ఇదియే జ్యేష్ఠాభిషేకం అనే ఉత్సవంయొక్క పరమార్థంగా భృగువు ప్రకీర్ణాధికారంలో పేర్కొన్నాడు. ఈ ఉత్సవాన్ని మూడు రోజులపాటు శాస్త్రోక్తంగా నిర్వహించిన కంకణభట్టర్‌కు, చివరి రోజు సాయంత్రం 'అర్చక బహుమానం' అనే దేవస్థాన మర్యాదలను చేయటంతో క్రతువు పూర్తవుతుంది. ఈ ఉత్సవంలో పాల్గొన్న భక్తులందరికీ శ్రీవేంకటేశ్వరస్వామివారి దివ్యాశీస్సులతో అన్నీ కార్యాలు నిర్విఘ్నంగా నేరవేరుతాయి. వారికి ఉన్న దీర్ఘకాల రుగ్మతలు, వ్యాధులు తొలగి సమస్తమనోవాంఛలు సిద్ధించి, దేహావసానమున శాశ్వతమైన విష్ణుసాయుజ్యం లభిస్తుందని క్రియాధికారంలో భృగుమహర్షి జ్యేష్ఠాభిషేక ఫలితాన్ని తెలిపాడు.

*॥ఓమ్ నమో వేంకటేశాయ॥*





# ఎవరి ప్రేమ గొప్పది?

– శ్రీమతి ఈ. విజయలక్ష్మి

జూన్ 2 న నమ్మాళ్వార్ శాత్తుమొఱ సందర్భంగా...

"ప్రియో హి జ్ఞానినోఽత్యర్థ మహం, స చ మమ ప్రియః" (జ్ఞాని అయినవానికి నేను చాలా ఇష్టమైనవాడను. నాకుకూడా అతడు ఇష్టమైనవాడు) అని అంటూ గీతాచార్యుడు భగవద్గీతలో ఒకచోట అన్నాడు. ఇక్కడ "అత్యర్థం" అంటే "చాలా ఎక్కువ" అని అర్థం. ఈ సూక్తిని బట్టి చూస్తే, 'భగవంతునకు భక్తునిపై ఉండే ప్రేమకంటే, భక్తునకు భగవంతునిపై ఉండే ప్రేమ అధికం' అని చెప్పినట్లు పై పైన మనకు కనిపిస్తుంది. ఈ క్రమంలో అన్వయం "అత్యర్థం" అనే ప్రయోగాన్ని "జ్ఞానినః అహం అత్యర్థం ప్రియః" అనే విధంగా అన్వయించవలసినట్లు తోస్తుంది.

కానీ, వాస్తవానికి లోకంలో ఉండే స్థితిని గమనించినప్పుడు, ఈ క్రమంలో వేరుగా ఉంది. కుమారునకు తండ్రి పై ఉండే ప్రేమ కంటే, ఆ కుమారునిపై తండ్రికి గల ప్రేమే అధికంగా మనకు కనిపిస్తుంది. అందుచేత పై సూక్తిలోని అన్వయాన్ని ఏ విధంగా గ్రహించడం యుక్తంగా ఉంటుంది? అని గమనించినప్పుడు, "స చ మమ అత్యర్థం ప్రియః" అనే అన్వయాన్ని గ్రహించడం యుక్తంగా మనకు కనబడుతుంది.

అయితే, ఈ విధంగా ఉండే అన్వయం శ్రీరామానుజుల గీతాభాష్యంలో కనిపించదు. గీతాభాష్యంలో, ఈ గీతాసూక్తిని వ్యాఖ్యానిస్తూ శ్రీరామానుజులు, 'సోఽపి తథైవ మమప్రియః' (ఆ జ్ఞాని కూడా నాకు ఆ విధంగానే ఇష్టమైనవాడు) అని మాత్రమే వివరించారు. అందువల్ల "భగవంతునకు భక్తుడు ఆ విధంగానే ఇష్టమైనవాడు" అని మాత్రమే ఇక్కడ చెప్పినట్లయినది.

కానీ, ఈ "అత్యర్థం" పదాన్ని శ్రీరామానుజులు "స చ మమ ప్రియః" అనే ప్రయోగంతో అన్వయించి అర్థం చెప్పిన సందర్భంకూడా మనకు కనిపిస్తుంది. ఎక్కడ? అంటే, వారు తమ శ్రీభాష్యగ్రంథంలో చిట్టచివరి సూత్రాన్ని వ్యాఖ్యానించేటపుడు, "స చ పరమపురుషః సత్యసంకల్ప అత్యర్థ ప్రియం జ్ఞానినం లబ్ధ్వా, న కదాచిత్ ఆవర్తయిష్యతి" (సత్యమైన సంకల్పాన్ని కలిగిన ఆ పరమపురుషుడు తనకు చాలా ఇష్టమైన జ్ఞానిని పొంది, అతనిని మళ్లీ ఏ సమయంలోనూ తిరిగి ఈ లోకంలోనికి రానివ్వడు) అని అంటూ, దీనికి ప్రమాణంగా పై గీతాసూక్తిని ఉదహరించారు. అందుచేత ఇక్కడ శ్రీరామానుజులు, "భగవంతునకు భక్తుడు చాలా ఇష్టమైనవాడు" అనే అర్థాన్ని గ్రహించినట్లు మనకు స్పష్టమవుతున్నది.

ఇటువంటి విలక్షణమైన అన్వయాన్ని శ్రీరామానుజులు చేయడానికి ఏది మూలం? అని గమనిస్తే, నమ్మాళ్వారులు రచించిన తిరువాయ్‌మొళి ప్రబంధంలోని చివరి పాశురమే అని మనకు తెలుస్తుంది. ఈ పాశురంలో ఆళ్వార్లు "అంతటా వ్యాపించి, నిత్యమై ఉండే ప్రకృతితత్త్వం కంటే, ఆ ప్రకృతి తత్త్వాన్ని మించి ఉండే ఆత్మతత్త్వం కంటే, ఆ ప్రకృతితత్త్వాన్ని, ఆత్మతత్త్వాన్ని నియమించే పరమాత్మతత్త్వం కంటే మించిన నా గొప్ప అభినివేశాన్ని, భగవంతునకు తనపై కల అభినివేశంతో పోలిస్తే, నాకుండే అభినివేశం పర్వతం ముందు పరమాణువు వలె చాలా అల్పమైపోయింది" అని అన్నారు. అంటే, భగవంతునిపై తమకు ఉండే ఆర్తికంటే, తమపై భగవంతునకు గల ఆర్తితో పోలిస్తే అది చాలా అల్పమని ఈ సూక్తిలోని భావం. దీనిని దృష్టిలో పెట్టుకుని శ్రీరామానుజులు పైన తెలిపిన రీతిలో శ్రీభాష్యంలో చివర వివరించారు.

ఇది, ఒక మధురమైన, ఉభయవేదాంత సమన్వయాత్మకమైన వివరణం.

*॥ ఆళ్వార్ తిరువడిగళే శరణమ్ ॥*

# శ్రీవేంకటాచల మాహాత్మ్యం

(తరిగొండవెంగమాంబ ప్రణీతం)

వచనం– ఆచార్య కె.సర్వోత్తమరావు, 97041 04000

ధారావాహిక



**గత సంచిక తరువాయి...**

భూదేవిని ఉద్ధరించిన హరి వైకుంఠానికి వెనువెంటనే వెళ్ళదలచుకోలేదు. తన రూపాన్ని చూచి ఆదిలక్ష్మి జడుసుకొంటుందేమో అని అనుమానించాడు. అంతేకాదు తన్ను కామించిన భూదేవి చెంత ఉండాలని అనుకొన్నాడు. ఆ కారణంగా గరుత్మంతునితో వైకుంఠంలోని క్రీడాద్రిని భూలోకానికి తీసుకురావలసిందిగా ఆజ్ఞాపించాడు. స్వామికి అత్యంత సన్నిహితుడైన గరుత్మంతుడు సరేనంటూ వైకుంఠం చేరాడు. ఆదిలక్ష్మిని కలుసుకొన్నాడు. ఆ తరువాతి వృత్తాంతం–

'అమ్మా! హరి భూలోకం చేరి హిరణ్యాక్షుడనే రాక్షసుని సంహరించడం కోసం, సంద్రంలో మునిగిన భూమిని ఉద్ధరించడం కోసం వరాహరూపం ధరించాడు. తన వాడి కోరలతో హిరణ్యాక్షుని తలను ముక్కలు చేశాడు. తదనంతరం కుంగిపోయిన భూమిని యథాస్థలంలో నిలదొక్కుకొనేలా చేశాడు. అంతేకాదమ్మా! హరి ప్రస్తుతం భూలోకవాసానికే ఇష్టపడుతున్నాడు. ఈ నెపంతో వైకుంఠంలోని క్రీడాద్రిని తెమ్మని నన్నా దేశించాడు.

తల్లి! మీ అనుమతితో క్రీడాద్రిని భూలోకానికి తీసుకుపోవడానికి అనుమతి ఇవ్వవమ్మా. అందుకే మీ సన్నిధికి వచ్చానన్నాడు' వినయంతో గరుడసేవకుడు.

గరుత్మంతుని వాలకాన్ని ఆదిలక్ష్మి చూచింది. అతని మాటలను శాంతంగా, సాంతం విన్నది. ఆపై గరుత్మంతుడు 'అమ్మా! మరోమాట. సూకర రూపంతో కనబడితే మీరు భయపడతారని కూడా తనసందేహన్ని వ్యక్తం చేశారు' అని అంటే, ఆదిలక్ష్మి 'నేను స్వామిని ఎప్పుడూ వదలక మసలేదాన్ని. స్వామికి కూడా ఈ సంగతి తెలుసుకదా! అయినా స్వామిజీ ఇలా సెలవివ్వడం వింతగా ఉంది!

హరి ఏ రూపం ధరించినా నేను ఆ రూపంతోనే ఎలాంటి మానసిక వికారానికి లోనుగాక హరి వక్షఃస్థలంలో ఉండేదాన్ని. క్రొత్తగా ఉంది.

పోనీ! హరి ఆ రూపంలో వైకుంఠానికి తిరిగి రావడానికి ఇష్టపడకపోతే నేనే ధరణికి వస్తాను. కిటిరూపధారి అయిన ఆ హరి వక్షఃస్థలంలో చోటు కల్పించుకొంటాను.

అయినా ఖగేంద్రా! ఒక్క మాట, సావధానంగా విను! మత్స్యరూపంలో ప్రళయసముద్రంలో ఏకాకిగా ఈదుతున్న వేళల్లో కూడా నేను హరి వక్షఃస్థలంలో ఉన్నాను. కూర్మరూపంలో సముద్రంలో మునిగి మంథరపర్వతం మోసే వేళ నేను తోడుగా ఉన్నాను.

అంగుష్ఠదేహంతో మఱ్ఱాకుపై పడుకొన్నవేళ కూడా నేను వక్షఃస్థలశాయినే.

చంద్రిక చంద్రునికంటె భిన్నంకానట్లు నేను స్వామితోనే ఉన్నాను. ఏ రోజూ ఏ అవతారంలోను స్వామిని వీడి ఉండలేదు. అందువల్ల నేను ఇప్పుడే నా పరివారంతో సహా భూలోకానికి చేరి ఆ వరాహ విగ్రహ రూపధారి వక్షఃస్థలంలో కుదురుగా ఉంటాను. స్వామి భయంకర రూపుడైనా, వికృతదేహుడైనా నాకు ఏలాంటి భయములేదు. ఏవగింపూ లేదు.

ఈ వ్యవహారమంతా అటుంచు. హరి భూదేవితో క్రీడాద్రిలో విహరించాలనుకోవడం తప్పేమీకాదు. స్వామి ఆన మేర వైకుంఠంలోని క్రీడాచలాన్ని భూలోకానికి చేర్చు. స్వామి ఎంపిక చేసిన చోట భూదేవితో హాయిగా తిరగనీ' అంది.

*(ఇంకా ఉంది)*

జూన్ 29న శ్రీపెరియాళ్వార్ శాత్తుమొఱ సందర్భంగా...

# పేరులోని 'పెన్నిధి'

- శ్రీ ఎం.వేంకటాచార్యులు

భగవంతుడైన శ్రీమన్నారాయణుని సహజమైన అనుగ్రహం చేత ఏ దోషం లేని జ్ఞాన-భక్తి-వైరాగ్యాలను పొంది, ఆ భగవంతుని అనుభవంలో ఓలలాడుతూ, తమ అనుభవాన్ని మధురమైన 'ద్రావిడప్రబంధాల' రూపంలో మనకు అందించిన మహనీయులు, ఆళ్వారులు. వీరిలో **పెరియాళ్వార్లు** ఒకరు. ద్రావిడభాషలో పెరియ అంటే పెద్ద అని అర్థం. అందుచేత ఈ పదానికి **పెద్ద ఆళ్వార్లు** అని అర్థం. ఈ ఆళ్వారులే **విష్ణుచిత్తులు** అని, **భట్టనాథులు** అని సంప్రదాయంలో పిలువబడుతున్నారు. గోదాదేవిని పెంచిన తండ్రి కూడా వీరే.

లోకంలో ఎవరినైనా ఒకరిని 'పెద్ద' అని పిలవాలంటే, వారి వయస్సువల్ల కానీ, ప్రభావంచేత కానీ, లేదా వేరొక కారణంవల్ల కానీ పెద్ద అయి ఉండాలి కదా! మరి విష్ణుచిత్తులను పెరియాళ్వారులు అని పిలవడానికి గల కారణాలు ఏవి? అనే విషయాన్ని కొంచెం గమనిద్దాం.

వీరిని ఈ నామంతో వ్యవహరించడానికిగల కారణాలు ఏమై ఉంటాయి? అని గమనిస్తే, వీరు కాలం వల్ల పెద్ద కాదు. ఎందుకంటే, వీరికి ముందు ఆరుగురు ఆళ్వారులు జన్మించారు. కాలక్రమాన్ని బట్టి చూస్తే, వీరు ఏడవవారు. అందుచేత కాలాన్ని అనుసరించి వీరిని పెద్ద అని అనడానికిలేదు.

వీరు ఎక్కువ సంఖ్యలో ప్రబంధాలను రచించడం గాని, ఎక్కువసంఖ్యలో పాశురాలను రచించడం గాని చేసి ఉంటే, ఆ కారణం వల్ల కూడా వీరిని పెరియాళ్వార్లు అని వ్యవహరించి ఉండవచ్చు. గమనించి చూస్తే, ఆ కారణం కూడా కనబడదు. ఎందుకంటే, అందరికంటే ఎక్కువ సంఖ్యలో పాశురాలను రచించిన ఆళ్వారులు నమ్మాళ్వారులు.

మరి, వీరిని పెరియాళ్వార్లు అని పిలవడానికి గల కారణమేమై ఉంటుంది? అనే ప్రశ్నకు ఇద్దరు మహాచార్యులు రెండువిధాలైన సమాధానాలను మనకు తెలియజేశారు. అవి ఏమిటో చూద్దాం.

శ్రీమణవాళమహామునులు అని శ్రీవైష్ణవ సంప్రదాయంలో ప్రసిద్ధి చెందిన శ్రీవరవరమునులు **'ఉపదేశరత్తిన మాలై'** అనే ప్రబంధంలో ఈ సందేహానికి సమాధానాన్ని పలుకుతూ, "మంగళాశాసనత్తిన్ మత్తుళ్ళ ఆళ్వార్గళ్ తంగళ్ ఆర్వత్తళవు తానన్ఱి పొంగుమ్ పరివాలే విల్లిపుత్తూర్ పట్టర్ పిరాన్ పెత్తాన్ పెరియాళ్వార్ ఎన్నుమ్ పెయర్" (భగవంతునకు మంగళాశాసనం చేయడంలో మిగిలిన ఆళ్వార్లకు ఉండే ఆర్తి కంటే మించిన ఆర్తిని కలిగి ఉన్నవారు కనుక, శ్రీవిల్లిపుత్తూరులో జన్మించిన భట్టనాథులు పెరియాళ్వార్ అనే పేరును పొందారు) అని అంటూ ఈ పేరు రావడానికి గల కారణాన్ని చాలా అందంగా, సహేతుకంగా తెలియజేశారు. దీనినిబట్టి భగవంతునకు మంగళాశాసనం చేయడం అనే విషయంలో మిగిలిన ఆళ్వార్ల కంటే ఎక్కువ ఆర్తిని కలిగి ఉన్నందున వీరికి ఈ పేరు వచ్చినదని తెలుస్తున్నది. ఇది ఒక విధమైన సమాధానం.

**భగవంతునికి మంగళాశాసనం చేయడంలో అత్యంత ఆర్తిని కల్గినవారు పెరియాళ్వార్లు**



శ్రీవేదాంతదేశికులు అనే ఇంకొక మహనీయులు వేరొక చక్కని సమాధానాన్ని గోదాస్తుతి అనే ఒక స్తోత్రంలో ఈ విధంగా తెలియజేశారు.

**తాతస్తుతే మధుభిదః స్తుతిలేశవశ్యాత్**
**కర్ణామృతైః స్తుతిశతైః అనవాప్తపూర్వమ్।**
**త్వన్మౌలిగంధసుభగా ముపహృత్య మాలాం**
**లేభే మహత్తరపదానుగుణం ప్రసాదమ్॥**

'గోదాదేవీ! నీ తండ్రి అయిన విష్ణుచిత్తులు, చిన్నస్తుతికి కూడా వశమవుతున్న భగవంతుని విషయంగా, చెవులకు అమృతంవంటి వందలకొద్దీ పాశురాలను రచించినప్పటికీ పొందని గొప్పదైన అనుగ్రహాన్ని ఎప్పుడు పొందారు? అంటే, నీవు నీ శిరస్సులో అలంకరించుకొన్నందున చాలా అందమైన పూమాలికను భగవంతునకు సమర్పించి, పొందారు.'

విష్ణుచిత్తులు చాలా మధురమైన, వీనుల విందు అనదగిన ఎన్నో వందల కొద్దీ పాశురాలను తమ ప్రబంధంలో రచించారు. భగవంతుడైతే స్తుతిప్రియుడు. ఎవరు ఏ చిన్న స్తుతిని చేసినా, ఆనందించేవాడు. అటువంటి భగవంతుని వద్ద నుండి తాము రచించిన మధురమైన పాశురాలవల్ల పొందలేని గొప్ప అనుగ్రహాన్ని గోదాదేవి శిరస్సులో అలంకరించుకున్న పూలమాలికను ఆ భగవంతునకు సమర్పించినందున పొందారట. అంటే, పెరియాళ్వార్లు రచించిన పాశురాలను విన్నప్పుడు భగవంతునకు కలిగిన ఆనందం కంటే, గోదాదేవి శిరస్సులో ముడుచుకున్న పూమాలికను ఆ విష్ణుచిత్తులు సమర్పించినప్పుడు భగవంతునకు కలిగిన ఆనందం గొప్పది? అని భావం. ఈ విధంగా భగవంతుని వద్దనుండి గొప్ప అనుగ్రహాన్ని పొందినందువల్ల వీరికి పెరియాళ్వార్లు అనే పేరు వచ్చింది అని అంటారు, దేశికులు.

శ్రీరంగంలో దర్శనమిచ్చే మూలమూర్తి శ్రీరంగనాథునకు సంప్రదాయంలో **పెరియపెరుమాళ్** అని పేరు. అంటే, అందరికంటే చాలా పెద్దవాడు అని అర్థం. **పెరుమాళ్** అంటేనే పెద్దవాడు అని అర్థం. భగవంతుడు అందరికంటే అధికుడు గనుక, పెరుమాళ్ అని పేరు వచ్చింది. అనేక దివ్య క్షేత్రాలలో ఎన్నో భగవన్మూర్తులు ఉన్నప్పటికీ, వాటిలో శ్రీరంగంలో ఉండే శ్రీరంగనాథుని అర్చామూర్తియే ప్రధానమని శ్రీవైష్ణవసంప్రదాయంలో భావింపబడుతున్నందున, శ్రీరంగంలోని మూలమూర్తికి పెరియపెరుమాళ్అనే పేరు వచ్చింది.

ఇటువంటి శ్రీరంగనాథునకు తాను పెంచిన గోదాదేవిని ఇచ్చి, విష్ణుచిత్తులు వివాహం చేశారు. అంటే, పెరియ పెరుమాళుకు మామగారు అయ్యారు. లోకంలో అల్లునకు మామగారు గౌరవనీయుడు కదా! అందుచేత అందరికంటే పెద్దవాడుగా పరిగణింపబడే శ్రీరంగనాథునకు కూడా విష్ణుచిత్తులు గౌరవనీయులు అయ్యారు. కనుక వారికి పెరియాళ్వార్లు అనే పేరు వచ్చింది అని వేదాంతదేశికుల చమత్కార సూక్తి.

*॥ ఆళ్వార్ తిరువడిగలేశరణమ్॥*





జూన్ 20న
పూరీ
రథయాత్ర
సందర్భంగా....

# నమో జగన్నాథా!

– శ్రీ జంధ్యాల శరత్‌బాబు, 99483 45013

*'నీలాచల నివాసాయ, నిత్యాయ పరమాత్మనే/సుభద్రా ప్రాణనాథాయ / జగన్నాథాయ మంగళం!'* ఒడిశాలోని పూరీ ఎంత ఆధ్యాత్మిక మహాక్షేత్రమో, ఏటా అంగరంగ వైభవంగా ఏర్పాటయ్యే జగన్నాథ రథయాత్ర అంత విశ్వవిఖ్యాతం. శతాబ్దాల చరిత్ర, అత్యద్భుత నిర్మాణ సంపద, మహత్తరపురాణ నేపథ్యం, కోట్లాది భక్తజనుల అపారభక్తి– విశ్వాసాలకు నిలయం ఆ ఆలయం. సోదరి సుభద్ర, సోదరుడు బలరాముడితో కృష్ణ/ విష్ణు సందర్శన భాగ్యం మనదేశంతోపాటు అనేకానేక దేశాల వారికీ రథయాత్ర నాడు నేత్రానంద ప్రదాయకం. సువిశాల విస్తీర్ణంలో, శతాధిక మందిర సముదాయంతో, శంఖాకృతిలో విలసిల్లే జగన్నాథ దివ్యక్షేత్రం అనేకానేక విశేషాల, విలక్షణ రీతుల సమాహారం. ప్రతీసంవత్సరం సంప్రదాయ అనుసారంగా జూన్‌నెలలో జరిగే రథయాత్రోత్సవం అత్యంత మనోహరమైనది.

జగన్నాథ ఆలయ కేతనం, సుదర్శన చక్రరూపం, అపురూప రీతిలోని ధ్వజస్తంభం, కనువిందు కలిగించే సింహద్వారం, శిల్పకళాకట్టడాలు, చిత్రీకరణతో శోభించే గోడలు– స్తంభాలు, గణగణల ఘంటానాదాలు, విలక్షణత ప్రతిఫలించే పూజాదికాలు అన్నీ వేటికి అవే ప్రత్యేకం. చందన, స్నాన, డోల యాత్రాదులతో పాటు నయనానందకరంగా పూరీలో నిర్వహించే రథయాత్రను తిలకించిన జీవితాలన్నీ ధన్యం. గోకుల ప్రాంతం నుంచి మధురకు పయనంగా, ప్రియభక్తుల కోసం సాక్షాత్తు ఆ స్వామి తరలిరావడంగా యాత్ర అత్యంత ప్రశస్తం. నేత్రోత్సవం, రథయాత్ర, మారు రథయాత్రోత్సవాలన్నీ భక్తకోటి జయజయధ్వానాల మధ్య కొనసాగి అపూర్వ అనుభూతిని ప్రతీ ఒక్కరి సొంతం చేస్తాయి.

పుణ్యజలాలతో అభిషేకం, స్నానపౌర్ణమి క్రతు నిర్వహణం, వర్ణాలతో నవాలంకరణం, ప్రతీ ప్రక్రియా హృదయానందకరం. ఏటేటా నిర్మాణం సాగించే నంది(గరుడ), తాళ, దర్పదళనాలు రథరూపాలై దైవదర్శనాలు చేయిస్తాయి. ఆగమశాస్త్రరీత్యా వందలాది కొయ్య దుంగలను(మానులు) వినియోగించి నిర్ణీత అడుగుల ఎత్తుతో, చక్రాల అమరికతో, అశ్వ రూపాలతో నిర్మాణాలను చేపడతారు. జగన్నాథ, బలభద్ర, సుభద్ర దేవతామూర్తుల రథాలు మూడూయాత్రగా సాగుతుంటే ఆ ఘట్టం 'సకల భక్తజనావళికీ సంరక్షణం, సత్యధర్మశాంతి ప్రేమల సమ్మిళితం, భారతీయ సంస్కృతీ నాగరికతల పరిపోషణం'. బంగారుచీపురుతో రాజకుటుంబీక సేవ, యాత్రోత్సవంలో అడుగడుగునా భక్తజననినాదం, గుండీచా మందిరం వరకూ కొనసాగింపు, అనంతర యాత్రల తదుపరి నైవేద్య సమర్పణం... మధురానుభూతులు కలిగించి మానవజీవితాల్ని చరితార్థం చేస్తూనే ఉంటాయి.

పూరీ రథయాత్రకు, నేత్రోత్సవానికి అవినాభావ సంబంధం ఉంది. ముందుగా స్నానోత్సవంలో భాగంగా, మంగళవాయిద్యధ్వనుల మధ్య ఊరేగింపు కొలువుతీరి ఉన్న మండపంనుంచి స్నానవేదిక దాకా తోడ్కొని వస్తారు. సువర్ణబావి నుంచి కలశజలాలు తెచ్చి, సుగంధద్రవ్యాలు కలిపి, మంత్రాలు కీర్తనలు శంఖనాదాల నడుమ అభిషేకోత్సవం నిర్వర్తిస్తారు. ఇదే శ్రీక్షేత్రం. సర్వసామరస్య సమన్వయసహకార భావనలన్నింటికీ ప్రత్యక్షరూపం.

ఆలయనైవేద్యానికి అనిర్వచనీయ రుచి అంటూ ఉంటుంది. వంటకు మట్టి కుండలను మాత్రమే వినియోగిస్తారు. వంటశాల సమీపంలోని గంగ, యమున అనే పేర్లున్న బావుల నుంచి పవిత్రజలాలు తెస్తారు. ఐదు ప్రత్యేక ముహూర్తాల్లో

నైవేద్యసమర్పణం జరుగుతుంది. యాభైఆరు తరహాల ఆ నైవేద్యాలు ఎంతో విశిష్టం, ఎంతైనా విలక్షణం. వంటశాల సైతం అతిపెద్దది.

అన్ని విధాలా విశేషత సంతరించుకున్న రథయాత్ర మొదలవగానే భక్తుల హృదయాలు పొంగి పులకించి జగన్నాథ స్మరణ చేస్తూనే ఉంటారు. సర్వం జగన్నాథం. స్వరం జగన్నాథ మయం. ఉదయాన్నే గుడిలోనికి వెళ్లిన పూజారులు పూజాదికాలు జరిపి, ఆవరణలోని ఆనందబజారు, అరుణ స్తంభం సమీపంగా ఊరేగింపు చేస్తారు. *'జయ జయ హే! జగన్నాథా'* నినాదాలతో పూరీక్షేత్రవీథులన్నీ మారుమోగుతాయి. యాత్ర ప్రారంభ సందర్భంలో సంస్థానాధీశులు రథానికి బంగారు చీపురుతో **'రథపరిశుభ్ర'** క్రియ జరుపుతారు. గంధం నీటిని భక్తి పూర్వకంగా చిలకరించిన అనంతరం, రథం దిగి చుట్టూరా ప్రదక్షిణం చేస్తారు. మొత్తం మూడురథాలచుట్టూ ప్రదక్షిణలయ్యాక, యాత్రోత్సవం ఆనందతన్మయంగా చైతన్య చిన్మయంగా మొదలవుతుంది.

అసంఖ్యాక భక్తజనవాహిని మధ్యన 'జై జగన్నాథా' అని కీర్తిస్తూ తాళ్లను పట్టుకొని రథం లాగుతూ ముందుకు సాగిపోతుంటారు. ప్రధానమార్గంలో ఊరేగింపు నెమ్మదిగా కొనసాగుతుంది. అది **ఘోషయాత్రా** తరుణం. గుండీచా చేరుకునేందుకు పలు గంటల సమయం పడుతుంది. ఆ నిలయానికి చేరుకున్నాక, ఆరుబయట రథాల్లో విశ్రాంతి. తదుపరి మేళ తాళాల సహితంగా గుడిలోకి చేరుస్తారు. అక్కడ ఆతిథ్యం అయ్యాక, నిర్ణీత వేళకు తిరుగు ప్రయాణం. అదే **బహుదా యాత్ర.** రథాలు మూడూ తిరిగి జగన్నాథ నిలయానికి చేరతాయి. మరునాడు స్వామికి బంగారుఆభరణాల అలంకరణ. ఆ వేడుక చూసేందుకు భక్తులు ఎందరెందరో తరలివస్తారు. విగ్రహాలను యథాపూర్వంగా లోపల అలంకరించి ఉంచడంతో, యాత్రా క్రతువు అయినట్లు పరిగణిస్తారు.





**సకల సమైక్యత-**
**సమగ్రతలకు మారుపేరు**
**పూరీక్షేత్రం**

ఇదే పూరీజగన్నాథస్వామిఆలయం. సంస్కృతీ ప్రాచుర్యానికి ఆలవాలం. ఇక్కడే ముక్తి మండపం నిర్మితమైంది. నిర్ణయాల స్వీకరణ ప్రదేశం అది. డోల మండపం, అందులోని శిలాతోరణం ప్రతీ ఒక్కరూ చూసి తీరాల్సినవి. ఏటేటా భక్త జనావళిని అలరించే రథోత్సవం సకలసమైక్యత, సంపూర్ణ సమగ్రతలకు మారుపేరు. మనదైన సాంస్కృతిక, ధార్మిక ఐక్యతకు నిదర్శనం. జగన్నాథరథచక్ర పయనంతో శుభం కలుగుతుంది. అంతటా శాంతి వికసిస్తుంది. స్వాతంత్ర్యం, సమభావం, సౌభ్రాతృత్వం, సౌహార్ద్రం వెల్లివిరుస్తాయి. పూరీ పురుషోత్తమ క్షేత్రం, జగన్నాథపురీ అదే. ప్రాచీనమైన రథయాత్ర సంరంభం తరతరాల భక్తివిశ్వాసాలతో ముడిపడి ఉంటోంది. ఆ ప్రస్తావన అనేక ప్రాచీనపురాణాల్లో మనకు కనిపిస్తుంది.

యాత్రలో ప్రధాన దారుమూర్తులే కదలి వస్తుండటం అన్నింటికన్నా మించిన విశేషాంశం. అందుకే *'జగన్నాథ స్వామీ! నయన పథగామినీ'* అని శ్లాఘించారు మహనీయులు.

*'జై జగన్నాథా'*



# పతంజలి యోగసూత్రములు

- యోగాచార్య డా॥ ఆర్.లక్ష్మీనారాయణ,
9391529539

**యో**గము గురించి వేదాల్లో కూడా వివరించ బడింది. ఈ యోగసాధనను సామాన్యులకు సహితం సులభతరం చేసినవారు **'పతంజలిమహర్షి'**. పతంజలి మహర్షి అతిప్రాచీనుడు, తపస్సిద్ధి పొందినవారు. ఆయన కాలం నాటికే యోగం ఆచరణలో ఉంది. అయితే మహాజ్ఞానులు, తపస్సిద్ధి పొందిన మహర్షుల వంటి వారికే యోగం అనుసరణీయంగా ఉండేది. అందుచేత పతంజలి వేదాల్లోని యోగ-ధ్యాన పద్ధతులను అధ్యయనం చెయ్యడమేగాక, ఆనాటి అభ్యాస రీతులను క్షుణ్ణంగా పరిశీలించి, వాటికి తన అనుభవాలను జోడించి ప్రత్యేకంగా, యోగాభ్యాసం మీద గ్రంథం రాశారు. అదే పతంజలి **'యోగ సూత్రములు'.**

యోగ సూత్రములను నాలుగుభాగాలుగా విభజించి రాశారు పతంజలిమహర్షి. అవి **1)సమాధిపాదము 2)సాధనపాదము 3)విభూతి పాదము 4)కైవల్యపాదము.**

**1) సమాధిపాదము- 'అథ యోగానుశాసనమ్'-** అనగా ఇప్పుడు చెప్పబడుతున్న స్వరూపలక్షణములు కలిగినటువంటిది యోగము. 'స్వరూపము' అనగానే మన మామూలు దృష్టికి, అంటే చూపులకి 'రూపము'తో కనిపించే వస్తువు, జీవి, లేదా ప్రకృతి అనే అభిప్రాయము కాదు. ఇక్కడ 'స్వరూపము' అంటే స్వతంత్రంగా వ్యవహరిస్తున్నట్లు, మనకేదైతే కన్పిస్తోందో అది స్వతంత్రమైనదీ కాదు. దానికి ఆ శక్తి నందిస్తున్నది 'మరేదో' ఉంది. 'ఆ' "మరేదో" అనేదే ఈ దేహము యొక్క నిజ రూపము 'స్వరూపము'. అది కంటికి కనిపించకపోయినప్పటికీ అదే మన నిజస్థితి. అట్టి యధార్థస్థితికి తెలుసు కోవడమే **యోగము**.

## 2)యోగః చిత్తవృత్తి నిరోధః

'చిత్త' మనగా అంతఃకరణము. అంతఃకరణము వలన జరిగే వృత్తులను అంటే విధులను నిరోధించడం లేదా నిగ్రహించడం లేదా ఆ విధులను స్వాధీనములోకి తెచ్చుకోవడమే యోగము. అయితే 'చిత్తము' అంటే ఏమిటో దాని విధులు ఏమిటో తెలుసుకుంటేగానీ వాటిని స్వాధీన పర్చుకుని చెప్పుచేతల్లో ఉంచుకోలేము. ఉదాహరణకు మనము కన్నులతో ప్రపంచాన్ని చూస్తున్నాము. 'చూడటం' అనేది క్రియ.

మరి చూడమని మనల్ని ప్రేరేపించేది ఏది? కళ్ళు. వాటంతటవి చూడవు. మనం నిద్రపోతున్నప్పుడు కళ్ళు మూసుకుంటాం. నిద్రపోతున్నప్పుడు కూడా మనకి కళ్ళున్నాయి. కానీ 'చూడాలి' అనే ప్రేరణ దానికి లేదు. ప్రేరణలేనందువల్ల మనం నిద్రిస్తున్నప్పుడు కళ్ళుమూతలు పడుతున్నాయి. కంటి రెప్పలు చాటున విశ్రాంతి తీసుకుంటున్నాయి. మనకి 'చూడాలి' అన్న భావన కలగగానే రెప్పలు వాటంతటవే తెరుచుకుంటాయి. ఇలా ప్రేరేపించడమే 'కర్మ'.అయితే 'చూడు' అనే ప్రేరణ కళ్ళకి కలిగించే దెవరు? అదే 'మనస్సు'. మనస్సులో ప్రేరణ కలగ్గానే, ఆ ప్రేరణ వెళ్ళి ఆ నాడీ కేంద్రాన్ని ఉత్తేజపరుస్తుంది.

అప్పుడా శక్తి కన్నులని చేరుతుంది. కన్నులలో ఉన్న 'రెటీనా' అనే పొరమీద వెలుతురు వల్ల బయట ఉండే దృశ్యాలు ప్రతిబింబిస్తుంటాయి. అంటే మనస్సులో ప్రేరణ కలిగి, ఆ ప్రేరణ మెదడు నాడీకేంద్రాన్ని ఉత్తేజపరిస్తే, ఆ 'తేజం' కళ్ళలో వున్న 'రెటీనా పొరమీద ప్రతిబింబించే బాహ్యదృశ్యాలను చూడ గలుగుతోందన్నమాట..' అంటే 'చూడాలి' అనే క్రియకి ప్రేరణ మనస్సు. చూపించేది నాడీ కేంద్రంలో ఉత్పన్నమైన తేజం. అదే మనస్సు మన చెప్పుచేతల్లో ఉంటే లేదా మనస్సనే ప్రేరణశక్తి మన

అదుపాజ్ఞల్లో ఉంటే, ఒకవేళ పొరపాటున అశ్లీలదృశ్యాన్ని చూసినా తక్షణం చూపు మరల్చుకుంటాం. ఆ దృశ్యాన్ని చూడాలి అన్న భావాన్ని తక్షణం విస్మరిస్తాం. అయితే ఇక్కడో ముఖ్య విషయం తెలుసుకోవాలి. చూడాలన్న ప్రేరణ కలిగించేది మనస్సే. చూసిన దృశ్యంమీద అసహ్యతని కలిగించేది మనస్సే. చూపించి ఆనందింపజేసేదీ మనస్సే. అదే దాని వృత్తి. అంటే విధి.

కనుక మనస్సు ఎన్ని విధాల ప్రోత్సహించినప్పటికీ దానికి లొంగకుండా మన వశంలో ఉండేట్లు చూసుకోవాలి. అంటే దాని పనివిధానం మీద అదుపు ఉండాలి. అలా మన చిత్తాన్ని అంటే మనస్సుని దాని సహజ స్వభావానికి విరుద్ధంగా మన అదుపులోకి తెచ్చుకోవడమే 'యోగము'.

మనకి కనిపిస్తున్న ప్రకృతి స్వరూపానికి మూలం ఈ పంచభూతముల సంయోగము. ప్రకృతికి పంచభూతాలు ఆధారమైనట్లే, మానవజన్మకీ ఆ పంచభూతాలే ఆధారం. మానవ దేహంలోనూ పంచభూతాలు ఉన్నాయి. భూమికి ఆకర్షణశక్తి ఉన్నట్లు దేహంలో ఉన్న మనస్సుకి ఆకర్షణశక్తి ఉంది. ఆకర్షణ అంటే ఆశించడం, తన స్వాధీనం చేసుకోవాలనుకోవడం.

అట్లే మనస్సుకి కూడా ఉన్న ఆకర్షణశక్తి వల్ల ప్రకృతినంతా తన సొంతం చేసుకోవాలన్న కోరిక కలుగుతోంది. అయితే మనస్సు కోరుకోగానే కోరిక తీరదు కదా! అందుకని బుద్ధిని ప్రేరేపిస్తుంది. ఆ బుద్ధి ఏం చేస్తుంది? ఇంద్రియాలని రెచ్చగొడుతుంది.

**మనస్సు, బుద్ధి, ఇంద్రియములు, అహంకారము, జ్ఞానం ఈ** (అయిదు) పంచభూతాలసమ్మిళితమే 'అంతఃకరణం' అదే పురుషుడు. అలాగే పంచభూత సమ్మిళతమైన మన అంతఃకరణ కూడా మనలో నిశ్చలంగా ఉంది. మనస్సువల్ల కోరిక పుట్టి, బుద్ధివల్ల ఇంద్రియములు ప్రభావితమై, ఆ ఇంద్రియాలు అహంకారాన్ని ఆశ్రయించి, అహంకారానికి జ్ఞానం తోడుకావడం వల్ల కోరిక క్రియారూపం దాల్చుతుంది. అంటే కోరికలకీ మూలమైన జ్ఞానం, అహంకారం, ఇంద్రియములు, బుద్ధి, మనస్సు, అనే పంచభూతాలు వాటి ఇష్టమొచ్చి విచ్చలవిడిగా సంచరించకుండా వాటిని అదుపు చెయ్యాలి. అలా మనలో ఉన్న పంచభూత సమ్మిళితమైన చిత్తాన్ని నిరోధించి అదుపు చెయ్యడమే యోగము.

“చిత్తమునకు క్షిప్తము, మూఢము, విక్షిప్తము, ఏకాగ్రము, నిరుద్ధము” అని వివిధ అవస్థలు ఉన్నవి. క్షిప్తావస్థకు తార్కాణం ప్రకృతి. అంటే సుఖం వచ్చినప్పుడు మనస్సు పొంగిపోయి, కష్టం కలిగినప్పుడు దుఃఖంతో కృంగిపోతుంది. ఇలా మనస్సులో సంభవించే మార్పులనే క్షిప్తావస్థ అంటారు. కనుక సుఖదుఃఖాలు ఏవి వచ్చినప్పటికీ మనస్సులో ఎలాంటి మార్పు రాకుండా మనస్సుని అదుపులో ఉంచుకోవడమే చిత్తవృత్తి నిరోధం, ఇలా చిత్తమును పొంగనీయక కృంగనీయక ప్రశాంతమైన సరస్సు మాదిరి ఉంచుకునే లక్షణమే 'విక్షిప్తావస్థ'. అంటే సుఖదుఃఖాలు నివృత్తి నిరోధం, వాటికి చలించకుండా స్థిమితంగా ఉండే మానసికస్థితినే విక్షిప్తావస్థ అంటారు. సోమరితనము 'మూఢావస్థ' లక్షణము.

మనస్సుని మనం శోధించదల్చిన విషయం మీదనే నిల్పడం 'ఏకాగ్రావస్థ'. అంటే మనస్సులోకి ఇతర ఆలోచనలు వేటినీ రానివ్వకుండా కేవలం దేన్ని గురించి అయితే మనస్సు నిండి ఉంటుందో, ఏది తప్ప మరేదీ మనస్సులో చొరబడకుండా మనస్సు స్థిరమవుతుందో ఆ అవస్థే 'ఏకాగ్రత'. మనస్సు ఏకాగ్రమవుతున్నప్పుడు ఆ స్థితి నుండి ఉన్నత స్థితికి అంటే సమాధిస్థితికి తీసుకుపోయే స్థితియే 'నిరుద్ధావస్థ'.

దేనిని గురించి తపిస్తున్నామో దాని మీదనే తనువు, మనసూ, ఇంద్రియములు, బుద్ధి, జ్ఞానం లగ్నంచేసి బాహ్య ప్రపంచాన్ని, అంతర్ ప్రపంచాన్ని మర్చిపోవడమే సమాధిస్థితి. అంటే మనం భౌతిక ప్రపంచంలో నివసిస్తున్నా, మనకి భౌతిక దేహం ఉన్నా వాటి గురించి స్ఫురణ అంతరించి మనం శోధిస్తున్న విషయమే మన ప్రపంచం అన్న తాదాత్మ్యస్థితికి చేరుకోవడం 'సమాధిస్థితి'. అట్టి సమాధిస్థితికి తీసుకుపోయేదే నిరుద్ధావస్థ.

అయితే బుద్ధి, ఇంద్రియములు, అహంకారము దాన్ని ఆవహించి కలవర పరుస్తుంటాయి. కనుక కోరికలను తగ్గించుకుని ఇంద్రియములను అంటే విషయవాంఛలను అదుపులో పెట్టుకుని, బుద్ధిని అదుపు చేస్తే మనస్సు తన సహజసిద్ధమైన ప్రశాంత స్థితికి చేరుకుంటుంది. కనుక కోరికలను, విషయ వాంఛలను తగ్గించుకుని బుద్ధిని అదుపులో పెట్టుకోవడమే 'చిత్తవృత్తి నిరోధం'. అది యోగం వల్ల సంభవిస్తుంది.

మన మహర్షులు

# భగవాన్ మరీచిమహర్షి

- శ్రీ ఎ.ఎస్.కృష్ణచంద్ర దీక్షితులు
శ్రీవారి అర్చకులు,
తిరుమల

శ్రీమన్నారాయణుడు పంచాత్మ స్వరూపుడని తైత్తిరీయ ఉపనిషత్తు పేర్కొంటున్నది. భగవంతుడైన శ్రీమహావిష్ణువు పర, వ్యూహ, విభవ, అంతర్యామి, అర్చారూపాలలో గోచరిస్తాడని పురాణవచనం. **పర, వ్యూహ, విభవ, అంతర్యామి** రూపాలలోని నారాయణుణ్ణి సాక్షాత్కరించుకోవడం సామాన్యజనులకు



దుర్లభం. ఇక ఐదవదియైన **'అర్చారూపం'** అంటే విగ్రహరూపం లోని పరమాత్మరూపాన్ని ఆలయాల్లో అతి సులభంగా ఎవరైనా దర్శించి తరించవచ్చు. అటువంటి మహత్తరమైన అర్చా రూపంలోని పరమాత్మను ఆరాధించి, ధన్యత చెందడం ఎలా? అన్న విషయాలను సవివరంగా తెలియజేసేవే **'ఆగమశాస్త్రాలు'**. వీటిలో **'భగవాన్ విఖనసమహర్షుల'** వారు ప్రవచించిన శ్రీవైఖానస భగవచ్ఛాస్త్ర విధిగానే, తిరుమల దివ్యక్షేత్రంలో శ్రీవారికి నిత్య, నైమిత్తిక, కామ్యోత్సవాలన్నీ జరుగుతున్నాయి. స్వాయంభువ మనువుకాలంలో, కృతయుగాదినాడు విష్ణ్వంశ సంభూతుడైన భగవాన్ విఖనోమునీంద్రులు, నైమిశారణ్యంలో అవతరించి- **అత్రి, భృగువు, మరీచి, కశ్యపుడు** అనే నలుగురు మునులకు వైఖానసశాస్త్రాన్ని బోధించినాడు.

**కశ్యపోఽత్రిర్మరీచిశ్చ వసిష్ఠాంగిరసో హ్యహం (భృగుః)।**
**పులస్త్య పులహశ్చైవ క్రతుశ్చ నవసంఖ్యాకాః।**
**ఏతే విఖనసః శిష్యాః లోకానుగ్రహకారిణః ॥**

**(సమూర్తార్చనమ్)**

**కశ్యపుడు, అత్రి, మరీచి, వసిష్ఠుడు, అంగీరసుడు, భృగువు, పులస్త్యుడు, పులహుడు, క్రతువు**- ఈ తొమ్మిది మంది విఖనసుని శిష్యులు, లోకానుగ్రహకారులు. వీరిలో **మరీచి మహర్షి** బ్రహ్మమానసపుత్రుడై, అయోనిజుడై, ప్రజాపతులలో ముఖ్యుడై, సప్తర్షిలోకములో విరాజిల్లుతున్న మహనీయుడు.

ఆదికాలములో శ్రీమహావిష్ణువు సమస్త విశ్వాన్ని సృష్టించడానికి సంకల్పించగానే, నాభికమలం నుండి చతుర్ముఖ బ్రహ్మ ఉద్భవించాడు. నారాయణుని ఆజ్ఞ మేరకు సృష్టి చేయ దలచి, ధ్యానములో ఉండి, జరాయుజాండ జములను సృష్టించాడు. బ్రహ్మదేవుని నిఖిలావయవములనుండి దేవతలు, పితరులు, అసురులు, మనుష్యులు, అనేక భూతములు మొదలైన వాటితో చరాచర ప్రపంచము సృష్టించబడెను. అయినా కూడా బ్రహ్మ సంతృప్తి చెందిక, తనతో సరియైన వారు, తనను పోలిన వారు, ప్రజాపతులు, మునిశ్రేష్ఠులు మొదలగువారిని పుట్టించి నాడు. వీరిలో నవబ్రహ్మలలో ఒకరైన మరీచిమహర్షులవారు కూడా ఉద్భవించినారు. మరీచిమహర్షి బ్రహ్మదేవుని ఆజ్ఞమేరకు సృష్టి చేయడంలో సహాయపడుతూ, నిరంతరం తపస్సులో

ఉండేవాడు. వీరికి కర్దమప్రజాపతి– దేవహూతిల పుత్రిక కళతో వివాహం జరిగింది. మరీచిమహర్షికి కళ ద్వార కశ్యపుడు అనే కుమారుడు, పూర్ణిమ అనే కుమార్తె కలిగారు. కశ్యపుడు గొప్ప మహర్షియై, దక్షప్రజాపతి పిల్లల్ని పెళ్ళి చేసుకుని సర్వభూతాల్ని సృష్టించాడు. ఈ రకంగా మరీచిమహర్షి తండ్రి బ్రహ్మగారి అనుమతి ప్రకారం వంశాన్ని ఉద్ధరించాడు. మరీచిమహర్షి మహాజ్ఞాని, విరాగి, తపస్వి, వేదవేదాంగ పారంగతుడు. 'మరీచిస్మృతి' అనే ధర్మశాస్త్రాన్ని రచించాడు.

విఖనస మునీంద్రులవారు వైఖానసశాస్త్రాన్ని మరీచి మహర్షుల వారికి ఉపదేశించినారు. మరీచి తను గ్రహించిన సారాన్ని 'సంహితలు' అనే పేరుతో లక్షాఎనభైనాలుగువేల శ్లోకముల పరిమాణంతో–

జయానందం చ సంజ్ఞానం వీరం చ విజయం తథా
విజితం విమలం కల్పం మద్యైవం సంహితాష్టకం।
చతురశీతి సాహస్రం లక్షో పరికృతం తథా॥

*జయసంహిత, ఆనందసంహిత, సంజ్ఞానసంహిత, వీరసంహిత, విజయసంహిత, విజితసంహిత, విమల సంహిత, జ్ఞానసంహిత* అనే 8 గ్రంథాలుగా రచించినాడు. వీటిలో *ఆనందసంహిత, విమానార్చానకల్పం* అనే గ్రంథాలు మాత్రమే లభ్యమౌతున్నాయి. ఇందులో విమానార్చనకల్పం అనేది ప్రపంచంలో అన్నీ ఆలయాలు ఏ రీతిలో కట్టబడాలి? ఇంకా ఆలయప్రాకారం, గోపురమండప– విమాన నిర్మాణములు, శిల్పశాస్త్ర మర్యాదలు విశేషంగా విశదీకరించబడినది. ప్రతిష్ఠ, బ్రహ్మోత్సవ, స్నపన ప్రాయశ్చిత్తాది విధులను సులభసాధ్య రీతిలో వివరించినారు. ఆలయనిర్మాణానికి దిక్సూచి వంటి గ్రంథం విమానార్చనకల్పం.

మరీచిమహర్షి ఆషాఢమాస శుక్లపక్ష పూర్వఫల్గునీ నక్షత్రమున జన్మించినట్లు వైఖానసగ్రంథములు పేర్కొంటు న్నాయి. అందువలన ఆ రోజున మరీచిమహర్షి జయంతిని తిరుమలఆలయంలో విశేషంగా నిర్వహిస్తారు.

*'ఓమ్ నమో వేంకటేశాయ'*

### వైకుంఠపాళి
### :: 89 – సమాధానాలు ::

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | 1 ద | శ | 2 కం | ఠ | 3 డు | | |
| | | ద | | జా | | ల్చు | | |
| 4 ప్ర | భ | | 5 ప | త | నం | | 6 వే | 7 ము |
| యో | | 8 మ | | ము | | 9 ఖ | | య్యే |
| 10 జ | టా | యు | వు | | 11 అ | గ | స్త్య | డు |
| న | | డు | | 12 చి | | ము | | మా |
| 13 ము | ద్గ | | 14 మ | రు | లు | | 15 ఇ | ర్లు |
| | | 16 కా | | నా | | 18 అం | | |
| | | 18 మం | ద | మా | రు | తం | | |



## శ్రీనివాసమంగాపురం, శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారి సాక్షాత్కారవైభవం
### (2023, జూన్ 24 నుంచి 26వరకు)

**1940, జూలై 11వ తేదీన అషాఢ శుద్ధసప్తమి ఉత్తరఫల్గునీ నక్షత్రంనాడు అప్పటి అర్చకులు శ్రీసుందర రాజ స్వామివారి స్వప్నా దేశంమేరకు 'సాక్షాత్కారవైభవం' ఘనంగా జరిగింది. ఆనాటి సంఘటనను పురస్కరించుకొని తి.తి. దేవస్థానం ప్రతి ఏటా ఆషాఢశుద్ధసప్తమి లేదా ఉత్తరఫల్గుని నాటికి ముందురోజు తర్వాతి రోజు ఇలా 3రోజుల పాటు ప్రతి ఏటా "సాక్షాత్కారవైభవోత్సవాలు" పేరిట ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నది. శ్రీదేవిభూదేవి సమేత శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారికి మొదటిరోజు సాయంత్రం తిరుచ్చి వాహనం. రెండవరోజు హనుమద్వాహనం, మూడవరోజున గరుడోత్సవం జరుగుతుంది. ఈ మూడు రోజుల పాటు ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి.**

## ఉపనిషద్వాక్యమ్

# "మా విద్విషా వహై"

### (పరస్పరం ద్వేషం లేకుండా ఉందాము)

– బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ

ఇది ప్రసిద్ధ ఉపనిషత్ వాక్యం. ఇది గురుశిష్యులు చెప్పుకునే శాంతి పాఠంగా ప్రసిద్ధి.

విద్య నేర్చుకున్నందుకు ద్వేషభావం లేకపోవడమే ప్రయోజనం, కానీ దానికి ఇంకా విస్తృతి ఉంది.

ఒకరి పట్ల ఒకరికి వ్యతిరేక భావం ఉండడమే 'ద్వేషం'. ఆ ద్వేషాన్ని ద్వేషించే సంస్కృతి మన భారతీయులది. ఈ ఒక్క ద్వేష గుణాన్ని జయించామా, అన్నీ సాధించినట్లే. ప్రతి గొప్ప మార్గానికీ పునాది ఇది.

ద్వేషం అనే వ్యతిరేకభావానికి అసూయ, కోపం, పగ, హింస, శత్రుత్వం ఇవన్నీ శాఖలుగా చెప్పవచ్చు లేదా సంతానంగా చెప్పవచ్చు. ఈ దుంపని నరికితే సరి వ్యతిరేక భావనల వృక్షం సమూలంగా నాశనం అవుతుంది.



భక్తిమార్గంలో కూడా ద్వేష రాహిత్యమే ప్రధానగుణంగా చెప్పాడు శ్రీకృష్ణపరమాత్మ– *"అద్వేష్టా సర్వ భూతానాం మైత్రః కరుణ ఏవ చ॥"*– సామాన్యంగా ఒకరికి ఒక విషయం నచ్చకపోవచ్చు, అభిప్రాయభేదం రావచ్చు, కానీ అది ద్వేషానికి దారి తీయరాదు. అంటే ఒకరి వైఖరి మనకి ప్రమాదకరంగానో, అజ్ఞానంగానో కనపడవచ్చు. దాని నుండి మననీ, మన జీవన విధానాన్ని కాపాడుకునే ప్రయత్నం చేయవచ్చు. అయితే ద్వేషంతో ప్రతీకారం పెంచుకోరాదు.

సమాజంలో ఒకవర్గంలో కొందరి దురవగాహన, దుర్మార్గం సమాజహితానికి భంగకరం కావచ్చు. దాని నుండి జాగ్రత్తపడి, జాగృత పరచడంలో ఆలస్యం చేయకూడదు. పైగా మొత్తం ఆ వర్గం పట్ల ద్వేషాన్ని పెంచుకోవడం సరైంది కాదు.

ద్వేషం ఒక వర్గానికి ఒక వ్యవస్థకో చెందినది కాదు. అది వ్యక్తికి సంబంధించింది. వ్యక్తికీ వ్యక్తికీ భిన్నత్వం లేకుండా ఉండదు. ఆభిజాత్యమో, భాషో, మతమో, కులమో ఏదైనా కావచ్చు. ఒక వ్యక్తిలోని ప్రత్యేకత, విభిన్నత మరొక వ్యక్తికి సరి పడనిదిగానే తోచవచ్చు. అంతమాత్రమున అది ద్వేషానికి దారి తీయరాదు.

స్నేహం, కరుణ– హృదయ లక్షణాలుగా ఉంచుకొని మనల్ని ద్వేషించే వారి నుండి మనల్ని రక్షించుకోవడానికి తగిన విధంగా స్పందించి ఎదుర్కోవడం అనేది ఆచరించాలి.

మనకు నచ్చిన విషయాన్ని ప్రేమపూర్వకంగా ఆదరిస్తే, అది మనపై మంచి ప్రభావం చూపిస్తుంది. అలాగే నచ్చని విషయాన్ని దూరంగా ఉంచడమో, దాడి చేయకుండా కాపాడు కోవడమో చేయవచ్చు కానీ, ద్వేషిస్తూ కూర్చుంటే– ఆ ద్వేషంకూడా ఒక భావనాయోగమై మన మనస్సును వికృతంగా మారుస్తుంది.

ప్రేమ, సానుభూతి, సహానుభూతి ఇవి సాధించగలిగే విజయాలను ద్వేషం ఏనాడు సాధించలేదు. అవతలి వారి విధానం ఏదైనా కావచ్చు. అది దేనికీ పనికిరానిదని, మనదే గొప్పదని చెప్పడం సరికాదు. ఇటువంటి స్వభావం సమాజంలో చాలాచోట్ల కని పిస్తాయి. ఈ స్వభావాలు 'ద్వేష' విత్తనం నుండి మొలకెత్తిన విషవృక్షాలే, కానీ ఇవి మన సనాతనధర్మంలో నిషేధం. స్వాభావికధర్మమునుండి ఇతరంలో కూడా మారడం మనం అంగీకరించం. ఎందుకంటే– 1)ఆక్రమణ 2)అన్య స్వీకరణ ఈ రెండు ద్వేషమూలకాలే. ఇందులో మొదటిది ఎదుటి వారిపై ద్వేషమైతే, రెండవది మనపై మనకు ఉన్న ద్వేషం. ఈ రెండూ ప్రమాదకరమైనవవే.

ద్వేషభావం ధర్మానికి ప్రధానశత్రువు. దీనినే మన ఆస్తిక దర్శనాలు లేదా ఉపనిషత్తులు తేల్చి చెప్పిన ప్రధాన అంశం.

ఓమ్ తత్సత్



# తిరుమల సమయాచారములు

## (తిరుమల-తిరుపతి ఐతిహ్యమాల)

తెనుగు అనువాదకులు:
కీ.శే. డా॥ ఎన్.సి.వి.నరసింహాచార్యులు,
కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు

*గత సంచిక తరువాయి భాగం....*

**(పంచపర్వాదులందు) శ్రీవేంకటరమణస్వామివారి అధ్యయనోత్సవ కాలములందు దివ్యప్రబంధములను అనుసంధింపవలసిన విధానము**

తీర్థాభిగమనోత్సవ దినముతో కలిసి అధ్యయనోత్సవ దినములు ఇరువది నాలుగు. చిన్న అధ్యయనోత్సవ సమారంభము *(పగల్ పత్తు)* మార్గళి (ధనుస్సు) మాసమున శుక్లపక్ష ఏకాదశికి ముందుగ ముగియు పదునొకండు దినములు. మొదటి దినోత్సవము రాత్రి *'ముదల్ తిరువందాది'* మొదలుకొని మూడు *తిరువందాదులు, నాన్ముగన్ తిరువందాది, తిరువిరుత్త* మలలోని ఆద్యంతపాశురములు అనుసంధింపవలెను. రెండవ దినము ప్రాతఃకాలమున 'ఇయఱ్పా' వేయి పాశురములు అనుసంధేయములు. రాత్రి తిరుప్పల్లాండు ఆరంభము. మూడవ దినమున ప్రాతఃకాలమున పెరియాళ్వార్ తిరుమొళి రెండు శతకములు; రాత్రి శెన్నియోఙ్గు, నాలుగవ దినమున ప్రొద్దున పెరియాళ్వార్ తిరుమొళిలోని మిగిలిన భాగము; రాత్రి విణ్ణీలమేలాప్పు. ఐదవదినమున ఉదయమున తిరుప్పావై, నాయ్చ్చియార్ *తిరుమొళి*; రాత్రి *ఊనేఱు శెల్వత్తు.* ఆరవ దినమున ప్రొద్దుట పెరుమాళ్ తిరుమొళి మొదలుకొని కణ్ణినుణ్ *శిఱుత్తాంబు* వరకు ప్రథమసహస్రము (ముదలాయిరమ్) పూర్ణముగ; రాత్రి *తిరుమొళి* సమారంభము; (అనగ) 'వాడమరదిడ్డైపోగి'. ఎనిమిదవదినమున ప్రొద్దున తిరుమొళి మూడవ, నాలుగవ శతకములు, రాత్రి 'పండై నాన్మఱై', తొమ్మిదవ దినమున ఉదయము ఐదు, ఆరు, ఏడు శతకములు; రాత్రి తెళ్ళియార్ దేవర్క్కుమ్, పదవ దినము ప్రొద్దున ఎనిమిది తొమ్మిది శతకములు; రాత్రి కాదిల్ కడిప్పిట్టు, పదునొకండవ దినమున ప్రొద్దున పదవశతకము, పదునొకండవ శతకము; రాత్రి *'తిరుక్కుఱున్దాణ్డకమ్', 'తిరునెడు'* న్దాణ్డకమ్, తిరుమొళి ముగింపు. ఇట్లు పదునొకండు దినములందును రాత్రి ప్రబంధగాయకులు కోయిల్ *తిరువాయ్*మొళిని సంగీతముతోడ అనుసంధింతురు. మరునాడు ప్రాతఃకాలమున మిగిలినదాని ననుసంధింపవలెను.

పిమ్మట శుక్లఏకాదశి మొదలుకొని పెద్ద అధ్యయనోత్సవము *(రాపత్తు)* పదిదినములందును ప్రాతఃకాలమందు నైవేద్యము ముగిసిన తర్వాత నాలుగు వేదములు, ఇతిహాస పురాణములు అనుసంధేయములు. రాత్రివేళలందు ప్రతిదినము *తిరువాయ్*మొళి ఒక శతకము చొప్పున అనుసంధింపవలెను. పదునొకండవదినమున రాత్రి కణ్ణినుణ్ *శిఱుత్తాంబు.* పంద్రెండవ దినమున రాత్రి (రామానుజ) నూత్తందాది; మరునాడు జ్ఞానవరాహస్వామి తిరువాయ్మొళి ఆకర్ణింతురు. మరునాడు తీర్థాభిగమనోత్సవము.

తిరుమలయందు అధ్యయనోత్సవమున రెండవదిన మారంభించి ఇరువదిమూడు దినములందును సాయంసమయములందు 'మలైకునియ నిన్ఱపెరుమాళ్' (ఉత్సవమూర్తి) శ్రీవీథులందు వేంచేయునప్పుడు ఉత్తర వీథియందు *శిఱియ* తిరుమడల్ అనుసంధేయము. అధ్యయనోత్సవము మొదటి దినమున శ్రీమణిమండపమున స్వామి ఆకర్ణించి యనుగ్రహించిన ప్రబంధములు మరునాడు మొదలుకొని పెద్దసన్నిధియందు (మూలవిరాట్టుచెంత) తగు సమయములందెల్ల అనుసంధేయములు.

*(ఇంకా ఉంది)*

# ముక్తిదాయకం... తొలి ఏకాదశి

- శ్రీ కె.లక్ష్మీనారాయణ

ప్రతి తిథీ ప్రత్యేకమే అయినప్పటికీ ఏకాదశికి మరింత ఎక్కువ ప్రత్యేకత కనిపిస్తుంది. ఏకాదశి అనే పేరు తలచుకోగానే ఓ పుణ్యభావన మన మనస్సుల్ని ఆవహిస్తుంది. ఏకాదశిరోజున పని ప్రారంభిస్తే విజయం తథ్యమనే ఆత్మవిశ్వాసం కలుగుతుంది. ఆ రోజున చేసే అర్చనలకు శ్రీమహావిష్ణువు ప్రీతి చెందుతారని పురాణాలు, ఆచారాలు కూడా విస్పష్టంగా ప్రకటిస్తున్నాయి. అందుకే ఎంత ఒత్తిడిలో ఉన్నా, ఎంత కష్టంలో ఉన్నా ఏకాదశి రోజున శక్తికొద్దీ విష్ణుమూర్తిని అర్చించి తరించాలని ప్రతిఒక్కరూ తపిస్తుంటారు. సంవత్సరానికి వచ్చే అన్ని ఏకాదశుల్లో **ఆషాఢశుద్ధఏకాదశి** అత్యంత పుణ్యప్రదమైనదిగా ప్రసిద్ధి పొందింది.

ప్రతినెలలో రెండు ఏకాదశులు చొప్పున ఏడాదికి 24 ఏకాదశులు వస్తాయి. అధికమాసం ఉంటే మరో రెండు ఏకాదశులు అదనం. ప్రతిఏకాదశికి నిర్దుష్టమైన నామధేయాలున్నాయి. ఆర్షసంప్రదాయంలో ఏకాదశితిథి పరమపవిత్రమైంది. ఆషాఢ మాసంలో వచ్చే శుక్లఏకాదశి విశేషమైంది. దానికే **'తొలి ఏకాదశి'** లేదా **'శయనఏకాదశి'** అని పేరు.

## ఏకాదశికథ



విష్ణువు 'మురుడు' అనే రాక్షసుడితో యుద్ధం చేస్తూ అలసిపోయి, సింహవతి అనే గుహలో సేదతీరుతున్నాడు. ఈ విషయాన్ని గ్రహించిన మురాసురుడు మాయోపాయంతో విష్ణువుపైకి దాడికి సిద్ధమయ్యాడు. అప్పుడు విష్ణువు శరీరంనుంచి యోగమాయ శక్తిరూపంలో వెలువడింది. ఆ మహాశక్తి మురాసురుణ్ణి సంహరించింది. విష్ణుమాయావిలాసం నుంచి ఉత్పన్నమైన ఆ శక్తి స్వరూపానికి శ్రీహరి వరాన్ని అనుగ్రహించాడు. విష్ణువుకు ప్రియమైన తిథిగా **'ఏకాదశి'** పేరిట ఆ శక్తిరూపం పూజలందుకుంటుందని పేర్కొన్నాడు. ఆనాటి నుంచి ఏకాదశితిథి పరమపవిత్రమైనదిగా పరిగణిస్తున్నారని, ఏకాదశితిథి ఆవిర్భావ వృత్తాంతాన్ని భవిష్యోత్తరపురాణం వివరించింది.

## పాపాలను పోగొట్టే తొలి ఏకాదశి

ఆషాఢమాసం శుక్లఏకాదశినాడు విష్ణుమూర్తి పాలకడలిపై యోగనిద్రలోకి వెళ్ళే సందర్భాన్ని తొలిఏకాదశిగా పరిగణిస్తారు. స్వామి నిద్రించే రోజు కాబట్టి దీనిని **'శయన ఏకాదశి'** అని కూడా అంటారు. సతీ సక్కుబాయి ఈ శయన ఏకాదశినాడే మోక్షప్రాప్తి పొందింది.



తొలిఏకాదశినాడు రోజంతా ఉపవాసం ఉండి, రాత్రికి జాగారం చేసి, మర్నాడు ద్వాదశి నాటి ఉదయం విష్ణుమూర్తిని పూజించి తీర్థప్రసాదాలను స్వీకరించి ఆ తర్వాత భోజనం చేస్తే జన్మజన్మల పాపాలు ప్రక్షాళనమవుతాయని శాస్త్రాలు చెబుతున్నాయి.

## విష్ణుమూర్తి నిద్ర ఎందుకు?

విష్ణుమూర్తి యోగనిద్రలోకి వెళతాడని పెద్దలు చెప్పగానే, నిజంగానే దేవుడు నిద్రపోతాడా? అని ఒక సందేహం కలుగుతుంది. విష్ణువు అంటే సర్వవ్యాపి అని అర్థం. మొత్తంగా విష్ణువు అనే పదానికి అంతర్లీనంగా సూర్యుడు అనే అర్థం ఉంది. ఈ రోజు వరకు ఉత్తరదిక్కుగా ప్రయాణించిన సూర్యుడు ఈ రోజునుంచి దక్షిణదిక్కుకు వాలుతాడు. ఈ రోజు మొదలుగా దక్షిణదిక్కుగా ప్రయాణిస్తాడు. ఈ అంశాన్నే సాధారణ పరిభాషలో నిద్రపోవడం అని అభివర్ణించారు.



సాక్షాత్తు భగవంతుడే నిద్రిస్తుంటే ఈ పూజలు ఎవరికి చేయాలి అనుకోవచ్చు. ఈ నెలలో ప్రకృతిలో, పర్యావరణంలో మార్పులు వస్తాయి. తద్వారా మన శరీరానికి జడత్వం వచ్చి, అనేక రోగాలు చుట్టుముడతాయి. ఏకాదశి ఉపవాసం వల్ల జీర్ణకోశం పరిశుద్ధమై, దేహం నూతనోత్తేజాన్ని సంతరించుకుంటుంది. ఇంద్రియనిగ్రహాన్ని కలిగిస్తుంది. ఇంతేకాక కష్టపరిస్థితుల్లోను, భయంకరమైన రోగాలు వచ్చినప్పుడు విపరీతమైన పరిస్థితులను ఎదుర్కోవడం కోసమే ఈ కఠిన ఉపవాసాలు, ఆచారాలు ఏర్పడ్డాయి. ఇందువల్ల కామక్రోధాదులను విసర్జించగలుగుతారు. ఈవిధంగా ఏకాదశినాడు ఉపవాస నియమం లోకంలో స్థిరపడింది.

### 2023, జూలై నెల ఉత్సవాలు, పర్వదినాలు

- **03** గురుపూర్ణిమ
- **05** తిరుపతి శ్రీవిఖనసాచార్యులవారి శాత్తుమొఱ
- **15** శనిత్రయోదశి
- **17** తిరుమల శ్రీవారి ఆణివర ఆస్థానం
- **07-09** తిరుచానూరు, శ్రీ సుందరరాజస్వామివారి అవతారోత్సవం
- **30** తిరుమల, నారాయణగిరిలో ఛత్రస్థాపన, తులసీమాహాత్మ్యం

## పేలపిండి ప్రసాదం

తొలిఏకాదశి విశేషాల్లో మరొకటి పేలపిండి ప్రసాదం. పేలాల్లో బెల్లం, యాలకులు చేర్చి దంచి పిండిగా తయారు చేస్తారు. తొలి ఏకాదశిరోజున పేలపిండిని స్వామికి నివేదన చేసి, భక్తులు ప్రసాదంగా తీసుకుంటారు. దేవాలయాల్లో తొలిఏకాదశి రోజున ప్రత్యేకంగా పేలపిండి ప్రసాదం పెడతారు. ఆరోగ్యపరంగా చూస్తే పేలపిండి ఎంతో మేలు కలుగజేస్తుంది. బాహ్యవాతావరణంలో వచ్చే మార్పులకు అనుగుణంగా తట్టుకునే శక్తిని శరీరానికి కలుగజేస్తుంది. వ్యాధినిరోధక శక్తిని పెంచుతుంది. దీనివల్ల మనిషికి సహజంగా అలవడే బద్ధకం

దూరమవుతుంది. రోగాలు దరిచేరకుండా ఉంటాయి. ఇంద్రియ నిగ్రహం పెరుగుతుంది.

ఆషాఢమాసానికి వామనమూర్తి అధిష్ఠానదేవత. క్షీర సాగరం విశాల విశ్వానికి సంకేతమైతే, శేషుడు అనంతకాల గమనానికి సూచిక. కాలాత్మకుడిగా కాలరూపుడిగా మూర్తీ భవించే విష్ణువు యోగనిద్రద్వారా, అంతర్వీక్షణతో సమస్త జగద్రక్షణ చింతన చేస్తుంటాడు. తన అంతర్భాగంలో ఉన్న విశ్వాన్ని సదా పరిరక్షిస్తుంటాడు.

ఏకాదశిని వామనపురాణం నియామకశక్తిగా అభివర్ణించింది. ఆషాఢశుద్ధఏకాదశి నుంచి దేవతలకు రాత్రి మొదలవుతుంది. అందుకే శ్రీహరి ఈ ఏకాదశి నుంచి కార్తికశుద్ధ ఏకాదశి వరకు యోగనిద్రలో ఉంటాడు. ఈ నాలుగు నెలల కాలంలో చేసే పుణ్యకార్యక్రమాలు, ఆధ్యాత్మిక చింతన, ఆరాధనా ప్రక్రియల సమ్మేళనాన్ని **'చాతుర్మాస్యవ్రతం'**గా పేర్కొంటారు. 'వ్రతం' అంటే కామ్యాల్ని నెరవేర్చేది. అయితే ఏకాదశి వ్రతాన్ని నిష్కామంగా చేయాలి. అలాంటి భక్తులనే సత్వరం స్వామి అనుగ్రహిస్తాడని వరాహపురాణం చెబుతోంది.

## మనసే విష్ణునివాసం

విష్ణువు ఉండే గుహ ఎక్కడో లేదు, దేహమే దేవాలయమని శాస్త్రనిర్ణయం. కైవల్యోపనిషత్తు తెలిపినట్లుగా ప్రతి మానవ హృదయగుహలోను పరమాత్మ ప్రకాశిస్తున్నాడు *(నిహితం గుహాయాం విభ్రాజతే).* అంతదగ్గరలో ఉన్న పరమాత్మను ఉద్దేశించి, ఏకాదశీవ్రతాన్ని నియమంగా ఆచరించాలి. అంటే, ఉపవాసం ద్వారా ఏకాదశ ఇంద్రియాలను నిగ్రహించి, పూజ-జపం-ధ్యానం మొదలైన సాధనల ద్వారా ఆరాధించడమని భావం. పంచజ్ఞానేంద్రియాలు (కళ్ళు, చెవులు, మొదలైనవి), పంచకర్మేంద్రియాలు (కాళ్ళు, చేతులు మొదలైనవి), మనస్సు అనే పదకొండు ఇంద్రియాల ద్వారానే మనం పాపాలు చేస్తాం. ఆ పదకొండే అజ్ఞానానికి స్థానం. అందుకే పదకొండు స్థానాల్లో ఉన్న అజ్ఞానానికి ప్రతినిధి అయిన మురాసురుడిని జ్ఞానప్రదాయిని అయిన ఏకాదశి మాత్రమే సంహరించగలదు. అందుకే ఏకాదశీవ్రతాన్ని నిష్ఠగా ఆచరించినవారు జ్ఞానవంతులవుతారు. తొలిఏకాదశి అందించే సందేశం ఇది.

**13వ పేజీలోని.. 'తేడాలు గుర్తించండి' కి జవాబులు**



## త్యాగం



**'దేవతా ఉద్దేశేన ద్రవ్య త్యాగః'- దైవం నిమిత్తం ఒక వస్తువును త్యాగం చేయడం, అంటే సమర్పించటం పూజ. అది ఒక పుష్పమే కావచ్చు. పదార్థమే కావచ్చు, మనస్సే కావచ్చు, పనియే కావచ్చు, ఎలాంటిదైనా దానిని త్యాగభావంతో సమర్పించాలి. త్యాగరహితమైన పూజ లేదు. కేవలం ఒకదాన్ని ఇచ్చివేయడం త్యాగం అనిపించుకోదు. ఒక పని త్యాగంగా పరిగణింపబడాలంటే అక్కడ రెండు నిబంధనలు పాటించబడాలి- 1)ప్రేమ, మనం ఇచ్చేది ప్రేమకు చిహ్నంగా ఉండాలి ఇచ్చిపుచ్చుకోవడాలుగా ఉండరాదు. 2)దేన్ని ఇస్తున్నాం అన్నదానికంటే ఎలా ఇస్తున్నాం అన్నదే ప్రధానం. పత్రం, పుష్పం, ఫలం, తోయం- వీటిలో వేటినైనా తాను స్వీకరిస్తానని శ్రీకృష్ణభగవానుడు తెలిపే ఉన్నాడు. కానీ, దాన్ని సభక్తికంగా సమర్పించాలని ఆయన వక్కాణించాడు. మన మనస్సు పరిపక్వత చెందక, త్యాగభావం లేకుండా చేసిన పూజ కేవలం ఒక క్రియగా పేర్కొనబడుతుంది.**

## 108 దివ్యదేశాలు

# తిరువిణ్ణగర్

## (ఉప్పిలియప్పన్ కోయిల్)

- ఆచార్య చక్రవర్తి రంగనాథన్

శ్లో॥ భాతి శ్రీతిరువిణ్ణగర్ పురవరే హార్ద్యబ్జినీ శోభితే
శ్రీమద్విష్ణు విమాన సంస్థితి లసన్ శ్రీభూమి దేవీ పతిః।
శ్రీమానుప్పిలియప్పనాహ్వయ యుతః పక్షీంద్ర కావేరికా
ధర్మైర్దృష్ట వపుశ్శఠారి కలిజిత్ సమ్యక్ స్తుతః ప్రాఙ్ముఖః॥

తిరువిణ్ణగర్ దివ్యదేశం (ఉప్పిలియప్పన్ కోయిల్) అరిమేయ విణ్ణగరం, పరమేశ్వర విణ్ణగరం, నందిపురవిణ్ణగరం అనేపేర్లతో పిలవబడే ఈ దివ్యదేశములోకన్నా తిరువిణ్ణగర్ దివ్య దేశంలో అమ్మవారైన భూమాదేవితో పాటు ఒకే గర్భగృహంలో భగవంతుడు వేంచేసి ఉండడం ఈ దివ్యదేశానికి ప్రాధాన్యం. ఈ దివ్యదేశం తిరుక్కుడంద్తె దివ్యదేశంనుండి సుమారు ఏడు కిలోమీటర్ల దూరంలో, 2 ప్రాకారములతో, ఐదు అంతస్తులతో నెలకొన్నటువంటి రాజగోపురంతో మంచి ప్రకృతిసౌందర్యంతో విరాజిల్లుతున్నది. ఆకాశనగరి, తులసీవనం, ఉప్పిలియప్పన్ కోయిల్, మార్కండేయ క్షేత్రం అని పేర్లతో ఈ క్షేత్రం పిలవబడుతున్నది. ఈ క్షేత్రాధిపతి ఉప్పిలియప్పన్, శ్రీనివాసన్, తిరువిణ్ణ కరప్పన్ అని భక్తుల చేత అత్యంత ఆదరణతో పిలువబడుతున్నాడు.

నమ్మాళ్వార్లు ఈ స్వామిని మంగళశాసనం చేసేటువంటి సందర్భంలో పొన్నప్పన్, మణిఅప్పన్, ముత్తప్పన్, ఎన్నప్పన్, తిరివిణ్ణగరప్పన్ అనే నామములతో, ఐదు ఉత్సవ మూర్తులను కీర్తించినారు. ఇచ్చట అమ్మవారికి ప్రత్యేకమైన సన్నిధిలేదు. కారణం మూలమూర్తియైన ఉప్పిలియప్పన్ స్వామి కుడివైపు గర్భగృహంలో భూమాదేవితో పాటు వివాహ అలంకరణలో వేంచేసి ఉండడమే. అలాగే భూమాదేవి తండ్రి మార్కండేయమహర్షి కూడా గర్భగృహంలోనే వేంచేసి ఉన్నాడు. ఈ క్షేత్రం యొక్క పుణ్యపుష్కరిణి 'అహోరాత్రతీర్థం' అని పేరు. అంటే రాత్రిపూట కూడా ఈ పుష్కరిణిలో మనం స్నానం





చేయవచ్చు. తమిళంలో పగలిరాపొయ్‌గై అని చెప్తుంటారు. అలాగే లోపలి ప్రాకారంలో గరుత్మంతుడు, శ్రీరామభద్రుడు, హనుమంతుడు వీళ్ళందరికీకూడా ప్రత్యేకమైన సన్నిధులు కలవు. విశేషంగా ఈ క్షేత్రంలో స్వామి వేదాంతదేశికులవారికి ప్రత్యేకమైన సన్నిధి మూలమూర్తి సమీపంలోనే విరాజిల్లుచున్నది. ఏ ఉత్సవమైనా కూడా వేదాంతదేశికులవారు లేకుండా జరగనే జరగదు. ఏ దివ్యదేశంలో కూడా ఇటువంటి వైభవం లేనేలేదు.

### స్థలపురాణం

భగవంతుని యొక్క పాదపద్మాలని నిరంతరం సేవిస్తున్నటువంటి తులసికి భగవంతుని యొక్క తిరుముఖ మండల సేవ దర్శనం కావడం లేదు. అంచేత చాలా దుఃఖంతో ఉన్న తులసి, తన యొక్క దుఃఖాన్ని స్వామివారికి తెలియజేయగా, దేవదేవుడు 'భూలోకంలో ఒక మహర్షియొక్క పుత్రికగా నీవు అవతరిస్తావు' అని సెలవివ్వగా, తులసికూడా ఈ క్షేత్రంలో అయోనిజగా అవతరించినది. మంచిసువాసనతో ఉన్న తులసీ వనంలో, చక్కటి కోకిలరవాన్ని విన్నటువంటి మార్కండేయ మహర్షి ఈ శిశువును తీసుకొని పెంచడం ప్రారంభించాడు. భూమిలో నుండి పుట్టినది కనుక **'భూమాదేవి'** అని నామకరణం చేశారు. ఇలా దినదిన ప్రవర్ధమానమై, యుక్తవయసు వచ్చినటువంటి సందర్భంలో, ఒక ముసలివాడు మార్కండేయ మహర్షి యొక్క ఆశ్రమానికి వచ్చి ఈ అమ్మాయిని చూసి మోహించి, ఆ మహర్షితో 'నేను ఈ అమ్మాయిని వివాహం చేసుకోవాలని అనుకుంటున్నాను' అని చెప్పగా, మహర్షి 'ఓ ముదుసలీ! ఇదేమైనా బాగున్నదా? మీరా వృద్ధులు. అమ్మాయేమో యుక్తవయసులో యవ్వనంలో ఉన్నది. అది కాకుండా మా అమ్మాయికి ఉప్పు వేసి వంట చేసే విధానం తెలియనే తెలియదు. నేను మహర్షి కనుక నా కొరకు ఇలానే వంట చేయడం అలవాటు చేసుకున్నది. అంచేత ఇది అసంభవం' అని చెప్పగా, స్వామి 'పరవాలేదు నేను వృద్ధుణ్ణి.



కనుక నాకు ఎటువంటి రుచి అనేది అవసరం లేదు' అని చెప్పగా, ఏమీ చేయలేనటువంటి స్థితిలో మహర్షి ఉండగా, ఇక తన భక్తుణ్ణి పరీక్షించకూడదు, దుఃఖ పెట్టకూడదు అని అనుకొని, శంఖచక్రగదాధరుడై స్వామి వాళ్ళ ముందు సాక్షాత్కరించాడు. ఆశ్చర్యం వాళ్ళకి. ఆహా! సాక్షాత్తు పరంధాముడు దర్శనభాగ్యాన్ని కలిగించాడు కదా! అని మార్కండేయమహర్షి స్వామివారి కోరిక మేరకు తన పుత్రిక అయినటువంటి భూమాదేవిని కన్యాదానం చేసి వివాహం జరిపించి, ఒక కోరికను కూడా కోరాడు– 'స్వామి! మీరు ఈ క్షేత్రంలోనే ఈ కల్యాణ భంగిమలోనే ఎల్లప్పుడూ అర్చామూర్తిగా వేంచేసి ఉండి, తమ నైవేద్యంలో యథాప్రకారం ఉప్పు లేకుండా అన్ని ప్రసాదాలు కూడా నివేదింపబడాలి' అని ప్రార్థించాడు. భగవానుడు కూడా మహర్షి కోరికను మన్నించి ఆనాటినుండి ఈనాటి వరకు తన యొక్క నైవేద్యంలో ఉప్పులేకుండానే సమస్త ప్రసాదాలను కూడా స్వీకరిస్తూ ఉన్నాడు. ఎంతటి సౌలభ్యం? భగవంతుడిది. తమిళ నెల ఐప్పసిమాసం, శ్రవణానక్షత్రంలో వీరు ఇరువురికి వివాహం జరిగినది. ఆ వివాహ భంగిమలోనే స్వామి అమ్మవారు ఈనాటికి కూడా అందరినీ అనుగ్రహిస్తూ ఉన్నారు. ఎన్నో మహిమలతో ఈ స్వామి విరాజిల్లుతూ ఉన్నాడు. సాక్షాత్తు శ్రీవేంకటేశ్వర స్వామి ప్రతిరూపంగా కూడా కొలువబడుతున్నాడు. స్వామికి సోదరుడిగా అందరి చేత పిలువబడుతున్నాడు. ఎవరు ఏది కోరినా కూడా తీర్చే దైవంగా స్వామి వేంచేసియున్నాడు.

భగవంతుడు ఉప్పిలి అప్పన్ అంటే ఉప్పులేనటువంటి అప్పన్– 'ఉప్పును ఆరగించనటువంటి స్వామి' అని అర్థం. శ్రీనివాసుడు తూర్పుముఖం నిలుచున్న భంగిమలో వేంచేసి ఉంటాడు. అమ్మవారు ధరణీదేవి వసుంధర. విమానం– శుద్ధ ఆనంద విమానం. ప్రత్యక్షం– కావేరి–మార్కండేయమహర్షి. గరుత్మంతుడు ధర్మదేవత. మంగళశాసనం చేసిన అళ్వార్లు– నమ్మాళ్వార్లు, పొయగైఆళ్వార్లు, పేయాళ్వార్లు, తిరుమంగైయాళ్వార్లు. వైఖానస ఆగమోక్తంగా భగవంతుడు ఆరాధింపబడుతున్నాడు. 'అహోరాత్ర' పుష్కరిణి. పలువురికి కులదేవతగా ఈ ఉప్పిలి అప్పన్ స్వామి విరాజిల్లుచున్నాడు

ఇటువంటి ఈ క్షేత్రానికి వెళ్లి– భూమాదేవితో కల్యాణ స్వరూపంతో వేంచేసి ఉన్నటువంటి ఈ శ్రీనివాసుని ఎవరైతే దర్శించుకుంటారో, వాళ్లకు సమస్తసౌభాగ్యములు కలుగును. విశేషంగా వివాహం కానటువంటి కన్యలు, సంతానం లేనటువంటి గృహిణులు తమ అభీష్టసిద్ధి పొందగలరు. భక్తులందరూ ఈ స్వామిని సేవించుకొని సకలసౌభాగ్యాలను పొంది దేవదేవుని దివ్యకృపకు పాత్రులుకాగలరు.





తిరుమల నారాయణగిరి ఉద్యానవనంలో
29-04-2023 నుండి 01-05-2023 వరకు
ఉభయదేవేరులతో శ్రీమలయప్పస్వామివారికి జరిగిన
శ్రీపద్మావతీ శ్రీనివాసుల పరిణయోత్సవ దృశ్యమాలిక













# అంతఃశుద్ధికి 'అష్టాంగయోగము'-పతంజలి మహర్షి

- వ్యాఖ్యానం- శ్రీమతి డా॥ ఇ.పి.నాగలక్ష్మి

'యమనియమాసన ప్రాణాయామ ప్రత్యాహార-ధారణ- ధ్యాన సమాధయోఽష్టావంగాని'

యోగానుష్ఠానమునకు యెనిమిది అంగములు. 'అంగము' అంటే విధానస్థితి-





**01) యమము-** అహింసా సత్యాస్తేయ బ్రహ్మ చర్యా పరిగ్రహా యమాః

(యోగసూత్రం-2-30)

అహింస, సత్యము, దొంగతనము చేయకుండుట, బ్రహ్మచర్యము, అపరిగ్రహము దానము స్వీకరించకుండటం. ఈ అయిదు 'యమము'లు విధిగా పాటించినవాడే యోగాభ్యాసానికి అర్హుడు.



**02) నియమము-** శౌచసంతోషతపః స్వాధ్యాయేశ్వర ప్రణిధానాని నియమాః

(యోగసూత్రం- 2-32)

శౌచము-బాహ్య, అంతరశుద్ధి; సంతోషము- విచారమును వీడి సంతృప్తిగా ఉండడం; తపస్సు- మానావ మానములందు, శీతోష్ణ, సుఖదుఃఖములందు సమ భావము కల్గి ఉండడం. స్వాధ్యాయము- సద్గ్రంథములయందు పఠన పాఠనము, శ్రవణము, మననము కల్గియుండాలి. ఈశ్వరప్రణిధానము- ప్రతిపనిని ఫలాపేక్ష లేక భగవంతునికి అర్పణ గావించాలి.



**03) ఆసనం-** స్థిరసుఖమాసనమ్ (యోగసూత్రం-2-46)

స్థిరంగా సుఖంగా ఉండేదే 'ఆసనం'. స్థిరాసనం ఏర్పడనిదే, ప్రాణాయామ సాధనలను అభ్యసించలేము. స్థిరాసనమంటే సాధకునకు శరీరభావం బొత్తిగా కలగ కుండుట. ఆసనం సిద్ధించిన తర్వాత (శీతోష్ణాది) ద్వంద్వాలు బాధించవు. అప్పుడు శీతోష్ణాలు, సుఖదుఃఖాలు, మానావమానాలు మొదలైన ద్వంద్వాలేవీ బాధించవు.





**04) ప్రాణాయామం-** తస్మిన్ సతి శ్వాసప్రశ్వాసయోర్గతివిచ్ఛేదః ప్రాణాయామః

(యోగసూత్రం-2-50)

ఉచ్ఛ్వాస (గాలిని తీసికొనుట) నిశ్వాసాల (వెలుపలకు గాలిని వదలుట) గతి నిరోధం (గాలిని కుంభించుట)తో ప్రాణాయామం సిద్ధిస్తుంది. ప్రాణయాయక్రియ వల్ల ఉచ్ఛ్వాస, నిశ్వాసల వేగం పూర్తిగా తగ్గి, మనస్సు యొక్క చాంచల్యం శ్వాసగతిని అనుసరిస్తుంది. ఈ సూక్ష్మతత్త్వాన్ని తెలుసుకొని ప్రాణాయమం అభ్యసించాలి.



1)యమము, 2)నియమము, 3)ఆసనము, 4)ప్రాణాయామము, 5)ప్రత్యాహారము, 6)ధారణ, 7)ధ్యానము, 8)సమాధి.

ఈ అష్టాంగములను యోగసాధనగా స్వీకరించదలచిన వారు ముందుగా కొన్ని నియమములు పాటించాలి.



**05) ప్రత్యాహారం-** స్వవిషయాసంప్రయోగే చిత్తస్వరూపానుకార ఇవేంద్రియాణాం ప్రత్యాహారః. (యోగసూత్రం-2-54)

ఇంద్రియాలు తమవిషయాలనువిసర్జించి, చిత్త స్వరూపాన్ని పొందటమే ప్రత్యాహారం. దానివల్ల ఉత్కృష్ట ఇంద్రియ వశీకరణం కలుగుతుంది. యోగి తన ఇంద్రియాలను బాహ్యవిషయరూపాలను పొందకుండా నిరోధించి, మనస్సుతో ఐక్యం చేయగలిగితే, సంపూర్ణ ఇంద్రియ నిగ్రహం పొందుతాడు.





**06) ధారణ-** దేశబంధశ్చిత్తస్య ధారణా (యోగసూత్రం-3-1)

ఏదో ఒకచోట చిత్తాన్ని నిలపటమే ధారణ. శరీరంలో గానీ, బాహ్యంలో గానీ ఒకానొక ఆలంబనాన్ని 'ఆశ్రయించి మనస్సు నిలకడ చెందియుండుట ధారణ'. ధారణ ప్రాణాయామ సిద్ధివల్ల కల్గుతుంది.



**07) ధ్యానమ్-** తత్ర ప్రత్యయైకతానతా ధ్యానమ్ (యోగసూత్రం-3-2)

ఏకభావ ప్రవాహరూప జ్ఞానమే ధ్యానం. శిరస్సు పైభాగంలో గానీ, హృదయం మొదలైన వాటిలోగానీ ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని, శరీరంలోని మరేతర భాగం నుండిగాక, లక్ష్యభాగం నుండే స్పర్శానుభవాన్ని పొందగలిగితే, ఆ స్థితి ధారణ అంటారు. అలా కొంతకాలం వరకూ చిత్తం నిలవగలిగితే, అది ధ్యానమవుతుంది.





**08) సమాధి-** తదేవార్థమాత్రనిర్భాసం స్వరూపశూన్యమివ సమాధిః (యోగసూత్రం-3-3)

రూపాలను వదలి అర్థాన్ని మాత్రమే భాసింపచేస్తుంటే, దాన్ని సమాధి అంటారు. ధ్యానంలో ధ్యేయరూప బాహ్య భాగాన్ని విసర్జించినప్పుడు సమాధి ఏర్పడుతుంది. ఇట్టిస్థితిలో చిత్తమునకు స్వరూపమంటూ ఉండదు. ఇట్టి స్థితినే సమాధి అంటారు.

కావున, యోగసూత్రాలను అనుసరించడం కుదరనప్పుడు 'అష్టాంగయోగా'న్ని ఒక్కసారి అనుష్ఠిస్తే మనిషి జీవితం ధన్యమవుతుంది.



04-05-2023 నుండి 06-05-2023 వరకు తిరుచానూరు, శ్రీపద్మావతీ అమ్మవారికి జరిగిన వసంతోత్సవము.
ఈ సందర్భంగా శ్రీపద్మావతీఅమ్మవారికి స్నపనతిరుమంజనం జరిగిన చిత్రం. ఆ పై అమ్మవారు స్వర్ణరథంపై విహరించిన దృశ్యం.





04-05-2023న పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేటలో క్రొత్తగా నిర్మించిన
శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయ గోపుర మహాసంప్రోక్షణలో పాల్గొన్న విశాఖశారదాపీఠంస్వామి శ్రీశ్రీశ్రీస్వరూపానందేంద్ర సరస్వతిస్వామివారు,
తి.తి.దే. సంయుక్త కార్యనిర్వహణాధికారి శ్రీ వి.వీరబ్రహ్మం, ఐ.ఏ.ఎస్., గారు మరియు అర్చకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీవారి కల్యాణోత్సవం జరిగిన దృశ్యం.



04-05-2023న నరసింహజయంతి సందర్భంగా
తిరుమల శ్రీవారి వసంతమండపంలో జరిగిన
శ్రీనరసింహస్వామివారి పూజా కార్యక్రమ చిత్రం.



05-05-2023న తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చిన విశాఖశారదాపీఠంస్వామి
శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్రసరస్వతిస్వామివారకి, శ్రీశ్రీశ్రీ స్వాత్మానందేంద్రస్వామివారికి స్వాగతం
పలుకుతున్న తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఈ.ఎస్.,
మరియు డా॥ ఆకెళ్ళ విభీషణశర్మ, డైరెక్టర్, అన్నమాచార్య ప్రాజెక్ట్.



తిరుమలలో 29-04-2023న స్వామిదర్శనానంతరం ఆంధ్రప్రదేశ్ గవర్నర్
గౌ॥ శ్రీ ఎస్.అబ్దుల్ నజీర్‌కు శ్రీవారి చిత్రపటాన్ని సమర్పిస్తున్న
తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఈ.ఎస్., గారు
చిత్రంలో శ్రీ అనిల్‌కుమార్ సింఘాల్, ఐ.ఏ.ఎస్., గారు, గవర్నర్ ప్రత్యేక కార్యదర్శి.



15-04-2023న తి.తి.దే. పాలకమండలి ఎక్స్- అఫిషియో సభ్యులుగా
దేవదాయశాఖ కమీషనర్ శ్రీసత్యనారాయణ గారు ప్రమాణస్వీకారం చేశారు.
వీరికి తి.తి.దే. సంయుక్త కార్యనిర్వహణాధికారి శ్రీ వి.వీరబ్రహ్మం, ఐ.ఏ.ఎస్., గారు
శ్రీవారి ప్రసాదం అందిస్తున్న దృశ్యం.

# భారతీయ గణితము



- ఆచార్య వి.రమేష్ బాబు,
94912 71729

గణితములేని శాస్త్రపరంపరనుగాని, లోకవ్యవహారమునుగాని ఊహింపశక్యమేగాదు. ఎందువలన అనగా గణితముతో సంబంధములేని విజ్ఞానము, శాస్త్రములు ఉండవు. ఈ సృష్టియొక్క ఉత్పత్తి పరమాణువునుండి జరిగితే, పరమాణు విభజననుండి గణితచమత్కారమే, లేక శూన్యము నుండి ఏర్పడినది అనుకుంటే అందులోనూ గణితప్రక్రియే కనపడుతుంది. కనుక 'సృష్టి ఆరంభంనుండి గణితము ఉన్నది' అనడములో సందేహము లేదు. ప్రస్తుతకాలంలో గణితశాస్త్రము విభిన్నకోణాలలో ఎంతగానో అభివృద్ధి చెందింది. ఇంత వేగంగా అభివృద్ధి చెందిన గణితశాస్త్రమునకు భారతీయుల కృషి మహత్తరమైనది మరియు వెల కట్టలేనిది. గ్రీకు, చైనా, బాబిలోనియా ఇత్యాది దేశాలలో కూడా ప్రాచీన కాలము నుండే గణితశాస్త్రము విస్తరించి ఉన్నప్పటికీ, ఆ కాలమునకు మునుపే అత్యంత ప్రముఖమైన గణితపద్ధతులు మన భారతీయ గ్రంథాల్లో ప్రస్తావింపబడ్డాయి. కావున భారతీయ గణితమునకు, గణితశాస్త్రమందు గొప్పస్థానం ఉందనే చెప్పాలి.

వైదికవాఙ్మయంలో అత్యంత ప్రాచీనగ్రంథములైన వేదాల్లో సంఖ్యలు, సంఖ్యాపద్ధతులు మరియు గణనాది గణిత ప్రక్రియలు సూక్ష్మముగా నిబిడీకృతమై ఉన్నాయి. వేదాలకు అనుబంధమైన 'సుల్బసూత్రాల'లో యజ్ఞయాగాదుల నిర్వహణకు, హోమగుండనిర్మాణనికి ఉపయుక్తమైన గణితము, ఇతర గణితప్రక్రియలు చెప్పబడింది. రామాయణాది ఇతిహాసములలో కుడా సంఖ్యాపద్ధతికి సంబంధించి విశ్లేషణలు ఉన్నాయి. ఆధునిక గణితశాస్త్రంలో ఉపయోగిస్తున్న అనేక గణితపద్ధతులు భారతీయగ్రంథాలు అయినప్పటికీ అవి వెలుగులోనికి రాక పోవడానికి ముఖ్యంగా రెండు కారణాలని చెప్పవచ్చు.

**01)** మన భారతీయగణితగ్రంథాల అధ్యయనం క్రమంగా తగ్గి, విస్తృత ప్రచారం జరగకపోవడమూ,

**02)** మన ప్రాచీన గణితజ్ఞులు కనుగొన్న పద్ధతులకు వారి పేరును చెప్పుకోకపోవడం.

వాస్తవానికి ఇది మన భారతీయుల ఔన్నత్యానికి నిదర్శనమైనప్పటికీ, అదే మన భారతీయగణితజ్ఞుల గణిత పద్ధతులను గుర్తించడంలో కష్టసాధ్యంగా మారింది. ఉదాహరణకు ఈ రోజున మనం చదువుకున్న 'పైథాగరస్' సిద్ధాంతము, దీనిని 'పైథాగోరస్' అనే పాశ్చాత్య గణితజ్ఞుడి పేరున చెప్పబడుతున్నది, కాని పైథాగరస్‌కు మునుపే మన బోధాయన సుల్బసూత్రములో పూర్తిగా వివరింపబడినది, కాని ఇది ఈనాటికీ పూర్తిగా వ్యాపకతలో లేదు. అదే విధముగా 'పాస్కల్ త్రిభుజ' పేరిట చెప్పబడుచున్న సిద్ధాంతము చాలా కాలపూర్వమే భారతీయగణితములో వివరించినప్పటికి, ఈ నాటికీ భారతీయులకే తెలియకపోవడము ఆశ్చర్యజనకము.

వేదములలో గణితము అతీవసూక్ష్మముగా ప్రస్తావింపబడినది. గణితసూత్రములే మంత్రరూపముగా ప్రతిపాదింపబడినది. అదియే క్రమేపి ఋషుల తపోశక్తిచే వేదాంగ మగు **'జ్యోతిశ్శాస్త్ర'** రూపముగా పరిణితి చెందింది. వేదాల్లో సారము తెలుసుకొనుటకు ఒక భాష్యము చాలదు. కావున అనేక భాష్యకారులు వారి బుద్ధికుశలతతో అనేకభాష్యములు రచించారు. అయినా వాటినుండి పొందిన జ్ఞానము తక్కువనే చెప్పుకోవాలి.



ఈ కాలమున 'వైదికగణిత'మనగా పూరిగోవర్ధన పీఠాధీశులైన శ్రీశ్రీశ్రీ భారతీకృష్ణతీర్థస్వాముల రచితమగు **'వైదికగణితము'** అనే పుస్తకము మరియు మరికొన్ని గ్రంథములే పూర్తి వైదికగణితముగా పరిగణింపబడుతోంది. ఈ గ్రంథంలో కొన్ని వేదమంత్రాల్లోని సూక్ష్మగణితాన్ని కనుగొని **"ఏకాధికేన పూర్వేణ"** ఇత్యాది సూత్రములచే *గుణన-విభాజనాది* గణిత ప్రక్రియలు విశేషముగా ప్రస్తావింపబడినది, ఇవే అతీవ ఆశ్చర్యజనకములు. కానీ ఇది ఇంతటితో పరిసమాప్తి చెందేది కాదు. వేదములు జ్ఞానభాంఢాగారములు. కాబట్టి మన భారతీయులచే రచింపబడిన ప్రాచీన వైదిక గణితగ్రంథముల అధ్యయనముచేత మరిన్ని విశేషములు బోధపడగలవు.

గణితశాస్త్రములో ప్రాచీనకాలమునుండే భారతీయులకు అతిగంభీరమైన జ్ఞానము కల్గి ఉన్నప్పటికీ, ఈ జ్ఞానము గణితశాస్త్రరూపంగా కంటే జ్యోతిషశాస్త్రరూపంగానే పరిణితి చెందింది. అందువల్లే జ్యోతిషశాస్త్రంలో 'త్రిస్కంథముల'లో ప్రసిద్ధమైన సిద్ధాంతభాగానికి గణితభాగమని పేరు. కావున అనేక భారతీయగణితపద్ధతులు ఈనాటికీ గ్రహసాధనాదులలో జ్యోతిషశాస్త్ర అంతర్గతముగానే ప్రయోగములో ఉన్నాయి. భారతీయ గణితగ్రంథములనగా, అందరికి భాస్కరాచార్య విరచితమైన *లీలావతి* మరియు *బీజగణితము*లే స్ఫురణకి వస్తాయి. కానీ, ఇతర బీజగణిత సంబద్ధ గ్రంథములు ఉన్నప్పటికీ, వాటి పేర్లను కూడా స్మరింపలేని స్థితి కనిపిస్తోంది. కేవలము సుల్బసూత్రములలోనే అనేకములు ఉన్నవి. అవి- 1)ఆపస్తంబ సుల్బసూత్రము 2)బోధాయన సుల్బసూత్రము 3)మనవ సుల్బసూత్రము 4)కాత్యాయన సుల్బసూత్రము 5)మైత్రాయనీయ సుల్బసూత్రము 6)వరాహ సుల్బసూత్రము 7)వాధుల సుల్బసూత్రము 8)హిరణ్యకేశీయ సుల్బసూత్రము.

ఇందు కొన్ని సుల్బసూత్రములు నేటికీ తాళపత్ర రూపములోనే మిగిలనవి. కేవలం సుల్బసూత్రములే గాక అనేక గణితగ్రంథాలు ఉన్నప్పటికీ ఇవేమీ అధ్యయన భాగములలో లేకపోవడం, అధ్యయనము చేయకపోవడం వలన భారతీయ గణితజ్ఞులు, వారి ప్రతిభ మరుగునపడడమే గాక వారి అనేక నూతనపద్ధతులు, గణిత ప్రక్రియలు నష్టమగుట బాధాకరము.

భారతీయ గణితపద్ధతులలో 'కుట్టకగణితము', 'చక్రవాలగణితము' విశేషప్రాధాన్యతను సంతరించుకొని, ప్రస్తుత కాలంలో భారతీయగణితదిశగా గణితజ్ఞులను ఆకర్షించుచున్నవి. కావున ఇతర ప్రాచీనభారతీయ గణితగ్రంథములు అధ్యయనము చేసి వాటి విశిష్టతను ప్రచారం చేసినచో, మరల భారతీయ గణితమునకు పూర్వవైభవము వస్తుంది. ఆ విధంగా పయనిద్దాం.



**విద్య, ధర్మం, విజ్ఞానం కేవలం గ్రంథాదుల ద్వారా కాకుండా అచరణ ద్వారానే భావి తరాలకి అందుతాయి. 'మా అమ్మ ఇలా చేసేది - మా నాన్న ఇలా ప్రవర్తించేవాడు' అని ప్రేమతో కూడిన అనుబంధంతో చేస్తూ వచ్చిన సంప్రదాయంతోనే అనేక ఆచారవ్యవహారాలు బతుకుతున్నాయి.**

వేదమహిమలు

# వేదసౌధం

– డా॥ ఈ.ఏ. శింగరాచార్యులు

"వేదం, పలు అంతస్తులను కలిగిన సౌధంవంటిది" అనే ఉపమానాన్ని దృష్టిలో పెట్టుకొని కొన్ని వేదమహిమలను గమనిద్దాం.

ముందుగా, వేదాంతదేశికుల దయాశతకంలోని ఒక శ్లోకాన్ని చూద్దాం. *"నిరాకృతవతీ దయే! నిగమసౌధదీపశ్రియా విపశ్చిదవిగీతయా జగతి గీతయాంధం తమః"* అనేది ఆ శ్లోకం. ఈ శ్లోకంలో? "వేదం అనేది పలు అంతస్తులను కలిగిన ఒక సౌధం. అందులో వెలిగింపబడి, ప్రకాశించే దీపంవలె భగవద్గీత ఉన్నది. దయాదేవి భగవంతుని శ్రీకృష్ణునిగా అవతరింపచేసి, ఆ స్వామిచే గీత అనే దీపాన్ని వెలిగింపజేసి, లోకంలో ఉండే చీకటిని అంతటినీ పోయేటట్లు చేసింది? అని చెప్పబడింది. ఈ శ్లోకంలో వేదం ఒక ఉన్నతమైన సౌధంగా ఉపమింపబడిందికదా!

ఈ విధంగా వేదానికి, సౌధానికి మధ్య ఎటువంటి పోలికలు ఉన్నాయి? అని స్తోత్ర వ్యాఖ్యాతలు గమనించి చూశారు. వారు తమ వ్యాఖ్యానాలలో వేదానికి, సౌధానికి మధ్య ఉండే ఎన్నో పోలికలను తెలియజేశారు. వాటిలో, మొదటి పోలిక ఏమంటే– *సౌధం, హర్మ్యం, ప్రాసాదం* అని అంటూ పలు పేర్లతో పిలువబడే, పలు అంతస్తుల కలిగిన కట్టడంలో, మొదటి అంతస్తు, రెండవ అంతస్తు, మూడవ అంతస్తు అని ఈ విధంగా చాలా అంతస్తులు ఉన్నట్లే, వేదంలో కూడా *సంహితాభాగం, ఆరణ్యకభాగం, బ్రాహ్మణభాగం, ఉపనిషద్భాగం* అని పలు విభాగాలు ఉన్నాయి. సంహితాభాగంలో కూడా *సంహితాపాఠం, క్రమపాఠం, పదపాఠం, జటాపాఠం, ఘనపాఠం* అని పలు విభాగాలు పలు అంతస్తులుగా ఉన్నాయి. రెండవపోలిక ఏమంటే, ప్రాసాదం చాలా అంతస్తులను కలిగినది కనుక, చాలా ఎత్తైనదిగా ఉంటుంది. వేదం కూడా భగవంతుని సంబంధాన్ని కలిగి ఉన్నందున, చాలా ఉన్నతమైనది. మూడవ సామ్యం ఏమంటే? ఈ రెండింటిని కూడా క్రమక్రమంగా మెట్టు మెట్టుగా అధిరోహించాలి అనేది. సౌధాన్ని అధిరోహించడానికి మెట్లు చాలా ఉంటాయి. సౌధంలో ఉండే పై అంతస్తులలోకి వెళ్లాలంటే, ఒక్కొక్క మెట్టును ఎక్కి పైకి వెళ్ళాలి. ఆ విధంగానే వేదంలో కూడా మనం పైపైకి వెళ్లాలంటే, క్రమక్రమంగానే కార్యం సాధ్యం అవుతుంది. కొంచెం కొంచెంగా, క్రమక్రమంగా వేదాన్ని అధ్యయనం చేస్తూ, అందులో ఉన్నత పదవిని పొందాలి. వేదవిషయంలో నిరంతరాభ్యాసం మూలంగా, విద్య మూలంగా అటువంటి ఉన్నతమైన దశను పొందడం అనేది వేదంలో ఉండే ఒక విశేషం. బోధాయనమహర్షి ఈ విధంగా అంటున్నాడు. వేదానాం కించిదధీత్య *బ్రాహ్మణః, ఏకాం శాఖామ్ అధీత్య శ్రోత్రియః, అంగాధ్యాయ్యనూచానః, కల్పాధ్యాయీ ఋషిః, కల్పసూత్ర ప్రవచనాధ్యాయీ భ్రూణః"* వేదవిద్యలో ఆరంభంలో ఉండేవానికి 'బ్రాహ్మణుడ'ని పేరు. ఒక శాఖను మాత్రం పూర్తిగా అధ్యయనం చేసినవానికి 'శ్రోత్రియుడ'ని పేరు. దానికి మించి, వేదాంగాలైన వ్యాకరణం మొదలైనవానిని అధ్యయనం చేసిన వానికి 'అనూచానుడు' అని పేరు. అంతకుమించి, శ్రౌతకర్మలలో ఆవశ్యకమైన విద్యను పొందినవాడు 'ఋషి'. అంతకుమించి, ఆ వేదం విధించిన యజ్ఞాలలో చేయవలసిన విధానాలను వివరించే కల్పసూత్రాలను అధ్యయనం చేసి, ఇతరులకు నేర్పించ గలిగినవాడు 'భ్రూణుడు' అనబడతాడు. ఈ విధంగా సౌధంలో పలు మెట్లు ఉన్నట్లే, వేదవిద్యలో కూడా పలు దశలు ఉన్నాయి.

మరొక సామ్యం ఏమంటే, సౌధంలో లోపలిభాగాలలో అందంకోసం, ప్రకాశంకోసం దీపాలను వెలిగిస్తారు. సౌధాల లోపల దీపాలు ఆవశ్యకం అయినట్లే, వేదం అనే సౌధానికి కూడా ఒక దీపం ఆవశ్యకమై ఉన్నది. వేదమనే సౌధాన్ని ప్రకాశింప చేసే ఆ దీపం ఏమంటే? భగవద్గీతయే. దానిని శ్రీకృష్ణుడు వెలిగించాడు. భగవద్గీత అనే ఈ దీపం ద్వారా వేదసౌధంలో ఉండే అర్థాలన్నీ ప్రకాశిస్తాయి. అందులో మనకు ఏర్పడే అజ్ఞానం అనే చీకటి అంతా తీరిపోతుంది.

ఇంతకుముందు ప్రస్తావించిన దయాశతకంలో ఉండే "దీపశ్రియా" అనే ప్రయోగం ద్వారా ఇక్కడ ఇంకొక సామ్యం కూడా వ్యక్తం అవుతున్నది. దీపాలవల్ల సౌధానికి అంతకు

ముందు లేని ఒక విలక్షణమైన అందం కలిగేటట్లే, భగవద్గీత అనే దీపం వల్ల వేదానికి ఒక అపూర్వమైన అందం ఏర్పడు తున్నది అనేదే సామ్యం.

ఈ విధమైన సామ్యాల ద్వారా మనకు తెలియవచ్చే వేదమహిమలు ఏమంటే–

వేదం పలు అంతస్తులను కలిగినది; వేదం చాలా ఉన్నతమైనది; వేదం ఒక దీపాన్ని అపేక్షిస్తున్నది; వేదం క్రమక్రమంగా అధిరోహించడానికి వీలైనది.

మరొక పోలికకోసం వేదాంతదేశికులు అనుగ్రహించిన ఇంకొక సూక్తిని గమనిద్దాం. ఇది న్యాయపరిశుద్ధి అనే గ్రంథంలో ఉన్నది. **"యస్యాజ్ఞా నిగమైక హర్మ్యవలభీవాస్తవ్య పారావతీ"** అనేది ఆ సూక్తి. బాగా ఎత్తుగా ఉండే హర్మ్యాలలో, పై అంతస్తులలో పావురాలు నివాసం ఉండడం కోసం కొన్ని గదులవంటి నిర్మాణాలను చేస్తారు. ఆ గదులలో పావురాలు నివాసం ఉంటూ, మధురంగా ధ్వనులను చేస్తాయి. ఆ విధంగానే, వేదంలోని అగ్రభాగాలైన ఉపనిషత్తుల లోని ఏ ఏ భాగాలలో ఏ ఏ పక్షుల ధ్వనులను వినిపిస్తాయి? అని అంటే, భగవంతుని ఆజ్ఞలు అనే పావురాల శబ్దాలు మనకు ఉపనిషత్తులలో వినిపిస్తాయి అని తెలుపుతున్నది ఈ శ్లోకం. అంటే, వేదాన్ని పలు అంతస్తులను కలిగిన సౌధంతో పోల్చినప్పుడు, వేదం అనే సౌధం పై అంతస్తులలో నివసించే పావురాలు చేసే ధ్వనులుగా భగవంతుని ఆజ్ఞలు వినిపిస్తున్నాయి. అవి ఏవి అంటే, "సత్యం వద, ధర్మం చర", "మాతృదేవో భవ", పితృదేవో భవ'' ఆజ్ఞలే ఆ పావురాల ధ్వనులు.

ఇక్కడ ఉండే వేరొక సామ్యాన్ని కూడా మనం గమనిద్దాం.

**"ప్రజ్ఞాప్రాసాద మారుహ్య"** అని ఆరంభం అవుతున్న ఒక శ్లోకం మహాభారతంలో ఉన్నది. "ఒక పర్వతంపై ఉండే వాడు, లేక, ఉన్నతంగా ఉండే ఒక కట్టడంపై ఉండేవాడు భూమిపై ఉండే వస్తువులను అన్నిటిని చూడగలిగేటట్లుగా" అనే దృష్టాంతం ఇక్కడ ప్రస్తావింపబడింది. ఉన్నతంగా ఉండే ఒక పర్వతం పైకి గాని, లేక, ఉన్నతంగా ఉండే ఒక మేడ పైకిగాని ఎక్కినవాడు కింద భూమిపై ఉండే వస్తువులను అన్నిటిని చూడ గలుగుతాడు. ఆ విధంగానే, ఉన్నతమైన వేదాన్ని అధ్యయనం చేసినవాడు సామాన్యులకు కనిపించని విషయాలను కూడా దర్శించగలుగుతాడు. ఎందుకంటే, అతడు ఉన్నతంగా ఉండే వేదం ద్వారా దర్శిస్తున్నాడు కదా. అందుచేత, ఇక్కడ వేదానికి, సౌధానికి మధ్య ఉండే ఇంకొక సామ్యం కూడా తెలుపబడినట్లు అయినది.

ఈ విధంగా మనం **సౌధానికి, వేదానికి** మధ్య ఉండే పోలికలను గమనిస్తే, **'వేదోఽఖిల ధర్మ మూలమ్'** అన్ని ధర్మాలకు మూలం వేదమే.



# సనాతన ధర్మంలో స్త్రీ

- డా॥ కప్పగంతు రామకృష్ణ

ప్రపంచంలోని మరే ఇతర దేశం స్త్రీకి ఇవ్వని సమున్నత స్థానాన్ని మన దేశమే ఇచ్చింది. వేదాలకు అధిష్ఠానదేవతగా గాయత్రి మాతను ఎంచుకున్న ఘనత కూడా మనకే దక్కుతుంది. అదొక్కటే కాదు సనాతన ధర్మంలో ప్రతి అణువులో మహిళాశక్తి ప్రకటితమవుతుంది.

## వేదాల్లో స్త్రీ ప్రశంస

సనాతన సంస్కృతికి పట్టుగొమ్మలుగా నిలుస్తున్న వేదాలు స్త్రీకి ఎంతో ప్రాధాన్యమిచ్చాయి. ఋగ్వేదం, యజుర్వేదం, అథర్వణ వేదాల్లోని అనేకమంత్రాలు స్త్రీ ఔన్నత్యాన్ని విశేషంగా ప్రశంసించడంతో పాటు మహిళల్ని ఎంతో గౌరవంగా చూడాలనే బాధ్యతను పురుషులకు నిర్దేశించాయి. ఇందుకు ఆయా వేదాల్లో అనేక ఉదాహరణలు ఉన్నాయి-




- పిత్రార్జితంలో కుమారుడితో పాటు కుమార్తెకు కూడా సమాన హక్కు ఉంది- ఋగ్వేదం (3:31:1)
- పురుషులతో సమానంగా మేము మీకు మంత్రాలు ప్రసాదిస్తున్నాము. మంత్రాలను అర్థం చేసుకునే శక్తిని మీకు ప్రసాదిస్తున్నాము- ఋగ్వేదం (10:19:13)
- స్త్రీలు ధైర్యవంతులుగా ఉండాలి- యజుర్వేదం (10:23)
- స్త్రీలు యుద్ధంలో పాల్గొనాలి- యజుర్వేదం (16:44)
- స్త్రీలు మంచి కీర్తి గడించాలి - అథర్వణ వేదం (14:1:20)
- స్త్రీలు ఉత్తమపాండిత్యం సంపాదించాలి-అథర్వణవేదం(11:5:8)
- స్త్రీ సమాజానికి కుటుంబానికి రక్షకురాలిగా వ్యవహరించాలి- అథర్వణ వేదం (14:1:20)

ఈ విధంగా మంత్ర భాగంలో పేర్కొన్న అనేక మంత్రాలకు గార్గి, లోపాముద్ర వంటి స్త్రీ మూర్తులు ద్రష్టలుగా ఉన్నారు. అలాగే గాయత్రి, చండి, దుర్గ, కాళి, సరస్వతి వంటి స్త్రీమూర్తులకు సంబంధించిన మంత్రాలే అధికంగా ఉన్నాయి. యజ్ఞయాగాది క్రతువుల్లో కూడా భార్యకు అగ్రస్థానాన్ని వేదాలు కల్పించాయి. ఏ యాగం చేయాలన్న అందుకు సంబంధించిన అగ్ని ప్రతిష్ఠాపన భార్య చేస్తుంది. ఆ తర్వాతనే భర్త హోమాన్ని కొనసాగిస్తాడు.

'పతుర్నో యజ్ఞ సంయోగే' అన్న పాణిని సూత్రం ప్రకారం యజ్ఞయోగ్యతను కలిగించేది పత్నియే.

ఇక వివాహ మంత్రాల్లో కూడా వధువుకే అగ్రస్థానం ఉంది. ముఖ్యంగా కన్యాదానం చేసే సమయంలో కూడా తండ్రి తన కుమార్తెను లక్ష్మీస్వరూపంగా భావించి, కన్యాదానం చేస్తాడు. అందుకే వధువును వివాహవేదిక వద్దకు నడిపించి తీసుకురాకుండా, ధాన్యం పోసిన వెదురుబుట్టలో కూర్చోబెట్టి పుట్టింటి వారు తీసుకు వచ్చే ఏర్పాటు చేసింది శాస్త్రం.

## ఆది నుంచి ఆమే....

ప్రాచీనకాలంనుండి మన ఆచార సంప్రదాయాల్లో మహిళలకే తొలిస్థానం కల్పించింది భారతీయ సంస్కృతి. భార్యభర్తల పేర్లు పిలవాల్సి వచ్చినప్పుడు ముందుగా భార్య పేరు పిలవడం ఆనవాయితీగా వస్తోంది. దేవతలు కూడా ఇందుకు మినహాయింపు కాదు. లక్ష్మీ నారాయణులు, జానకీరాముడు, పార్వతీ పరమేశ్వరులు, సీతారాములు, గౌరీశంకరులు... ఇలా భార్య పేరు వచ్చిన తర్వాతనే భర్త పేరు వస్తుంది. వేదాలతో సహా పురాణాలన్నీ స్త్రీని శక్తిస్వరూపంగా వర్ణించాయి. త్రిమూర్తులకన్నా ఉత్తమస్థానంలో జగజ్జననిగా, పరాదేవతగా మహిళనే నిలిపాయి. అందుకే "యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః"- ఎక్కడ స్త్రీలు పూజలు అందుకుంటారో అక్కడ దేవతలు కూడా కొలువై ఉంటారని పెద్దలు చెబుతారు.

ఎన్నో యుగాలనాడే మహిళకు సర్వోన్నత గౌరవం ఇచ్చిన మన సనాతన ధర్మాన్ని మన సంస్కృతి, మన వారసత్వ సంపదగా కాపాడుకుందాం.

ఓం శ్రీమాత్రే నమః

# యువతకు స్ఫూర్తి

# 'భగవద్గీత'

- డా॥ ఎ.సచ్చిదానందమూర్తి,
98480 86858

భగవద్గీత అనాదిగా పారాయణ గ్రంథం. శ్రేష్ఠమైన గ్రంథం. ఇద్దరు విద్యాధికులు, ఇద్దరిరాజుల మధ్య జరిగిన చర్చ **భగవద్గీత.** భగవద్గీత అంటే పాడబడింది. శ్రేష్ఠమైన ప్రశస్తమైన ఉపదేశం అనిఅర్థం. దీని వ్యుత్పత్తి చూసినట్లయితే **భగవతాగీతా-** భగవంతునిచే చెప్పబడింది. **భగవతః గీతా-** భగవంతుని స్వరూపాన్ని గూర్చి చెప్పబడింది. **భగవతీ గీతా-** పూజనీయ సందేశమని మూడురకాలుగా చెప్పవచ్చు. ఈ భగవద్గీత యొక్క సందర్భం చూసినట్లయితే, మహాభారత యుద్ధం పదిరోజుల తరువాత భీష్ముడు అంపశయ్య పై వాలగా, ఆ సమాచారాన్ని సంజయుడు ధృతరాష్ట్రునికి చెప్పడం. అతడు ఏం జరిగింది? అని అడుగగా, సంజయుడు తన జ్ఞాననేత్రంతో దర్శించినది తెలియజేయడమే ఈ భగవద్గీత యొక్క ప్రధాన సన్నివేశం. నర- నారాయణుల చర్చయే ఈ భగవద్గీత. నరుడే జీవుడు. **నరాణామ్ అయనం నారాయణం.** అంటే నరులకు గమ్యస్థానం అని దీని యొక్క అర్థం.

అర్జునుడి విషాదానికి రెండు కారణాలు. యుద్ధంలో 'తనవాళ్లు నశిస్తారు' అనే చింత మొదటి కారణం. స్వయంగా 'తనవాళ్ళందరినీ చంపడం అధర్మం' అనే భావన రెండవ కారణం. మొదటిదానికి శరీరాలు ఏనాటికైనా నశించేవే అనీ, అవి నశించినా ఆత్మ నశించదు అను ఆత్మతత్త్వాన్ని ప్రతిపాదించే సాంఖ్యయోగం, జ్ఞానయోగం బోధించడం. అంటే ఆత్మతత్త్వాన్ని బోధించడం. ప్రతి ఒక్కరూ తమ కర్తవ్యమైన కర్మను తప్పని సరిగా చేయాలని చెప్పడంతో పాటు ఆ కర్మను ఎలా చేస్తే కర్తకు పుణ్యపాపాలు అంటవో అటువంటి విధానాన్ని, కర్మ యోగాన్ని బోధించడం రెండవ కారణంలో జరిగింది. కాబట్టి గీతలోని ప్రధాన విషయాలు ఈ రెండు మాత్రమే. అర్జునుడు యుద్ధమున తనచే చంప దలచిన బంధువులను చూసి యుద్ధ విముఖుడై దుఃఖించడం. ముఖ్యంగా ఇదే విషయాన్ని ఇందులో వర్ణించడంచేత ఈ అధ్యాయానికి **అర్జునవిషాదయోగం** అని పేరు పెట్టడం జరిగింది. విషాదం కూడా తత్త్వజ్ఞాన సంపాదనకు ఒక యోగమే. అనగా ఉపాయం కాబట్టి విషాదం అనగా స్వప్రయత్నమును విరమించుట.

**ఓం నమో భగవతే వాసుదేవాయ**

**అథ ప్రథమోఽధ్యాయః- అర్జునవిషాదయోగః**

**ధృతరాష్ట్రోవాచ-**

**ధర్మక్షేత్రే కురుక్షేత్రే సమవేతా యుయుత్సవః ।**
**మామకాః పాండవాశ్చైవ కిమకుర్వత సంజయ ॥ 1 ॥**

సంజయా! యుద్ధ సంసిద్ధులై ధర్మక్షేత్రమైన కురు క్షేత్రంలో చేరిన నావాళ్లు, పాండవులు ఏమి చేశారు? అని ఈ శ్లోకం యొక్క ప్రధానమైనటువంటి భావం. ఇక్కడ మనం సునిశితంగా పరిశీలించినట్లైతే పుట్టు అంధుడు అయినటువంటి ధృతరాష్ట్రుడు ప్రశ్నిస్తే- దివ్యదృష్టి, ధర్మజ్ఞుడు అయినటువంటి సంజయుడు విశ్లేషించి వివరిస్తున్నాడు. ఇక్కడ భగవద్గీత ఆవిర్భవించడానికి ప్రధానమైనటువంటిది ఏ కారణం? అనేటు వంటిది ఈ శ్లోకం ద్వారా మనం తీసుకోవచ్చు.

ఎందుకంటే ఈ శ్లోకాన్ని కనుక మనం సూక్ష్మంగా పరిశీలించినట్లైతే, ధృతరాష్ట్రుని మదిలో ఉన్నటువంటి స్వార్థ చింతన మనకు తేట తెల్లమౌతుంది. మామూలుగా ఈ శ్లోకం యొక్క ప్రధానసారం యుద్ధసంసిద్ధులై ధర్మక్షేత్రమైన కురు క్షేత్రంలో చేరిన నా వాళ్లు పాండవులు ఏం చేశారు? అని దీన్ని మనం సూక్ష్మంగా ఒక్కో పదానికి అర్థాన్ని, గనుక చూసి నట్లయితే **'మామకాః'** అనే ప్రయోగం వలన తన దుర్యోధనాది నూర్గురుకౌరవులను సూచించడం జరిగింది. అదేవిధంగా **'పాండవాః'** అనే ప్రయోగంచేత దుర్యోధనాదులను పాండవు లను వేరుచేసి చూపించడం జరిగింది. అలాగే **'సమవేతా యుయుత్సవః'** అనే విశేషమైనటువంటి ప్రయోగం ఎందుకు చేయడం జరిగింది? అంటే అక్కడ యుద్ధం కావాలని తప్పని సరిగా జరగాలని కోరుకుంటున్నాడు ధృతరాష్ట్రుడు.

అలాగే ధర్మక్షేత్రే కురుక్షేత్రే అంటే ధర్మక్షేత్రమైనటు వంటి కురుక్షేత్రమని అర్థం. ఈ కురుక్షేత్రం యొక్క వైశిష్ట్యం



చూస్తే- కురుక్షేత్రం నలభై మైళ్లతో విస్తరించి ఉన్నటువంటి ఒక ప్రదేశం. దీనికి **'శమంతకపంచకం'** అనే మరొక పేరు కూడా ఉన్నది. ఈ ప్రదేశం యొక్క ప్రత్యేకత ఏమిటంటే దీనిని **'యజ్ఞభూమి', 'కర్మభూమి'** అని అంటారు. ఎందుకనగా ఎందరో మహామహిమాన్వితులు ఇక్కడ తపస్సు ఆచరణం చేశారు. ఇక్కడ ఏ కార్యం తలపెట్టినా ఆ కార్యం సత్ఫలితాన్ని పొందుతుంది. కురుమహారాజు వలన కురుక్షేత్రం అని పేరు రావడం జరిగింది. ఒక పవిత్ర పుణ్యక్షేత్రం వంటిది ఈ కురుక్షేత్రం. అటువంటి గొప్ప ప్రదేశంలో యుద్ధం అనేటువంటిది ప్రారంభం అయింది.

ఇక్కడ ధర్మక్షేత్రే కురుక్షేత్రే అని ప్రయోగించడంలో ధృతరాష్ట్రుని ఆంతర్యం ఏమిటి? మనం ముందుగా చెప్పు కున్నట్లుగా ధృతరాష్ట్రుడు యుద్ధం జరగాలని కోరుకుంటు న్నాడు. యుద్ధం జరిగి పాండవులు ఓడిపోయి, తన కుమారులే రాజులు కావాలి అని ధృతరాష్ట్రుని యొక్క మానసిక చింతన. ఇక్కడ ధర్మక్షేత్రే కురుక్షేత్రే అని ప్రయోగించడం వలన ఈ పవిత్రమైనటువంటి కురుక్షేత్ర ప్రదేశంలో ఎక్కడ నా కుమారులు తమ యొక్క బుద్ధిని మార్చుకుని, మేము ధర్మజునికే రాజ్యం అప్పజెప్పేసి, ధర్మజుడినే రాజుని చేద్దాం అనుకుంటున్నారో అనే ఒక కారణం. అదేవిధంగా ఈ పవిత్రప్రదేశంలో యుధిష్ఠిరుడు తన మనస్సును మార్చుకుని యుద్ధం విరమించుకుని వెళ్లిపోయాడా? అనే ఒక సందేహం. అలాగే యుద్ధం ఆగిపోయినదా యుద్ధం జరుగుచున్నదా? అనే కుతూహలంతో, ఒకవేళ యుద్ధం జరిగినచో దాని పరిణామాలు ఏంటి? అనే విశేషాలు తెలుసు కోవాలన్న జిజ్ఞానసతో సంజయుణ్ణి ధృతరాష్ట్రుడు ఈ విధంగా ప్రశ్నించడం జరిగింది.

మనకు అనాదిగా వస్తున్న విషయం గమనిస్తే- స్వార్థం పెరిగినపుడు లేదా ఆధిక్యతను చోటు చేసు కున్నపుడు సమాజంలో వినాశం అనేటువంటిది తప్పదు. కాబట్టి ధృతరాష్ట్రుని యొక్క ప్రశ్న వెనకాల దాగి ఉన్నటువంటిది 'స్వార్థం'. దాని పరిణామం భారత సంగ్రామం. ఆ భారత సంగ్రామంలో పాండవుల విజయం. అంతేకాకుండా ఈ ప్రపంచానికి ఒక మహత్తరమైనటువంటి సందేశం. నేటి యువతకు ఒక ప్రశస్తమైనటువంటి మార్గ నిర్దేశనం. అందుకే అంటారు **'నా దేశం భగవద్గీత. నా దేశం అగ్నిపునీత సీత'.**

## ఏప్రిల్ నెల క్విజ్-9 సమాధానాలు

**01)దైవికము 02)అధైర్యం 03)శేషాచలం 04)నాగులాపురం 05) పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ 06)గంగాదేవి 07)తూర్పు 08)శోణా 09)బుక్కరాయలు 10) ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామిబ్రహ్మోత్సవాల్లో 11)సిద్ధవటం 12)పరశురాముడు 13)ప్రభానుడు 14)ప్రశస్తిపద్యం 15)కాటుక 16)హృషీకేశ్ 17)పెద్దవంటగది 18)శ్రీవేంకటాచల మాహాత్మ్యం 19)అక్షయతదియ 20)గంధం అమావాస్య**

ఈ తొమ్మిదవ క్విజ్‌కు సరైనటువంటి సమాధానాలు ఎవరు రాయలేదు.



# శ్రీవేంకటేశ్వరస్వామి సేవలో.. మహిళా భక్త శిరోమణులు

- డా॥ నాగోలు కృష్ణారెడ్డి, 94411 12636

*(గత సంచిక తరువాయి...)*

**సెల్ల-** ఈమె సదాశివరాయల కాలంలో, సా.శ.1543లో, స్వామికి, నాచియార్‌కు, సేనైమొదలియార్‌కు, తిరువళి ఆళ్వాన్‌కు వివిధ సేవల నిమిత్తంగా శ్రీభండారానికి 1120 నర్పణాలు సమర్పించింది.

**సెన్నగవెంబు-** ఈమె సా.శ. 1546లో స్వామికి పది ఇడ్డలపడికోసం 600 పణాలు, తిరుమానిమంటపంలో జరిగే చూర్ణాభిషేక నిమిత్తం సమర్పించింది.

**సెవ్వసాని-** సా.శ.1563 నాటి తిరుపతి కపిలేశ్వరస్వామి దేవాలయంలోని ఒక శాసనంలో ప్రస్తావించినట్లు, ఈమె కపిలేశ్వర దేవాలయంలోని నృత్తమండపంలో విఘ్నేశ్వర ప్రతిమను ప్రతిష్ఠించి, ప్రతిరోజూ సేవల నిమిత్తం 200 పణాలను సమర్పించినట్లు ఈ శాసనం తెలుపుతూంది.

**పర్మదమ్మ, రుక్మిణీ అమ్మ-** సా.శ.1535నాటి ఒక శాసనంలో అడైప్పమ్ పర్మదమ్మ, అడైప్పమ్ రుక్మిణి అమ్మలు వేంకటేశ్వర స్వామికి వివిధ సేవల నిమిత్తం వేర్వేరుగా 518 రేఖైపొణ్‌లు దానంగా ఇచ్చినట్లుంది. ఇందులో పర్మదమ్మ ఇచ్చిన దాంట్లో 20 రేఖైపొణ్‌లు ఒక ఉద్యానవనానికి కావలసిన స్థలాన్ని కొనడానికి, 18 రేఖైపొణ్‌లు రాతితో ప్రాకారగోడను నిర్మించ డానికి, 180 రేఖైపొణ్‌లు ఉద్యానవనంలో మొక్కలు కొనడానికి, 150 రేఖైపొణ్‌లు ఆ ఉద్యానవనంలో మండపాన్ని నిర్మించడానికి వెచ్చించాలని కోరింది. కానీ, అడైప్పమ్ రుక్మిణీ అమ్మ ఇచ్చిన దానానికి వివరాలు తెలియవు.

**తిరుమలదేవి, చిన్నాదేవి-** శాసనాల ప్రకారం తిరుమల క్షేత్రాన్ని విజయనగర ప్రభువు ఏడుసార్లు దర్శించినట్లు, అందులో మూడుసార్లు తన దేవేరులైన తిరుమలదేవి, చిన్నా దేవిలతో దర్శించారు. వీరిరువురు స్వామివారిని వివిధ విలువైన వస్తువులను సమర్పించారు. సా.శ.1513లో మొదటసారి కృష్ణదేవరాయలుతో కలిసి తిరుమలకు వచ్చిన తిరుమల దేవి పాలారగింపు సేవకు ఒక బంగారుగిన్నె, పునుగు సేవకు కస్తూరి మొదలైన సుగంధద్రవ్యాలను పెట్టుకోవడానికి 374 క్యారెట్లు ఉండే ఒక బంగారు పళ్ళేన్ని స్వామికి సమర్పించింది. సా.శ.1514లో తిరుమలదేవి వజ్రాలు, పద్మరాగాలు, పచ్చలు, ముత్యాలు పొదిగిన బంగారుపతకాన్ని కానుకగా సమర్పిస్తూ, చోళింగ వరప్పట్టుసీమ 'పిరాట్టకూణత్తూర్' గ్రామం ఆదాయాన్ని నిత్య నైవేద్యాల కోసం వినియోగించే ఏర్పాటు చేసింది. ఇక చిన్నాదేవి ఒక పతకాన్ని, ఒక కంఠమాలను కానుకగా సమర్పిస్తూ, అలాగే తొండమండలంలోని ముడియూరు గ్రామాన్ని నిత్యనైవేద్యాలకోసం ఇచ్చింది. తన వంతుగా వచ్చే ప్రసాదంలో 1/4వ వంతు ప్రసాదాన్ని తిరుప్పణి పిళ్ళైకి, మిగిలిన మూడువంతులు సత్రంలోని బ్రాహ్మణులకు ఇచ్చే ఏర్పాటు చేసింది.

సా.శ. 1521లో కృష్ణదేవరాయలతో పాటు తిరుమల దేవి మాత్రమే వచ్చింది. అప్పుడు ఆమె నవరత్నాలు పొదిగిన పతకాన్ని స్వామికి కానుకగా సమర్పించింది. కృష్ణదేవరాయలు మహాద్వారంలోపల ప్రతిమామండపాన్ని ఏర్పరచి తన ఇద్దరు దేవేరులతో తాను కూడా నిలబడి స్వామివారికి అభిముఖంగా అభివాదం చేస్తూ ఉన్న లోహ విగ్రహాలను ప్రతిష్ఠింపచేశాడు. తన విజయాల వెనుక భగవంతుని కరుణాకటాక్షముందని కృష్ణదేవరాయలు ప్రగాఢంగా విశ్వసించాడు.

**ఎల్లమ్మన్-** ఈమె కొట్టయమల్లయ్యర్ కూతురు. ఈమె సా.శ.1536లో స్వామి నిత్యనైవేద్యాల కోసం 1,600 నర్పణాలను దానంగా ఇచ్చింది.

**కృష్ణమంగై-** ఈమె తిరుపతిలోని గోవిందరాజస్వామి దేవా లయ నిత్యనైవేద్యాలకోసం 110 పణాలను దానంగా ఇచ్చింది.



తన విజయాల వెనుక భగవంతుని కరుణాకటాక్షముందని శ్రీకృష్ణదేవరాయలు విశ్వసించాడు

ఇది గోవిందరాజస్వామి దేవాలయంలో జరిగే కైశికిపురాణ ఉత్సవంలో కైశికీ పురాణం చదవడానికి ఉద్దేశించింది.

**చిన్నమ్మన్-** ఈమె ప్రతాపమల్లయరసర్ కూతురు. కొండవీడు సీమలోని వంకాయల పట్టు లేదా శ్రీరామచంద్రపురం గ్రామం ద్వారా ప్రతి సంవత్సరం 300 రేఖైపొణ్‌ల ఆదాయాన్ని వివిధ ఆహార నైవేద్యాల కోసం, గోవిందరాజ, విఠలనాథునికి తిరుపతిలో దానంగా ఇచ్చింది. ప్రతాపమల్లయరసర్ బహుశా కొండవీడుప్రాంత పాలకుడు కావచ్చు.

శాసనాల ద్వారానే గాకుండా సాహిత్యంద్వారా కూడా కొందరు భక్తశిరోమణులు తెలుస్తున్నారు. అలాంటివారిలో ముఖ్యంగా చెప్పుకోదగిన వారు తాళ్లపాక తిమ్మక్క, తరిగొండ వెంగమాంబగార్లు.

**తాళ్లపాక తిమ్మక్క-** ఈమె పదకవితాపితామహుడు తాళ్లపాక అన్నమయ్య భార్య. తెలుగులో మొదటి కవయిత్రి. నన్నయ మహాభారతంలోని ఆదిపర్వంలోని విజయవిలాసఘట్టాన్ని తీసుకుని సుభద్రాకల్యాణమనే ద్విపదకావ్యాన్ని రాసింది. నన్నయ అర్జునుడి చేత వేంగీదేశమంతా తీర్థయాత్రలు చేయిస్తే, తిమ్మక్క అర్జునుని అహోబిలం తిరుపతి, కంచితీర్థయాత్రలు చేయించింది.

**తరిగొండ వెంగమాంబ-** శ్రీవేంకటేశ్వరస్వామి భక్తశిరోమణుల్లో వెంగమాంబకు విశిష్టమైన స్థానం ఉంది. వెంగమాంబకు పుట్టుకతోనే దైవభక్తి వచ్చింది. ఆమె జీవితం మొదటి నుండి ఆధ్యాత్మిక మార్గంలోనే కొనసాగింది. ఆమె జీవితంలో జరిగిన సంఘటనలు 20 సం॥ వయస్సు నిండకుండానే తిరుమల చేరుకునేట్లు చేశాయి. అడవిమార్గంలో ప్రయాణించి తిరుమలక్షేత్రం చేరిన వీరి భక్తిప్రపత్తులు తెలుసుకున్న అప్పటి తిరుమల హథీరాంజీ మఠాధిపతి ఆత్మారాందాస్‌జీ మహంతు శ్రీవారి ఆలయానికి ఈశాన్యంగా ఒక కుటీరంలో ఆమెకు నివాసం కల్పించి, స్వామివారి ఉగ్రాణం నుండి వకుళాదేవి పేర దినవెచ్చం పంపే ఏర్పాటు చేశాడు.

ఆమె తరిగొండలో ఉన్నప్పుడు నృసింహాశతకం, నృసింహ విలాసం, శివనాటకం, రాజయోగామృతసారం, బాలకృష్ణ నాటకం రాసింది. తిరుమలలో విష్ణుపారిజాత యక్షగానం, రమాపరిణయమనే ద్విపదకావ్యం, చెంచునాటకమనే యక్షగానం, శ్రీకృష్ణమంజరి, వేంకటాచలమాహాత్మ్యము, ముక్తికాంతా విలాసమనే యక్షగానం, జలక్రీడావిలాసమనే యక్షగానం, వాసిష్ఠరామాయణమనే ద్విపదకావ్యం మొత్తం 18 కావ్యాలు రాసింది. ఆమె రాసిన **వేంకటాచలమాహాత్మ్యము** వలనే స్వామి మహిమలోకానికి తెలిసింది.

అన్నమయ్యకు పూర్వకవి స్తుతిలో పేర్కొన్న ఏకైక కవయిత్రి వెంగమాంబ. తిరుమలలో తాను ఉన్న ఇంటికి ఉత్తరాన ఎత్తైన ప్రదేశంలో ఒక బావిని తవ్వించి పూలమొక్కలతో కూడిన తులసీవనాన్ని పెంచి, ప్రతిరోజూ ఆ పూలతో తులసీ మాలలో స్వామిని సేవించేది. ఆమె ఒకరోజు పూలతోటలో ఉండగా వేంకటేశ్వరుడు బాలకృష్ణుని రూపంలో వచ్చి శ్రీభాగవతాన్ని చేతికిచ్చి దాన్ని ద్విపదకావ్యంగా రాయమని సూచించాడట.

వెంగమాంబ ప్రతి సంవత్సరం నృసింహజయంత్యుత్సవాలను మహావైభవంగా పదిరోజులపాటు నిర్వహిస్తూ ఉండేది. ఇప్పటికీ నృసింహజయంతికి పదోరోజు ఉత్సవమూర్తి వెంగమాంబ ఇంటికి వచ్చి పూజలు, ఆరగింపులు అందుకుంటూ ఉండడం విశేషం.

వెంగమాంబ వేంకటేశ్వరుని సన్నిధిలో **'నిత్యముత్యాల'** హారతి అనే ఒక శాశ్వత కైంకర్యాన్ని ప్రారంభించింది. మహావిష్ణువు దశావతారాలను రోజుకొక్కటి చొప్పున, ఒక పెద్ద పళ్ళెంలో ముత్యాలతో అమర్చి, కుంకుమ, ముగ్గుపిండి మొదలైన వాటితో అలంకరించి, నిత్యం ఏకాంతసేవ సమయానికి ఆలయానికి స్వయంగా వెళ్లి కర్పూరహారతి ఇచ్చి పాటపాడేది.

ఇలా వెంగమాంబ ఒక పక్క సారస్వత సేవనూ, మరో పక్క స్వామివారి కైంకర్యాలనూ చేస్తూ, భక్తశరోమణిగా ధన్య జీవితాన్ని గడిపి సా.శ.1817లో పరమపదించింది. పోతన, అన్నమయ్య, మీరాబాయిలాంటి వారితో పోల్చదగిన మహనీయురాలిగా వెంగమాంబ చరిత్రకెక్కింది.

# కరనేశ్వర స్వామి ఆలయం

- శ్రీ పి.కృష్ణమూర్తి, 99493 80689

చెన్నైమహానగరం ప్రాచీనసంప్రదాయాలకు, విశ్వాసాలకు నిలయం. ఈ నగరమందు వందల కొద్దీ ఆలయాలున్నాయి. నగరనిర్మాణానికి పూర్వమే పల్లవులు, చోళులు విజయనగరరాజులు అనేక ఆలయాలను నిర్మించారు. వీటిలో ఒక్కో ఆలయానికి ఒక్కో ఐతిహ్యం ఉన్నది. అటువంటి ఆలయాలలో సైదాపేటలోని **కరనేశ్వరస్వామి ఆలయం** ప్రముఖమైంది.

సైదాపేట కరనేశ్వరస్వామి ఆలయాన్ని ఎవరు ఎప్పుడు నిర్మించారో చెప్పడానికి ఆధారాలు కానరావు. పురాణాలు ఆలయనిర్మాణం గురించి ఈ విధంగా తెలియజేస్తూ ఉన్నాయి. పూర్వం ఇంద్రుడు తన వద్దనున్న కామధేనువును వశిష్ఠ మహర్షికి ఇచ్చాడట. ఆ గోవు మహర్షి వద్దకు వెళ్లిన తరువాత పాలు ఇవ్వడం నిలిపివేసింది. మహర్షి తన అనుచరులతో ఎందుకు గోవు పాలు ఇవ్వడం మానేసింది? అనగా దానికి మీరు గోవు మీద కోపగించి విసిగించారు, అందుచేత ఆ గోవు పాలు ఇవ్వడం లేదు అని తెలిపారట. మహర్షి ఈ విషయాన్ని ఇంద్రునికి విన్నవించుకోగా ఆయన ఈ గోవు ఎందుకు మామూలు ఆవుగా మారింది అని తన ఆస్థానపండితులను విచారించగా, వారు మీరు ఈశ్వరుని వద్దకు వెళ్లి ఆయనకు ఈ విషయం తెలియజేసి గోవును పూర్వపు స్థితికి తీసుకురమ్మని ప్రార్థించమన్నారట. అంతేకాక స్వామికి భూలోకంలో సముద్ర తీరాన ఆలయాన్ని నిర్మించి, స్వామిని ప్రతిష్ఠించమని చెప్పారట. ఇంద్రుడు ఈశ్వరుని వద్దకు వచ్చి విషయం తెలియజేయగా, పరమేశ్వరుడు గోవును పూర్వపు స్థితికి వచ్చేటట్లు చేశారు. అంతేకాక, ఆ గోవు ఇంద్రుని వద్దకు చేరింది. స్వామి చేసిన ఈ సహాయానికి ఇంద్రుడు ఈశ్వరునికి తూర్పు సముద్రతీరంలో ఆలయాన్ని నిర్మించుటకు పూనుకొని, వరుణదేవుని వర్షింపమని ఆదేశించగా, అచ్చట కుంభవృష్టి కురిసింది. ఆ ప్రదేశమంతా సస్యశ్యామలమైంది. ఆ మైదానంలో ఇంద్రుడు పరమేశ్వరునికి అపూర్వమైన ఆలయాన్ని నిర్మించాడు. ఆ ఆలయమే **కరనేశ్వర స్వామి ఆలయం.**

ఆలయ నిర్మాణం ఏకకాలంలో కాక వివిధదశలలో నిర్మితమైంది. ఆలయం చుట్టూ ఎత్తైన ప్రహరి, అందులో దక్షిణ దిశలో ఏడంతస్తుల రాజగోపురము ఉంది. ఈ గోపురం చాలా అందంగా నిర్మించారు. గోపురం ప్రతి అంతస్తుకు మధ్యన ద్వారం, ఇరువైపులా సాయుధపాణులైన ద్వారపాలకులు, ఒక పాదాన్ని వంచి మరో పాదం మోకాలి పై ఉంచారు. ఆలయం మొత్తం శివపార్వతి, వినాయక, కుమారస్వామి, సేవ గణాల శిల్పాలతో నిండిపోయింది. వీరితోపాటు కొన్ని వైష్ణవ శిల్పాలు కూడా గోపురం మీద కనబడుతున్నాయి. ముఖ్యంగా లక్ష్మీదేవి ప్రతిమ. ఈమెకు ఇరువైపులా రెండు ఏనుగులు ఉన్నాయి. దేవి చతుర్భుజగోపురం పైభాగాన ఏడు కలశాలు ఉన్నాయి. గోపుర నిర్మాణంలో అచ్చటచ్చట లింగోద్భవమూర్తి, దక్షిణామూర్తి, కార్తికేయ, శిల్పాలు ఉన్నాయి.

ఆలయం ముందు తూర్పు వైపు వేదగిరీశ్వరస్వామి, ప్రధాన ధ్వజస్తంభము, బలిపీఠము, పెద్ద నందీశ్వరుడు కొలువై ఉన్నారు.

స్వామిమందిరం అతి ప్రాచీనమైంది. ఆలయం గర్భగృహము అంతరాళము, ముఖమండపము, మహామండపాలను కలిగి ఉంది. గర్భాలయమందు స్వామి అతి చిన్నగా, లింగరూపంలో పానవట్టంపై కొలువై కరనేశ్వరస్వామి పేర పూజింపబడుచున్నాడు. స్వామి లింగంపైన పంచముఖ ఆదిశేషుడు పడగ విప్పి స్వామిని సేవిస్తూ ఉన్నాడు. స్వామి తలపై భాగాన ధారాపాత్ర కలదు. ఈ స్వామి మహిమ అంతా గురుత్వాకర్షణ ప్రభావంతో నిక్షిప్తమై ఉంది. ఈ స్వామి మహిమలు వర్ణనాతీతం. స్వామి ముంగిట అంతరాళము, ముఖమండపము, ఇరువైపులా ఆయుధాల్ని కలిగిన ద్వార పాలకులు, వారి ప్రక్కన ఉత్తరదిశలో కుమారస్వామి, దక్షిణాన వినాయకుడు నిలుచునే ఉన్నారు. స్వామికి ఎదురుగా చిన్నపాటి నందీశ్వరుడు ఆసీనుడై ఉన్నాడు. స్వామి అభిషేకజలం పానవట్టం ద్వారా వెలుపలికి వెళ్లి ఆలయం వెనుకభాగాన ఉన్న పుష్కరిణిలో కలుస్తుందట.





ఈ స్వామి అభిషేకజలం పుష్కరిణిలో కలవగానే ఆ జలం రంగు మారుతుంది. గర్భాలయం పైన ద్వితలవిమానం, గుండ్రని శిఖరం పైన కలశం ఉన్నాయి.

తమిళమాసం చిత్తిరిలో ఆలయమందు 11 రోజులు ఉత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ పదకొండు రోజులు ఆలయమందు అంగరంగవైభవంగా స్వామిని దేవాలయం మాడవీథులలో ఊరేగిస్తారు. కోనేటిలో దేవతలను నీటిపై తెప్పలలో విహరింప చేస్తారు. ఈ 11 రోజులు ఆలయమందు భక్తజన సందోహము ఎక్కువగా ఉంటుంది. ఈ రోజులలో రాత్రులందు జానపద నాటకాలు, భజనలు, హరికథలు, చిత్రవిచిత్ర వేషధారణలు, కీలుగుర్రాలు, శివుడి విశేషకథలు వినిపిస్తారు. ఈ పుణ్యదినాలలో, రోజూ వేలాదిమంది భక్తులు పుష్కరిణి యందు స్నానమాచరిస్తారు. అలాగే శివరాత్రి పర్వదినాన, ఆడికృత్తిక రోజున, శని త్రయోదశి రోజున, ఆలయం పవిత్రంగా పూజింపబడుతుంది, ముఖ్యంగా ప్రదోషపూజ ఈ ఆలయంలో నిష్ఠతో జరుపుతారు, ఆలయం పుణ్యదినాలలోనే కాక, ప్రతిరోజూ భక్తులతో అలరారుతూ ఉంటుంది,

ప్రస్తుతం ఈ ఆలయం తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వ దేవాదాయశాఖ వారి ఆధీనంలో ఉంటూ, ఎంతో వైభవంగా నిర్వహింపబడుతూ ఉంది.

## తిరుపతి,
# శ్రీకపిలేశ్వరస్వామివార్ల పవిత్రోత్సవములు

**(29-06-2023 నుంచి 02-07-2023 వరకు)**



| తేదీలు | వారము | ఉత్సవములు | |
|---|---|---|---|
| 29-06-2023 | గురువారం | --- | అంకురార్పణ |
| 30-06-2023 | శుక్రవారం | పంచమూర్తులకు స్నపన తిరుమంజనం | పవిత్రమండలపూజ, హోమములు |
| 01-07-2023 | శనివారం | గ్రంథి పవిత్రసమర్పణ, వ్రతచరి | పవిత్ర ప్రతిష్ఠ, వ్రతచరి |
| 02-07-2023 | ఆదివారం | పవిత్ర సమర్పణ, పవిత్రోత్సవ సమాప్తి | పంచమూర్తులవీథి ఉత్సవము |

శ్రీవేంకటేశ్వరలీలలు



# ఆశ్రితవత్సలుడు

- శ్రీ మిరియపల్లి సత్యం, శ్రీకాకుళం

శ్రీవేంకటేశ్వరస్వామి మా కుటుంబానికి ఇష్టదైవం. మా స్వంత ఊరైన శ్రీకాకుళం నుండి అప్పుడప్పుడు తిరుమలకు వెళ్ళి ఆ స్వామి దర్శనం చేసుకొని వస్తూ ఉంటాము.

ఎప్పుడైనా నేను ఏదైనా పని మీద హైదరాబాద్ వెళ్ళిన ప్పుడల్లా తప్పనిసరిగా అక్కడనుండి తిరుపతికి వెళ్ళి ఆ స్వామిని సేవిస్తూ, ఆయన దర్శనం చేయడం ఆనవాయితి.

ఇట్లుంటే ఒకసారి నేను పని మీద హైదరాబాద్ వెళ్ళి తిరుపతికి వెళ్ళకుండా శ్రీకాకుళానికి తిరుగు ప్రయాణమవ్వడానికి నిశ్చయించు కున్నాను. రాత్రి 10 గంటలకు కదా రైలు అని, అంతలోపల ఎం.ఎల్.ఏ. క్వార్టర్స్‌లో ఉన్న నా స్నేహితులను కలవడానికి వెళ్ళాను. అందరం సాయంత్రం అక్కడి ఉద్యానవనంలో కూర్చుని కబర్లు చెప్పుకొంటూ ఉన్నాము. చీకటైనందున అందరంలేచి బయలు దేరాం. నేను కూడా నగరంలోని నా బసకు బయలుదేరి సగం దూరం



వెళ్లేసరికి, ఎప్పుడూ నా చేతిలో ఉండే జిప్పుబ్యాగు కనపడలేదు. దానిని ఉద్యానవనంలో కూర్చున్నప్పుడు ప్రక్కనే పెట్టుకున్నట్లు జ్ఞాపకం వచ్చి, వెంటనే అక్కడకి వెళ్ళి వెతికాను. కానీ సంచి దొరకలేదు. ఎవరికైనా దొరికిందేమో అనుకుని అక్కడ ఉండే వాళ్ళని అడిగినా కూడా లాభం లేకపోయింది. ఆ సంచిలో సుమారు 700 రూపాయలు, శ్రీకాకుళానికి టిక్కెట్ ఉంది. ఉన్న డబ్బు, టిక్కెట్‌పోయింది. ఇంటికి వెళ్ళడం ఎలా? అని ఆందోళన కలిగింది.

ఇంతలో మా ఇలవేల్పు శ్రీవేంకటరమణస్వామి జ్ఞప్తికి వచ్చినాడు. హైదరాబాద్ వచ్చినప్పుడు ప్రతిసారీ తిరుపతి వెళ్ళే నేను, ఈ సారి వెళ్ళకుండా, తిరిగి వెళ్ళుతున్న కారణంగా స్వామివారికి కోపం కలిగిందని గ్రహించి, “స్వామీ! నేను తప్పు చేశాను. తప్పకుండ తిరుపతికి వచ్చి తమ దర్శనము చేసు కుంటాను. నా అపరాధాన్ని మన్నించి, నా సంచిని నాకు దొరి కేటట్లు చేయండి” అని నిశ్చలమనస్సుతో ప్రార్థన చేశాను. స్వామి తప్పకుండా నన్ను కరుణించి, నా సంచి నాకు ఇప్పిస్తా రన్న దృఢనమ్మకంతో శాసనసభ్యుల క్వార్టర్స్ వరండాలో నా స్నేహితులతో స్వామివారిని ప్రార్థిస్తూ కూర్చున్నాను.

కానీ వారు ‘పోయిన సంచి ఎలా దొరుకుతుంది? ఎవరు తెచ్చి ఇస్తారు? ఇక్కడ ఎంతసేపు కూర్చుని ఏమి లాభం?

లేవండి పోదాం?' అని అన్నారు. కాని నేను లేవలేదు. "నా సంచి నాకు దొరికి తీరుతుంది. నా మాట నమ్మండి. మీకు పనులుంటే మీరు వెళ్ళండి" అని చెప్పాను. నా మిత్రుల్లో ఒకడు నాస్తికుడు. భగవంతుని మీద నమ్మకం లేని అతడు– 'ప్రయత్నం చెయ్యకుండా నీ బ్యాగు ఎట్లా వస్తుందయ్యా? పోలిసు వాళ్ళకైన రిపోర్టు ఇద్దాం. లేవండి' అని వాదించాడు. అప్పుడు నేను– 'అదేమి అవసరం లేదు. చూస్తూ ఉండండి. నా సంచి నాకు వస్తుంది. నేను స్వామి వారికి చిన్న అపరాధం చేశాను. కాబట్టి అది పోయింది. ఇప్పుడు ఆ స్వామియే దాన్ని నా దగ్గరకు వచ్చేటట్లు చేస్తారు. ఓపిక పట్టండి' అని చెప్పాను.




సుమారు ఒక గంట తర్వాత ఇద్దరు కొత్త మనుష్యులు వచ్చి మా ప్రక్కన కూర్చొని, మా మాటలు విన్నారు. 'ఆ సంచిలో ఏయే వస్తువు లున్నాయి?' అని అడిగారు. వెంటనే నేను 'అందులో 700 రూపాయలు, రైల్వే టిక్కెట్, రాసుకునే పేనా ఒకటి ఉంది' అని చెప్పాను.

తర్వాత వారిద్దరూ– 'అయ్యా! ఆ సంచి మాకిద్దరికి దొరికింది. ఇంటికి పోయి అందులో చూడగా, మీరు చెప్పిన వస్తువులు అన్నీ ఉన్నాయి. ఆ డబ్బును సమానంగా పంచుకుందాం అని అను కొన్నాం. కానీ మా మనసులో ఒక విధమైన ఆందోళన కలిగి ఆ పని చెయ్యలేకపోయాం. మా ఇద్దరికీ ఆ విధంగా ఎందుకు కలిగిందో చెప్పలేము. మా మనసుకు బ్యాగుపోగొట్టుకున్న వ్యక్తికే దానిని తిరిగి ఇచ్చేయాలనితోచింది. మా ఇంట్లో దాచిన బ్యాగును ఇచ్చి వేస్తాం. మీరు మాతో రండి' అని చెప్పారు.

మేమంతా వాళ్ళ ఇంటికి వెళ్ళాం. ఆ సంచిని మాకు అందజేశారు. అందులో రూపాయలన్నీ ఉన్నాయి. వెంటనే నా స్నేహితుడు ఒకడు శ్రీకాకుళం టిక్కెట్ క్యాన్సిల్ చేసి, తిరుపతికి టిక్కెట్ తీసి తెచ్చి ఇచ్చాడు. ఇదంతా ఆ శ్రీనివాసుని లీలా విశేషమే! ఆ స్వామివారి మహిమా విశేషానికి మా మిత్రు లందరూ ఆశ్చర్యపడ్డారు. వెంటనే నేను తిరుపతికి ప్రయాణమై తలనీలాలు ఇచ్చి, తనివితీర స్వామివారి దర్శనం చేసికొని హాయిగా ఇల్లు చేరాను. శ్రీవేంకటేశుని ఆశ్రితపక్షపాతానికి ఇదొక ఉదాహరణ. ఓం నమో వేంకటేశాయ!!!

**అతిథిదేవోభవ**

**అతిథులు ఇంటికి విచ్చేసినప్పుడు వారిని దైవస్వరూపాలుగా భావించి, వారికి కావలసిన ఉపచారాలు లేక సేవలు నిర్వర్తించాలి. వారికి నచ్చిన విధానంలో ఆతిథ్యాన్ని అందివ్వాలి. వారి మనస్సును నొప్పించని విధంగా వ్యవహరించాలి. చిరునవ్వుతో వారిని ఆహ్వానించాలి. ఆప్యాయతతో కూడిన మంచిపలకరింపు మన ఇంటికి వచ్చినవారికి వసతిసౌకర్యాలు ఏర్పాటుచేయాలి. తద్వారా వంశాభివృద్ధి కలుగుతుంది.**

ఆయుర్వేదం

# అద్భుత ఔషధ శక్తులున్న ఆహార ద్రవ్యం
# బాదం

– డా॥చిట్టిభొట్ల మధుసూదనశర్మ,
90007 61390

ప్రకృతి మాత ప్రసాదించిన రుచికర అద్భుత ఆహార ఔషధం **'బాదంపప్పు'**. వివిధరకాల అపారపోషక విలువలు కలిగియుండి విభిన్న వ్యాధుల నివారణకి నిరోధానికి ఈ బాదం పప్పు ఉపయోగపడుతుంది.

ఆంగ్లంలో 'ఆల్మండ్'గా వ్యవహారింపబడే ఈ బాదం సంవత్సరమంతా లభ్యమవుచూ, మనం ఎదుర్కొనే వివిధ అనారోగ్య సమస్యలకు ఔషధంగా ఉపయోగపడుతుంది.

బాదం పప్పుని వేడి నీటిలో రెండుగంటలు నానించి పొట్టు తీసి పప్పుని ఎండించి వినియోగించడంవల్ల పరిపూర్ణమైన దాని ఔషధగుణాలు మన ఆరోగ్యానికి శ్రీరామ రక్షగా ఉపయోగపడుతాయి.

**సుఖ విరేచనమయ్యేందుకు:** బాదంపప్పు పొడి, ఎండుద్రాక్ష, పటికబెల్లం పొడి ఒక్కొక్కటి 10గ్రా., సునాముఖి పొడి 30గ్రా. తీసుకొని తగినంత తేనె కలిపి మిక్సీలో వేసి లేదా మెత్తగా దంచి నిల్వచేసి రోజూ రాత్రి పడుకునేటప్పుడు 5-10గ్రా. ఔషధాన్ని చప్పరించి మింగి, కప్పు గోరువెచ్చని నీరు సేవిస్తే మంచి ఫలితం కలుగుతుంది.

**మంగు మచ్చలకు :** బాదం పప్పుల పొడిలో తగినంత ముల్లంగి రసం కలిపి ముఖానికి పట్టించి, గంటసేపాగి కడిగితే మంచి ఫలితం కలుగుతుంది.

**నడుము నొప్పి తగ్గేందుకు:** బాదంపప్పుపొడి, గసగసాలను వేయించి చేసిన పొడి, పటికబెల్లం పొడి సమానంగా కలిపి ఉంచుకుని, రోజూ రెండుపూటలా పూటకు 100 మి.లీ. నీటిలో 5గ్రా॥ పొడికలిపి సేవిస్తే నడుమునొప్పి సమస్య త్వరగా తగ్గుతుంది.

**అమిత వేడి వల్ల కలిగే దగ్గుకు:** రోజూ రెండు పూటలా పూటకి ఎనిమిది బాదంపప్పుల్ని దంచి అందులో తగినంత పటిక బెల్లంపొడి, వెన్న కలిపి సేవిస్తే త్వరగా ఫలితం కలుగుతుంది.

**నేత్ర వ్యాధులకు :** బాదంపప్పు పొడి 100 గ్రా., గసగసాలను వేయించి చేసిన పొడి 50గ్రా., చలువమిరియాలపొడి 25గ్రా., పటిక బెల్లం పొడి 175 గ్రా., స్వచ్ఛమైన ఆవునెయ్యి 100-200 గ్రాములు కలిపి ఉంచుకొని, రోజూ రెండుపూటలా పూటకు ఒక టీ స్పూన్ ఔషధాన్ని 50 మి.లీ. వేడి పాలలో కలిపి సేవిస్తే నేత్రదోషాలు తొలగి కంటి దృష్టి మెరుగవుతుంది.

**గర్భిణుల ఆరోగ్యానికి :** 100 గ్రా. బాదంపప్పు పొడి, 50 గ్రా. ఎండు ఖర్జూరం పెచ్చుల పొడి, 50 గ్రా. కిస్‌మిస్, 10 గ్రా. ఏలకుల పొడి కలిపి దంచి నిల్వ ఉంచుకొని రోజూ ఉదయం, సాయంత్రం పూటకు 100 మి.లీ. గోరువెచ్చని పాలలో ఒక టీ స్పూన్ పొడి కలిపి సేవిస్తే గర్భిణుల్లో పోషకాహార లోపం లేకుండా, శిశువు పెరుగుదల బాగా ఉండి సుఖప్రసవం జరుగుతుంది.

**నిద్రలేమికి:** రాత్రి పడుకునేటప్పుడు 100మి.లీ. గోరువెచ్చని పాలలో 1-2 గ్రాముల బాదంపప్పు పొడి, ఒక గ్రాము జాజి కాయచూర్ణం కలిపి సేవిస్తే గాఢ నిద్రపడుతుంది.

**నరాల బలహీనత:** బాదంపప్పు పొడి 100గ్రా., తాటికలకండ పొడి 100గ్రా., మిరియాల పొడి 10గ్రా., కలిపి ఉంచుకొని రోజూ ఒకట్రెండుసార్లు పూటకు 100 మి.లీ. గోరువెచ్చని పాలలో అరటీ స్పూన్ పొడి కలిపి సేవిస్తే నరాల బలహీనత తగ్గి నీరసం, నిస్త్రాణం లేకుండా ఆరోగ్యంగా ఉంటారు.

**తలనొప్పులకు:** బాదంపప్పు, దాల్చినచెక్క, లవంగాల చూర్ణాలను సమానంగా కలిపి ఉంచుకొని తగినంత పొడిని తగినన్ని పాలలో కలిపి పేస్టులా చేసి కణతలకి పట్టించి అరగంటాగి కడిగేస్తే తక్షణం తలనొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది.



పాఠం-22

# సంస్కృతం నేర్చుకుందాం..!!

రచన- కీ.శే. మహామహోపాధ్యాయ కాశీ కృష్ణాచార్య కీ.శే. మహామహోపాధ్యాయ సముద్రాల లక్ష్మణయ్య

एतेषाम् = వీరి-యొక్క-కి
केषाम् = ఎవరి-యొక్క-కి?
अञ्जनम् = కాటుక-ను

आरात् = దూరముగా, దగ్గరగా
सकृत् = ఒక మాఱు
कृत्वा = చేసి

भविष्यत् = భవిష్యత్కాలము
प्र. खादिष्यति = खादिष्यन्ति
म. खादिष्यसि = खादिष्यथ
उ. खादिष्यामि = खादिष्यामः

అ) ఈ క్రింది వాటికి తెలుగులోకి అనువాదం చేయండి?

01) वयं भोजनं कृत्वा फलं खादिष्यामः।
02) त्वम् आलस्यं मा कुरु।
03) झटिति स्नानं कृत्वा भोजनं कुरु।
04) अस्मद्गृहे फलानि न सन्ति।
05) युष्मद्गृहे अन्नम् अस्ति चेत् भोजनं कुरुत।
06) नोचेत् तूष्णीं स्त।
07) हे ब्राह्मणाः! किमर्थं भिक्षाटनं करिष्यथ?
08) अरे बालक! अस्मद्गृहे फलानि सन्ति खादिष्यसि किम्?
09) किं फलमस्ति?
10) तव किमर्थम्, अहं खादिष्यामि।
11) अञ्जनं कुत्रास्ति?

అ) జవాబులు

01) మేము/మనము భోజనం చేసి పండును తినగలము.
02) నీవు ఆలస్యము చెయ్యొద్దు.
03) వెంటనే స్నానం చేసి భోజనం చేయి.
04) మా ఇంట్లో పండ్లు లేవు.
05) మీ ఇంట్లో అన్నం ఉంటే భోజనం చేయండి.
06) లేకుంటే మౌనంగా ఉండండి.
07) ఓ బ్రాహ్మణులారా! ఎందుకు భిక్షాటనం చేస్తారు?
08) ఓ బాలుడా! మా ఇంట్లో పండ్లు ఉన్నవి. తినగలవా ఏమి?
09) ఏమి పండు ఉన్నది?
10) నీకు ఎందుకు, నేను తినగలను.
11) కాటుక ఎక్కడ ఉన్నది?

ఆ) ఈ క్రింది వాటికి సంస్కృతంలోకి అనువాదం చేయండి?

01) కాని మా తండ్రి యే పండు తినగలడు?
02) మీరీపండును తినరా?
03) మేమీ పండును తినము.
04) మీ ఇంట్లో పండ్లున్నవా?
05) వీరి ఇంట్లో పండ్లు లేవు.
06) ఎవరికి అన్నము లేదు? నాకు లేదు.
07) ఎందుకు లేదు?
08) ఈ వేళ మా తమ్ముడు వంటను చేయలేదు.
09) అయ్యో! మా ఇంట్లో ఉన్నదిగాని, త్వరగా స్నానంచేసి తినెదవా?
10) అలాగే తినెదను గాని ఎక్కడ ఉన్నది?
11) మా ఇంట్లో కాటుక లేదు?

ఆ) జవాబులు

01) परं मम पिता कस्य फलं खादिष्यति?
02) यूयम् एतद् फलं न खादिष्यथ?
03) वयम् एतद् फलं न खादिष्यामः।
04) युष्मद् गृहे फलानि सन्ति वा?
05) एतेषां गृहे फलानि न सन्ति।
06) केषाम् अन्नं नास्ति? मम नास्ति।
07) किमर्थं नास्ति?
08) अस्मिन् दिने अस्मद् अनुजः पाकं नाकरोत्।
09) अहो! अस्मद् गृहे अस्ति खलु वेगेन स्नानं कृत्वा खादिष्यसि वा?
10) अस्तु खादिष्यमि परं कुत्र अस्ति?
11) अस्मद् गृहे अञ्जनं नास्ति।

బాలనీతి

# దాతలలో మేటి 'శిబిచక్రవర్తి'

– కీ.శే. ఉషశ్రీ

పూర్వం ఉశీనరుడనే మహారాజు ఉండేవాడు. అతని కుమారుడు 'శిబి'. ఈయన 'మహాదాతగా' ముల్లోకాలలో ప్రఖ్యాతి పొందాడు. అంతటి కీర్తిపొందిన శిబిచక్రవర్తి దాన విశేషం ఏమిటో పరీక్షించాలని ఇంద్రుడు డేగలాగా, అగ్ని పావురంలాగా రూపాలు ధరించి బయలుదేరారు.

ఆ పావురాన్ని తరుముతూ డేగ వస్తున్నది. పావురం గజ గజ వణుకుతూ ఎగిరి ఎగిరి అలసటతో శిబిచక్రవర్తి దగ్గరకు వచ్చింది, 'శరణు, శరణు మహారాజా!' అని ప్రార్థించింది.

అప్పుడు అక్కడే ఉన్న రాజపురోహితుడు– 'మహారాజా! ఈ పావురం ప్రాణభయంతో నిన్ను శరణు వేడింది. ఏ జీవికైనా ప్రాణం అత్యంత ప్రీతికరమైంది. అట్లే ప్రాణరక్షణకంటే ఉత్తమ కర్మ లేదు. కానీ, విద్వాంసులు– పావురాలను చేరదీయడం మృత్యుసూచక మంటున్నారు. దానికి ప్రాయశ్చిత్తం తప్పదు' అని అన్నాడు.

అది విని ఆ పావురం– "మహారాజా! ఆ డేగకు భయపడి నేను నిన్ను శరణు వేడాను. నేనొక మహా మునిని. ఆ రూపం విడిచి ఇలా తిరుగుతున్నాను. దీనులకూ, అసమర్థులకూ మహారాజే రక్షకుడని వేదాలు ఘోషిస్తున్నాయి. కనుక నిన్ను శరణు వేడుకున్నాను" అంది.

అప్పటికి అక్కడ చేరిన డేగ–"మహారాజా! ప్రతి జీవికి ఎన్నో రూపాలు ప్రాప్తిస్తాయి. ఇది పావురమై నిన్ను శరణు వేడింది. అయితే పావురాలు డేగలకు ఆహారం అని మరిచిపోకు. కాబట్టి నా నోటి దగ్గర ఆహారమైన ఈ పావురాన్ని విడిచి పెట్టి నా ప్రాణాలు కాపాడు" అంది.

ఆ పక్షుల మాటలు వింటున్న శిబి చక్రవర్తి మనస్సు ఆందోళనలో పడిన వాడై– 'ప్రాణభీతితో వచ్చి శరణు వేడిన వారికి అభయమివ్వని రాజుయొక్క దేశంలో వానలు కురియక, పంటలు ఎండి క్షామదేవత విలయ తాండవం చేస్తుంది. పైగా అటువంటి రాజ్యంలో ప్రజలకు రక్షణలేక నానా బాధలు పడతారు.

అందువల్ల మహారాజు నరకంలో పడతాడు. మరి– ఈ డేగ ఆకలితో ఉంది. దాని ఆహారం పావురం. దాని నోటి ముందు అన్నం తీసేయ్యడమూ పాపమే. ఇప్పుడు నా కర్తవ్యమ్ ఏమిటి?' అని ఆలోచిస్తూ రాజు డేగతో ఈ విధంగా సంభాషించ సాగాడు.





శిబిచక్రవర్తి ముల్లోకాలలో 'మహాదాత'గా ప్రఖ్యాతి చెందాడు

రాజు– ఓ డేగా! నీకు ఇంతకంటే రుచిగా ఉండే, బలం కలిగించే ఆహారం ఇప్పిస్తాను. దీన్ని విడిచిపెట్టు.

డేగ– మహారాజా! ఈ పావురమాంసం కంటే రుచికర మైన ఆహారం మరొకటి లేదు. ఏ పక్షీ దొరకనప్పుడు పావురాలనే మాకు ఆహారంగా ఇచ్చాడు బ్రహ్మదేవుడు.

శిబి– ఓ డేగా! శరణు వేడిన ఈ పావురాన్ని విడిచి ధర్మహాని చెయ్యను. నా ప్రాణాలు వదులుకుంటాను, కానీ అభయమిచ్చిన ప్రాణికి హాని జరగనివ్వను. అందుచేత నువ్వు పావురాన్ని విడిచి ఏమైనా అడుగు.

డేగ– మహారాజా! నువ్వు అంత దయచూప దలచి నట్లయితే నా మాట విను. నీ కుడితొడ చీల్చి దానిలోని మాంసం తీసి ఈ పావురం బరువుతో సమంగా తూచి, ఆ మాంసం నాకియ్యి. ఆరగిస్తాను.

ఇది వింటూనే శిబిచక్రవర్తి, సభలోకి త్రాసు తెప్పించి ఒక వైపు పావురాన్ని ఉంచి, కత్తితో తన తొడ కోసి మాంసం తక్కెడలో ఉంచాడు. తక్కెడలో ఎంత మాంసం పెడుతున్నా పావురం బరువుకి సమం కావడం లేదు. రెండవ తొడ, చెయ్యి కోసిపెట్టినా అది తూగలేదు. ఇంతలో శిబి తానే త్రాసులో కూర్చున్నాడు.

డేగ– చాలు, నేను వెడుతున్నాను, అని ఎగిరిపోయింది.

అది చూసి శిబిచక్రవర్తి– 'ఓ పావురమా! నువ్వెవరవు? ఏమిటి నీ కథ?' అని అడిగాడు.

'మహారాజా! నేను అగ్నిహోత్రుడను. ఆ డేగ దేవేంద్రుడు. నీ కీర్తి విని, నీ శరణాగత రక్షణ దృష్టినీ, దాన శక్తినీ పరిశీలించాలని వచ్చాం. నువ్వు విజయం పొందావు. నీ యశశ్చంద్రికలు ఈ భూలోకమంతటా వ్యాపిస్తాయి. నీకు కలిగే కుమారుడు కూడా నీ కీర్తిని నిలబెడతాడు' అని అదృశ్య మయింది.

ఈ విధంగా శరణు వేడిన ప్రానికోసం తన శరీరాన్నే దానం చేసిన మహాపురుషుడు కనకనే 'శిబిచక్రవర్తి' పేరు ప్రఖ్యాతమయింది. కాబట్టి– **'శరణు కోరినవారిని విడిచి పెట్టరాదు'.**

# శ్రీకృష్ణామృతం..

**వేదజ్యోతిగా నిత్యమూ వెలుగును చూపువాడు**
**వేదసారమై ఇలనుల బ్రోచువాడు**

**వేదవిహితము ఇదియని 'గీత' ను తెలిపినాడు**
**వెనుక జన్మల పాపములు తీసి ఆచార్యుడైనాడు**

**వెలిగొండ స్వామికి ప్రియమగు వేల్పు వాడు**
**వెల్లివాకమ్మతల్లి సవతికి అనుజుడు వాడు**

**వేదండమూ పిలువ మకరమును మట్టుపెట్టినాడు**
**వెలిగౌరు స్వామికి గర్వభంగము సేసినాడు**

**వేల్పుబోనము పంచ మోహినిగా వెలసినాడు**
**వెరవరీవేత్త తానై పార్థుని బ్రోచినాడు**

**వెఅవెఅపాటునముంచి హిరణ్యుని చీల్చినాడు**
**వెదురువేణువుదాల్చి కంసునీ కూల్చినాడు**

**వేవేల నామముల వెలసిల్లు సార్వభౌముడు వాడు**
**వేగిరమే భక్తుల కావగ వేంకటాద్రిపై వెలసినవాడు**

**వేంకటపతియే శ్రీపతి వేడిన వినుకొనువాడు**
**వేల్పుగ వేంకటాద్రిపై వెలసెననంతరాయుడు వాడు**



*–'అనంత'*
*కృష్ణసుందరి సత్తిరాజు,*
*99103 45794*

చిత్ర కథ

# ఏకాదశి

కథ- శ్రీ డి.శ్రీనివాసదీక్షితులు
చిత్రాలు- శ్రీ కె.ద్వారకనాథ్








సర్వే జనాః సుఖినో భవన్తు!

విశ్వదాభిరామం వేమన పద్యసూక్తి



# దుష్టుడివల్ల వంశనాశం

ఉత్తమునికడుపున ఓగు జన్మించిన,
వాడు చెరచు వానివంశ మెల్ల;
చెఱకు వెన్ను పుట్టి చెఱచదా తీపెల్ల;
విశ్వదాభిరామ! వినుర వేమ!

**అర్థాలు:** ఉత్తముడు= మంచివాడు; జన్మించిన= పుట్టిన; ఓగు= దుష్టుడు; వెన్ను= ఎన్ను; పంటకు తగిన కాలంలో పుట్టేకంకి.

**భావం:** చెఱకుకు వెన్ను పుట్టి చెఱకు తీపంతా చెరచినట్లుగా ఉత్తమునికడుపులో దుష్టుడు జన్మిస్తే, వాడు ఉత్తముని వంశగౌరవమంతా చెరుస్తాడు.

**వివరణ:** పోర్చుగీసు, డచ్చి, ఫ్రెంచి, ఇంగ్లీషువాళ్లు మన దేశంలో అడుగుపెట్టక ముందుకాలంలో మన దేశంలో పండే చెఱకు చాలామృదువుగా ఉండేది (ఆరోజుల్లో చెఱకును మన్మథునివిల్లు అన్నారు). ఆ చెఱకును వెన్నుపుట్టకముందే పొలంనుంచి వేరు చేయాలి. అలా చేయకపోతే చెఱకులోని తీపిచెడిపోతుంది. రైతు సకాలంలో ఆపంటను తెంచుకోకపోతే నష్టపోయేవాడు. విదేశీయులు ఆ చెఱకుకు వెదురుతో అంటు కట్టారు. రైతుకు ప్రయోజనం చేకూరింది. అయితే చెఱకుబొప్పె వెదురువలె గట్టిపడింది. వెన్నుపుట్టినా చెఱకుకు తీపిచెడడం లేదు. ఈపద్యాన్ని వేమనకాలంలోని చెఱకుకు అన్వయించుకొనవలసియున్నది. 'కొఱగానికొడుకు పుట్టిన కొఱగామియ కాదు, తండ్రి గుణముల జెఱచున్, చెఱకు తుద వెన్ను పుట్టి చెఱకున తీపెల్ల చెఱచు గదరా సుమతీ'.

– కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు

భాస్కర శతకం

# బంగారానికి 'వన్నె' శాశ్వతం



హాళిని బుట్టు బుద్ధి తిరమైన
 విధంబునఁ బెట్టు బుద్ధులా
వేళల కంతెఁ గాని మఱి వెన్నకు నిల్వవు;
 హేమకాంతి యె
న్నాళుల కుండుఁ గాని యొకనాఁడు
 పదంపడి సానఁబట్టినన్
దాళుక యుండునే ఇనుపతాటకుఁ
 జాయలుపోక భాస్కరా!

**భాస్కరా! మానవునికి పుట్టకతో వచ్చిన బుద్ధి స్థిరంగా నిలచి ఉంటుంది. కాని కృత్రిమబుద్ధులు (తెచ్చి పెట్టుకున్న బుద్ధులు) ఆయా సమయాలకే పరిమితమై ఉంటాయి తప్ప ఆ తర్వాతి కాలానికి నిలువవు. బంగారానికి ఉండే వన్నె శాశ్వతంగా ఉంటుంది. ఇనుపరేకును సానపట్టగా వచ్చిన తళుకు కొంచెం సేపే ఉంటుంది. కాని, ఎల్లకాలం ఉండదు గదా!**

వ్యాఖ్యాత : డా॥ తిరుమల శ్రీనివాసాచార్య

# బాలవినోదం

పిల్లలూ... మీ మేధకు పదును పెట్టండి....

## ఇందులో భిన్నమైన బొమ్మ ఏది?




అ)................ ఆ)................ ఇ)................ ఈ)................

పై వరుసలలో అ)పూరిఆలయం, ఆ)యోగాసనాలు, ఇ)ఆషాఢశుద్ధఏకాదశి, ఈ)సంగీత పరికరాలు- మొదలైన బొమ్మలకు సంబంధం లేని బొమ్మలను గుర్తించండి?

జవాబులు: అ)తిరుమల రథోత్సవం ఆ)నృత్యం ఇ)ఉమామహేశ్వర ఈ)గజ్జలు

## పిల్లలూ! దారి కనుక్కోండి!!







ఆంజనేయస్వామివారు శ్రీరాములవారిని చేరుకోవడానికి వెళ్లే సరైనమార్గాన్ని కనుక్కోండి!!

## చిత్రలేఖనం

ఈ క్రింది బొమ్మకు రంగులు వేద్దామా...



ఈ పక్కన ఉన్న బొమ్మను క్రింది గడులలో గీయండి...

# క్విజ్ 11

01) శ్రీమన్నారాయణుడు పంచాత్మస్వరూపుడని ఏ ఉపనిషత్తు పేర్కొంది? జ)...........

02) ఆలయగోపురనిర్మాణం, ఆలయాలు ఏ రీతిలో కట్టాలని ఏ గ్రంథంలో చెప్పబడింది? జ)...........

03) గురుశిష్యులు చెప్పుకునే శాంతిపాఠవాక్యం? జ)...........

04) ధర్మానికి ప్రధాన శత్రువు? జ)...........

05) విష్ణువు మురాసురునితో యుద్ధం చేసి అలసి సేదతీరిన గుహ పేరు? జ)...........

06) ఏకాదశిని వామనపురాణాన్ని ఏ విధంగా అభివర్ణించింది? జ)...........

07) మార్కండేయమహర్షి పెంచిన శిశువు పేరు ఏమి? జ)...........

08) తిరువిణ్ణగర దివ్యదేశ ధర్మదేవత? జ)...........

09) సుగంధతైల సమర్పణ ఉత్సవంగా జ్యేష్ఠాభిషేకాన్ని పేర్కొన్న గ్రంథం? జ)...........

10) పెరియాళ్వారుకున్న మరొక పేరు? జ)...........

11) భగవంతుని మంగళాశాసనం చేయడంలో మిక్కిలి భక్తిని కల్గినవారు? జ)...........

12) సకలసమైక్యత సమగ్రతలకు మారు పేరుగల క్షేత్రం? జ)...........

13) వైఖానసఆగమశాస్త్ర ప్రవర్తకులు ఎవరు? జ)...........

14) చిత్తం అంటే ఏమిటి? జ)...........

15) సమాధిస్థితికి తీసుకుపోయే అవస్థ? జ)...........

16) ఉశీనరమహారాజ పుత్రుని పేరు? జ)...........

17) వేదాలకు అధిష్ఠానదేవత.... జ)...........

18) పలు అంతస్తులు కల్గిన వేదం ఎటువంటిది? జ)...........

19) లీలావతిగణితాన్ని వ్రాసింది? జ)...........

20) శ్రీకృష్ణదేవరాయలు తిరుమలను ఎన్నిమార్లు దర్శించారు? జ)...........

## నియమనిబంధనలు

01) పదిహేనేళ్లలోపు బాలబాలికలు మాత్రమే ఈ 'క్విజ్'లో పాల్గొనాలి.

02) ఇందులో పాల్గొనే పిల్లలు తప్పనిసరిగా హిందువులై ఉండాలి.

03) నిర్దేశించినస్థలంలోనే జవాబులు రాసి పంపాలి. క్విజ్ సమాధానపత్రం జిరాక్స్ప్రతులు పంపేటట్లు అయితే, చందా నమోదుసంఖ్య తప్పనిసరి.

04) సమాధానాల్లో కొట్టివేతలు, దిద్దుబాట్లు ఉండకూడదు.

05) జవాబులు చేరాల్సిన చివరితేది 25-06-2023.

06) ఈ క్విజ్‌లో అన్ని సమాధానాలు సరిగ్గా రాసిన బాలబాలికల పేర్లను వచ్చేతదుపరినెల సప్తగిరిమాసపత్రికలో ప్రచురిస్తాం.

07) తి.తి.దే. ప్రధానసంపాదకులవారి కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులపిల్లలు ఈ క్విజ్‌పోటీలో పాల్గొనకూడదు.

08) క్విజ్‌కు సంబంధించి ఏ సమాచారమూ ఫోన్‌ద్వారా ఇవ్వబడదు.

09) ఈ క్విజ్‌లో పాల్గొనే పిల్లల తల్లిదండ్రులు తప్పనిసరిగా సప్తగిరి మాసపత్రిక చందాదారులై ఉండాలి. క్విజ్ సమాధాన పత్రంలో ఈ క్రిందివివరాలు స్పష్టంగా రాసి పంపాలి.

10) జవాబులను బాల్‌పెన్నుతో మాత్రమే రాసిపంపాలి. పెన్సిల్, స్కెచ్, జెల్‌పెన్నులతో రాయకూడదు.

11) ఈ ప్రశ్నలకు జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. వెతికి రాయండి.

చందాసంఖ్య: ........... వయస్సు: ...........

పాఠశాల: ........... తరగతి: ...........

పేరు: ...........

చిరునామా: ...........

...........

...........

........... పిన్‌కోడ్: ...........

ఫోను నెంబరు: ...........

**జవాబులు చేరాల్సిన చిరునామా**

ప్రధాన సంపాదకులు, 'సప్తగిరి' మాసపత్రిక, తి.తి.దే.ప్రెస్ కాంపౌండ్,
కె.టి.రోడ్డు, తిరుపతి-517 507. తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్

# రాశిఫలాలు

బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి,
తి.తి.దే. ఆస్థానసిద్ధాంతి, రేలంగి



**మేషం–** పెట్టుబడులుకు కానీ నూతన వ్యాపారములకుగాని ఈ మాసంలో తగిన సమయం కాదు. ద్వితీయార్థం అనుకూలం. బంధుమిత్రులతో శుభకార్యనిర్వహణ చేస్తారు.



**వృషభం–** అనారోగ్య సమస్యలు తొలగుతాయి. ఆరోగ్యంగా ఉంటారు. కొత్తదృక్పథాన్ని అలవరచుకుని, కొత్తకోణాన్ని ఆవిష్కరిస్తారు. సోదరులు కుటుంబసభ్యులు మీకు సహకారాన్ని అందిస్తారు.



**మిథునం–** ఈ మాసంలో గౌరవం, ప్రతిష్ఠ మరియు సమాజంలో మంచిగుర్తింపు లభిస్తుంది. సంతానం మద్దతు, ప్రేమ మీకు ఉంటుంది. మీరు మీ ప్రయత్నాలలో విజయం సాధిస్తారు.



**కర్కాటకం–** ఈ నెలలో ఊహించని లాభాలను పొందుతారు. మీ పై అధికారుల నుండి ప్రశంసలు పొందుతారు. వ్యాపారం కూడా లాభదాయకంగా ఉంటుంది. పదోన్నతితో కూడిన స్థానచలనాలు ఆశించవచ్చు.



**సింహం–** ఈ నెలలో ఊహించని లాభాలను పొందుతారు. అందరి ప్రశంసలు పొందుతారు. వ్యాపారం కూడా లాభదాయకంగా ఉంటుంది మరియు ఆదాయం పెరుగుతుంది. పదోన్నతి పొందే అవకాశాలు కూడా ఉన్నాయి.



**కన్య–** మీరు ఆర్థిక సమస్యల నుండి బయట పడతారు. సమాజంలో మెరుగైనస్థానం పొందే అవకాశం ఉంది, ఈ కాలంలో మీస్నేహితులు కూడా మీకు సహకరిస్తారు.



**తుల–** ఆరోగ్యంపై దృష్టి సారించండి. అనవసరఖర్చులు చేయవద్దండి. వృత్తివ్యాపారాలను పెంచడానికి ఆర్థికసంస్థలనుండి ఋణం తీసుకునే అవకాశం ఉంది.



**వృశ్చికం–** విద్యావిషయాల్లో పురోగతి, యత్నకార్యసిద్ధి, శరీరము ఆరోగ్యంగా ఉండుట జరుగును. అన్ని ప్రయత్నాల్లోనూ విజయాలు సాధిస్తారు. జ్ఞానం వృద్ధి చెందుతుంది.



**ధనుస్సు–** ఆరోగ్యవిషయాలలో స్వస్థత చేకూరి ఉపశమనం కల్గుతుంది. సంతోషకరమైన మరియు అదృష్టం కలిగేకాలము. మీ ప్రయత్నాలు విజయాన్ని అందిస్తాయి. వ్యాజ్యాల విషయాల్లో కూడా ఉపశమనం కనిపిస్తుంది.



**మకరం–** మీరు మీ ఉద్యోగజీవితంలో సమస్యలను తొలగించుకోవాల్సి ఉంటుంది. పోటీదారులు మీ పై పోటీ చేసే అవకాశం ఉంది. మానసిక ఒత్తిడి ఉంటుంది. వాదనలకు దూరంగా ఉండాలి.



**కుంభం–** గృహవాతావరణం అనుకూలంగా ఉంటుంది. శుభకార్యం, వ్యవసాయ పెట్టుబడులకు ధనాన్ని వెచ్చించవలసి ఉంటుంది. పదోన్నతితో కూడిన స్థానచలనం రావొచ్చు.



**మీనం–** వృత్తిఉద్యోగాలలో ప్రమోషన్ లేదా వేతన పెంపు కల్గుతుంది. కుటుంబంలో ఆనందం, మంచిఆరోగ్యంతో ఉంటారు. ధైర్యయుక్తమైన ఏ ప్రయత్నమైనా సానుకూల ఫలితాలను అందిస్తాయి.

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి



# సప్తగిరి

(ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక)

## చందా నమోదు పత్రం

1. పేరు మరియు చిరునామా :
(విడి విడి అక్షరాలలో అర్థమయ్యేలా వ్రాయండి & పిన్‌కోడ్ తప్పక వ్రాయండి)

(పిన్‌కోడ్ తప్పనిసరి)

సెల్ నెం.

2. కావలసినభాష :
తెలుగు ☐ తమిళం ☐ కన్నడం ☐
హిందీ ☐ ఆంగ్లం ☐ సంస్కృతం ☐

3. సంవత్సరచందా : ☐ రూ.240/-
జీవితచందా ☐ రూ.2400/- (12 సం॥రాలు)

4. విదేశాలకు సంవత్సరచందా : ☐ రూ.1030/-

5. చందా పునరుద్ధరణ :
(అ) చందానెంబరు :
(ఆ) భాష :

6. చెల్లించిన మొత్తం :
డి.డి.నెం. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / అట్ పర్ చెక్ మాత్రమే :
.................................................... తేది : ..................

ప్రదేశం :
తేది : చందాదారుని సంతకం

1) సప్తగిరి సంవత్సర చందా రూ.240/-, జీవితచందా(12 సం॥రాలు) రూ.2400/-లు, విదేశాలకు సంవత్సర చందా రూ.1030/-; డి.డి. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / అట్ పర్ చెక్‌లను 'చీఫ్ ఎడిటర్, 'సప్తగిరి', తి.తి.దే., తిరుపతి' వారిపేరున తీయాలి.
2) సప్తగిరిచందాదారులుగా చేరదలచుకొన్నవారు/ తమచందాను పునరుద్ధరించుకోదలచినవారు ఈ కూపనులోగానీ లేక తెల్లకాగితంలోగానీ పైన పేర్కొన్నవిధంగా వివరాలు వ్రాసి పంపవచ్చు. క్రింద ప్రచురించిన చిరునామాను మాత్రమే సంప్రదించండి. ప్రధానసంపాదకకార్యాలయం, తి.తి.దే., తిరుపతికి తప్ప- మీరు ఎవరిదగ్గర డబ్బులు కట్టి, మోసపోకండి.
3) మనిఆర్డరు పంపేవారు - అందులోనే మీచందావివరాలు వ్రాసి, ఈ క్రింది చిరునామాకు పంపాలి.
4) మా చిరునామా "ప్రధాన సంపాదకుడు, సప్తగిరి కార్యాలయం, టి.టి.డి. ప్రెస్ కాంపౌండ్, కె.టి.రోడ్డు, తిరుపతి - 517 507".
5) ఇతర వివరాలకు ఫోన్ నెం.0877-2233333, 2277777.

# వైకుంఠపాళి 89



నిర్వహణ: శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు, 90003 24024

### అడ్డం

1)పదితలలు కల్గిన రాక్షసుడు(5); 4)కిరణము(2); 5)నాశనము(3); 6)వేప(2); 10)సీతనపహరించిన రావణునితో పోరాడిన పక్షి(4); 11)శ్రీరామునికి ఆదిత్యహృదయం బోధించిన మహర్షి(4); 13)పసిపిల్లల బుగ్గలపై పెట్టేది(2); 14)ప్రేమ(2); 15)చీకట్లు(2); 18)మెల్లమెల్లగా వీచేగాలి(5)

### నిలువు

1)'దండ'లో గుండెదడ(2); 2)పద్మము(4); 3)రాల్చు, పడవేయు అనే అర్థాల్లోనుపయోగించునది(2); 4) ఉపయోగము(5); 7)ఇన్నిసార్లు పరశురాముడు దండయాత్ర చేశాడు(5); 8)దేవతల శిల్పి(3); 9)పక్షి(3); 12)అడ్రస్(4); 16)ఇది ఉంటే మనిషికి కళ్లు మూసుకుపోతాయి(2); 17)చిట్టచివరికి పూర్తి అయ్యేది(2)

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.
- ప్రధాన సంపాదకుడు



Printed by Sri P.Ramaraju, M.A., and Published by Dr. K.Radharamana, M.A., M.Phil., Ph.D., on behalf of Tirumala Tirupati Devasthanams and Printed and Published at Tirumala Tirupati Devasthanams Press, K.T.Road, Tirupati - 517 507. Editor: Dr.V.G.Chokkalingam, M.A., Ph.D.

# తిరుమల తిరుపతి దేవస్థానములు

# నిర్మాల్యపు పుష్పాల ఉత్పత్తులు

## ఫోటోఫ్రేములు మరియు కీ చైన్లు (డ్రైఫ్లవర్ టెక్నాలజీ)










## అగరుబత్తీలు (నిర్మాల్యపు పుష్పాల ఉత్పత్తులు)









వివరాలకు – 0877-2277777, 2233333

SAPTHAGIRI (TELUGU) SPIRITUAL ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthanams printing on 25-05-2023 and posting at Tirupati RMS. Regd. with the Registrar of Newspapers for India under RNI No.21139/1970. Postal Regd.No.TRP/155/2021-2023 "Licenced to post without prepayment No.PMGK/RNP/WPP-04(1)/2021-2023" posting on 5th of Every Month.

